www.peoplesnews.in

హైదరాబాద్
# పీపుల్స్ న్యూస్
దినపత్రిక

ప్రజల గొంతుక...

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 15 సంచిక : 85 శనివారం, డిసెంబర్ 20, 2025 , పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad

రండి.. అక్షరాన్ని
అనుకున్న విధంగా రాద్దాం

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నది విన్నది పంచుకున్నది ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక

జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను

సంప్రదించండి
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్
9866330400



## ప్రజావాణితో సమస్యలకు
# పరిష్కారం

### 74శాతం ఫిర్యాదులు పరిష్కరించాం
### రెండేళ్ల ప్రజావాణి వార్షికోత్సవంలో భట్టి

**హైదరాబాద్,డిసెంబర్19 :** ఇందిరమ్మ రాజ్యంలో ప్రజా సమస్యల పరిష్కారమే రాష్ట్ర ప్రభుత్వం ధ్యేయమని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఇందుకోసం తామంతా అహరహం శ్రమిస్తున్నామని అన్నారు. అలాగే సమస్యల పరిష్కారానికి ప్రజావాణి ప్రారంభించిన రెండేళ్లల్లో ఇప్పటి వరకు 74 శాతం ఫిర్యాదులు పరిష్కరించామని తెలిపారు. బేగంపేట ప్రజాభవన్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి ప్రజావాణి 2వ వార్షికోత్సవానికి భట్టి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ప్రజావాణి ఇన్‌ఛార్జి దివ్యదేవరాజన్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు లబ్దిదారుల తమ అనుభవాల పంచుకున్నారు. అంకితభావంతో సేవలు అందించి.. ఫిర్యాదుల పరిష్కారానికి కృషి చేసిన అధికారులను సన్మానించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ...

మిగతా2లో...

## శ్రీశైలం పర్యటనలో ఎన్నికల ప్రధానాధికారి జ్ఞానేశ్ కుమార్

### అప్రూబాద్ వద్ద స్వాగతించిన కలెక్టర్, ఎస్పీలు



**నాగర్‌కర్నూలు,19 :** భారత ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ హైదరాబాద్ చేరుకున్నారు. శ్రీశైలం వెళ్లే క్రమంలో నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ

మిగతా2లో...

## ఎంపిలకు స్పీకర్ ఓంబిర్లా
# తేనీటి విందు

### సరదాగా ముచ్చటించుకున్న సభ్యులు
### హాజరైన ప్రధాని మోడీ, రాజ్‌నాథ్ సింగ్
### ప్రధాని విదేశీ పర్యటనపై ప్రియాంక ఆరా



**న్యూఢిల్లీ,డిసెంబర్19 :** పార్ల మెంటు శీతాకాల సమావేశాలు మూడువారాల పాటు వాడివేడి చర్చలు, వాకౌట్లు, నిరసనల మధ్య ముగిసాయి. ఉభయసభలు నిరవధికంగా వాయిదా పడటంతో సభలోని వాతావరణాన్ని తేలిక చేసేందుకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా శుక్రవారం ఉదయం ఎంపీలందరికీ తన నివాసంలో తేనేటి విందు ఇచ్చారు. గత సమావేశాల మాదిరిగా కాకుండా ఈ టీపార్టీకి విపక్ష ఎంపీలు కూడా హాజరయ్యారు. స్నేహపూర్వక వాతావరణంలో సరదా ముచ్చ ట్లతో సభ్యులంతా సందడిగా

మిగతా2లో...



## క్రిస్మస్ వేడుకలకు సిఎంకు ఆహ్వానం

**హైదరాబాద్,డిసెంబర్19 :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మంత్రి అజారుద్దీన్, క్రిస్టియన్ మైనారిటీ నేతలు కలిసారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎల్బీ స్టేడియంలో నిర్వహించే క్రిస్మస్ వేడుకలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి అజారుద్దీన్, క్రిస్టియన్ మైనారిటీ నేతలు ఆహ్వానం అందించారు. ఏటా ప్రభుత్వం క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తోంది. మైనార్టీ శాఖ దీనిని చేపట్టింది.

## ఉద్యోగ నియామకాల్లో
# పారదర్శకతకు పెద్దపీట

### సమస్యలపై వేగంగా స్పందించి..చర్యలు తీసుకోవాలి
### వికసిత భారత్ లక్ష్య సాధనలో సర్వీస్ కమిషన్ల పాత్ర కీలకం
### పబ్లిక్ సర్వీస్ కమిషన్ల జాతీయ సదస్సులో రాష్ట్రపతి ముర్ము




**హైదరాబాద్,డిసెంబర్19 :** ఉద్యోగ నియామకాల విషయంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్లు వేగంగా స్పందిస్తున్నాయని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీలో నిర్వహించిన పబ్లిక్ సర్వీస్ కమిషన్ల జాతీయ సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సదస్సులో పాల్గొనడం గౌరవంగా భావిస్తున్నా. 1950 తర్వాత యూపీఎస్సీ, పబ్లిక్ సర్వీస్ కమిషన్ల ఏర్పాటు మొదలైంది. ఈ విషయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కీలక పాత్ర పోషించారు. నియామకాల్లో పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యమివ్వాలి. ఎదురవుతున్న సవాళ్ల కు త్వరితగతిన పరిష్కారం అవసరం అని రాష్ట్రపతి అన్నారు. నియామకాల్లో పారదర్శకత, ప్రజల్లో విశ్వసనీయత

మిగతా2లో...

# పంచాయితీలకు సెలవ్.. పెట్టండి

### ఎంపిటిసి,జడ్పీటిసిలకు ప్రిపేర్ కండి

- ఇక అన్ని ఎన్నికల్లో మనమే గెలవాలి
- గెలిచిన సర్పంచ్‌ల అభినందనలో కెటిఆర్



**రాజన్నసిరిసిల్ల,డిసెంబర్19 :** పార్లమెంట్ ఎన్నికల్లో గెలవడం సులభం కానీ.. పంచాయతీ ఎన్నికల్లో గెలవడం కష్టమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సిరిసిల్ల జిల్లాలో కాంగ్రెస్ 10 సీట్లు గెలవలేదని.. కానీ ఇప్పుడు బీఆర్ఎస్ 80 గ్రామాల్లో గెలిచిందని తెలిపారు. సిరిసిల్ల నియోజకవర్గంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు, వార్డు సభ్యులతో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో సమావేశమైన కేటీఆర్.. వారికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ ఎన్నికలు అయిపోయాయి కాబట్టి.. పగలు, పంచాయితీలో

మిగతా2లో...

## మానవ ప్రమేయం లేకుండా
# పరకామణి లెక్కింపు

### ఎఐతో పాటు, ఆధునిక యంత్రాలు వినియోగం
### టిటిడికి హైకోర్టు కీలక ఆదేశాలు




**అమరావతి,19 :** తిరుమల శ్రీవారి ఆలయ పరకామణి కానుకల లెక్కింపుపై ఏపీ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. లెక్కింపులో మానవ ప్రమేయాన్ని తగ్గించాలని టిటిడిని హైకోర్టు ఆదేశించింది. ఏఐ, అత్యాధునిక యంత్రాలను వినియోగించాలని సూచించింది. దొంగతనాలను అరికట్టేందుకు రెండు దశల్లో

మిగతా2లో...

## 41మంది మావోయిస్టుల
# లొంగుబాటు

### డిజిపి శివధర్ ఎదుట లొంగిన నక్సల్స్
### లొంగిన వారిలో రాష్ట్ర కమిటీ కార్యదర్శి ఎర్రగొల్ల రవి
### కామారెడ్డికి చెందిన వ్యక్తిగా గుర్తింపు



**హైదరాబాద్,డిసెంబర్19:** నిషేధిత మావోయిస్టు పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో 41 మంది మావోయిస్టు ఆయుధాలతో సహా లొంగిపోయారు. వీరిలో బటాలియన్, వివిధ డివిజనల్, ఏరియా కమిటీ స్థాయి నాయకులు కూడా ఉన్నారు. మొత్తం 24 ఆయుధాలు, 733 తూటాలు, 8 బీజీఎల్ షెల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లొంగిపోయిన మావోయిస్టుల్లో ఇద్దరు తెలంగాణ వాళ్లు ఉండటం గమనార్హం. పోలీసుల వివరాల ప్రకారం..

## నిజామాబాద్ జిల్లాలో దొంగనోట్ల కలకలం

- క్రాప్‌లోన్ కట్టేందుకు వెళ్లిన రైతు వద్ద దొంగనోట్లు
- మొన్నటి సర్పంచ్ ఎన్నికల్లో పంచినవిగా అనుమానం
- పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు ప్రారంభం




## ఫిల్మ్ మేకర్స్‌కి బెస్ట్ స్టేట్‌గా
# తెలంగాణ

- ఫిల్మ్ టెలివిజన్ ఎకో సిస్టమ్ మరింత అభివృద్ధి
- షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో మంత్రి కోమటిరెడ్డి



**హైదరాబాద్,డిసెంబర్19:** దేశంలోనే ఫిల్మ్ మేకర్స్‌కి బెస్ట్ స్టేట్‌గా తెలంగాణను మార్చాలని రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. తెలంగాణలో ఫిల్మ్, టెలివిజన్ ఎకో సిస్టమ్‌ను మరింత అభివృద్ధి చేయడానికి ప్రభు త్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని కోమ టిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. సులభ ంగా, సౌకర్య వంత ంగా సినిమాల నిర్మా ణానికి తెలంగాణ ఎంతో అనుకూ లంగా మారిందన్నారు. సాంస్కృతిక శాఖ

మిగతా2లో...

శనివారం,
డిసెంబర్ 20, 2025

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక



# పంచాయితీలకు సెలవ్.. పెట్టండి

(మొదటి పేజీ తరువాయి)

పక్కనబెట్టి కలిసికట్టుగా ఉండాలని పిలుపునిచ్చారు. సిరిసిల్ల ప్రజలు గులాబీ జెండాను గుండెలను హత్తుకున్నారని కేటీఆర్ అన్నారు. పంచాయతీ ఎన్నికల్లో కొన్ని చోట్ల రెండు వైపులా బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులే నిలబడ్డారని తెలిపారు. త్వరలోనే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరగబోతున్నాయని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీకి, మండల పరిషత్‌కు అనుసంధానకర్త ఎంపీటీసీ అని కేటీఆర్ తెలిపారు. అలాగే జిల్లా పరిషత్‌కు, మండల పరిషత్‌కు సమన్వయకర్త జడ్పీటీసీ అని పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికలతో పంచాయితీలు పక్కనపెట్టాలని సూచించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పల్లెపల్లెనా డంపింగ్ యార్డులు, ప్రగతి వనాలు ఏర్పాటు చేశామని కేటీఆర్ గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పల్లెలు నిర్వీర్యం అయ్యాయని విమర్శించారు.సిరిసిల్లలో ఉన్న 57 ఎంపీటీసీ స్థానాలు గెలిచేలా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. అందరూ కలిసి కాంగ్రెస్‌పై కొట్లాడాలన్నారు. గులాబీ గెలుపును చూసి కాంగ్రెస్ పరేషన్ అయితోందని తెలిపారు. ఓడిపోయిన అభ్యర్థులు కూడా ధైర్యంగా ఉండాలని ధైర్యం చెప్పారు. రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీచేయాలన్నారు. పాత తరం నాయకులు, కొత్త తరాన్ని కలుపుకుంటూ ముందుకుపోవాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అప్పటికప్పుడు మాటలు మారుస్తున్నారని కేటీఆర్ అన్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రేవంత్ రెడ్డి మొదట 66 శాతం సర్పంచ్ స్థానాలు గెలిచామని చెప్పారని తెలిపారు. వెంటనే మాటమార్చి స్థానిక ఎన్నికలతో పార్టీకి సంబంధం లేదంటున్నాడని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి లాగే ఫిరాయింపు ఎమ్మెల్యేలు కూడా మాటలు మారుస్తున్నారని అన్నారు. అభివృద్ధి కోసం కాంగ్రెస్‌లో చేరానని కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్ రెడ్డి చెప్పారని గుర్తుచేశారు. ఇప్పుడు మాటమార్చి బీఆర్ఎస్‌లోనే ఉన్నామని చెబుతున్నారని తెలిపారు. ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకోలేని పరిస్థితిలో కడియం, పోచారం ఉన్నారని విమర్శించారు. గడ్డిపోచలాంటి పదవి కోసం చూరుకు గబ్బిలాల్లా వేలాడుతున్నారని ఎద్దేవా చేశారు.గెలుపు కోసం కాంగ్రెస్ ఎన్ని అరాచకాలు చేసినా ప్రజలు మాత్రం బీఆర్ఎస్‌తోనే ఉన్నారని కేటీఆర్ స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల్లో గులాబీ ప్రభంజనమే అందుకు నిదర్శనమని చెప్పారు. సర్పంచ్ అయినా ఎమ్మెల్యే, ఎంపీలు అయినా ప్రజల కోసమే పనిచేయాలని అన్నారు. ప్రతిపైసా ప్రజల కోసమే ఖర్చు పెట్టాలని సూచించారు. ఐదు అంచెల్లో ప్రభుత్వాన్ని ఎలా నడపాలో అంబేద్కర్ రాజ్యాంగంలో చెప్పారని గుర్తుచేశారు. కేంద్రం పైసలు ఇయ్యకున్నా.. రాష్ట్ర నిధులు ఉంటాయని తెలిపారు. గ్రామ పంచాయతీ నిధులు ఫైనాన్స్ కమిషన్ నుంచి వస్తాయని పేర్కొన్నారు. దాన్ని ఆపే హక్కు ఎమ్మెల్యేలకు లేదు.. సీఎం రేవంత్ రెడ్డికి కూడా ఉండదని స్పష్టం చేశారు.

# నిజామాబాద్ జిల్లాలో దొంగనోట్ల కలకలం

**నిజామాబాద్,డిసెంబర్19:** బ్యాంక్ రుణం కట్టేందుకు వచ్చిన వ్యక్తి దగ్గర అన్నీ దొంగనోట్లు ఉండడంతో అధికారులు ఖంగుతిన్నారు. వెంటనే పోలీసులకు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. బ్యాంకులో పంట రుణం చెల్లించేందుకు తీసుకొచ్చిన నగదు పూర్తిగా దొంగ నోట్లుగా బ్యాంకు అధికారులు గుర్తించారు. రైతు తీసుకొచ్చిన రూ. 2,08,500 లలో అన్నీ రూ.500 నోట్లు నకిలీగా తేల్చారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా వర్ని మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బ్యాంకు అధికారులు వర్ని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. నిజామాబాద్ జిల్లాలోని జలాల్పూర్ గ్రామానికి చెందిన రైతు నరెడ్ల చిన్నసాయిలు పంట రుణం చెల్లించేందుకు గురువారం సాయంత్రం వర్ని మండల కేంద్రంలోని కెనరా బ్యాంకుకు రూ. 2,08,500 తీసుకొచ్చాడు. ఈ క్రమంలో నగదును చెల్లించేందుకు క్యాష్ కౌంటర్‌లో ఇచ్చాడు. క్యాష్ కౌంటింగ్ యంత్రంలో నోట్లను లెక్కిస్తుండగా నకిలీ నోట్లు వచ్చాయి. అప్రమత్తమైన బ్యాంకు అధికారులు, సిబ్బంది డబ్బు ఎక్కడి నుంచి తెచ్చావని రైతును ప్రశ్నించడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. రైతు తీసుకొచ్చిన రూ. 500 నోట్లను బ్యాంకు సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలించగా.. అవన్నీ నకిలీ నోట్లేనని గుర్తించారు. నాలుగు రూ.500 నోట్ల కట్టలపై ఒక్కొక్క కట్టపై ఒకేరకమైన క్రమసంఖ్య ఉండటాన్ని గుర్తించారు. దీంతో నకిలీనోట్లని నిర్ధరించి గురువారం రాత్రి వర్ని పోలీసులకు ఫిర్యాదు చేశారు. బ్యాంకు అధికారి పంకజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నకిలీ నోట్ల వ్యవహారం వర్ని మండలంలో కలకలం సృష్టించింది. పరారీలో ఉన్న రైతు కోసం పోలీసులు గాలిస్తున్నారు. అయితే ఇదంతా మొన్నటి పంచాయితీ ఎన్నికల్లో పంచిన డబ్బుగా చర్చిస్తున్ఆరు. ఈజీగా డబ్బు సంపాదించేందుకు కొందరు కేటుగాళ్లు నకిలీ నోట్ల ప్రింటింగ్ కు పాల్పడుతున్నారు. దొంగనోట్లను ముద్రించి గుట్టుచప్పుడు కాకుండా చలామణిలోకి తీసుకొస్తున్నారు. సర్పంచ్ ఎన్నికల్లో జోరుగా దొంగ నోట్ల చలామణి అయినట్లు అధికారులు గుర్తించారు. రంగంలోకి దిగిన పోలీసులు విచారణ చేపట్టారు. 417 రూ.500 నోట్లు నకిలీగా పోలీసులు తేల్చారు. కాగా ఇవే నోట్లను ఓ అభ్యర్థి సర్పంచ్ ఎన్నికల్లో ఓటర్లకు పంపిణీ చేసినట్లు తేలడంతో గ్రామస్థులు లబోదిబో మంటున్నారు. ఓటు వేసేందుకు నోటు తీసుకున్న వారిలో గుబులు మొదలైంది. స్థానిక ఎన్నికల్లో దొంగనోట్లు చలామణి కావడంతో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

# ఫిల్మ్ మేకర్స్‌కి బెస్ట్ స్టేట్‌గా తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)

సహా పలువురు సినీ ప్రముఖులు, విశ్లేషకులతో కలిసి హైదరాబాద్ ప్రసాద్ ఐమ్యాక్స్‌లో హైదరాబాద్ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ మొదటి ఎడిషన్‌ను లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి వెంకట్ రెడ్డి.. ఈ కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. హైదరాబాద్ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ - 2025.. మన హైదరాబాద్‌కు, మన తెలంగాణకు ఒక మంచి ఆరంభం అని పేర్కొన్నారు. హైదరాబాద్ అంటేనే సినిమాగా పేరుగాంచింద న్నారు. దేశం నలుమూలల నుంచి ఇక్కడికి వచ్చి సినిమాలు చేస్తున్నారని పేర్కొన్నారు. పెద్ద సినిమాలు ఒకవైపు.. షార్ట్ ఫిల్మ్స్ మరోవైపు తీయడం వల్ల హైదరాబాద్ పేరు ప్రఖ్యాతలు మరింత పెరుగుతున్నాయని చెప్పుకొచ్చారు. కొత్త టాలెంట్ ఎక్కువగా షార్ట్ ఫిల్మ్స్ నుంచి వస్తోందన్నారు మంత్రి. షార్ట్ ఫిల్మ్స్ యువతకు ఫ్రీడమ్ ఇస్తాయని.. కొత్తగా ఆలోచించడానికి.. కొత్తగా ట్రై చేయడానికి..

తమ కథని తమ స్టైల్‌లో చెప్పడానికి.. అవకాశాన్ని కల్పిస్తాయన్నారు కోమటిరెడ్డి. ఈరోజు పెద్ద స్థాయిలో ఉన్న చాలామంది ఫిల్మ్ మేకర్స్ మొదట షార్ట్ ఫిల్మ్స్‌తోనే మొదలుపెట్టారని గుర్తు చేశారు మంత్రి. సినిమాటోగ్రఫీ మంత్రిగా తాను ఒక విషయం స్పష్టంగా చెప్తున్నానని.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం సినిమా రంగానికి పూర్తి మద్దతుగా ఉంటుందని భరోసా ఇచ్చారాయన. 'మంచి టాలెంట్‌కు అవకాశం రావాలి.. యువ ఫిల్మ్ మేకర్స్ ముందుకు రావాలి.. వాళ్లకు సరైన ప్లాట్‌ఫామ్ ఉండాలి.. అదే మా ప్రభుత్వ ఆలోచన.' అని ఉద్ఘాటించారు మంత్రి కోమటిరెడ్డి. తమ లక్ష్యం చాలా సింపుల్ అని.. దేశంలోనే ఫిల్మ్ మేకర్స్‌కి బెస్ట్ స్టేట్‌గా తెలంగాణను మార్చాలన్నారు. అనుమతులు ఈజీగా ఉండాలి. 15-20 నిమిషాల షార్ట్ ఫిల్మ్ కూడా మనసులను తాకగలదు. ధైర్యంగా కొత్త కథలు చెప్పండి.

ముందుకు వెళ్లండి.' అంటూ యువ ఫిల్మ్ మేకర్స్‌లో ఉత్తేజాన్ని నింపారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. హైదరాబాద్‌లో ఇంటర్నేషల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహించడం తెలంగాణకు మైలురాయిగా పేర్కొన్న మంత్రి కోమటిరెడ్డి.. యువ ప్రతిభావంతులను వెలికితీసేందుకు, కొత్త ఆలోచలనకు అంకురార్పణ చేసేందుకు లఘు చిత్రాలు ఎంతో దోహదపడతాయన్నారు. సినిమాల్లో ప్రజల సంస్కృతి, జీవన విధానాన్ని ప్రతిబింబించాలని మంత్రి జూపల్లి.. ఔత్సాహిక దర్శక నిర్మాతలకు సూచించారు.

# ఉద్యోగ నియామకాల్లో పారదర్శకతకు పెద్దపీట

(మొదటి పేజీ తరువాయి)

పెంచడంపై దృష్టి సారించాలని పబ్లిక్ సర్వీస్ కమిషన్లకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సూచించారు. నియామకాల్లో ఎదురవుతున్న సవాళ్లకు త్వరితగతిన పరిష్కరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. 2047 వికసిత భారత్ లక్ష్య సాధనలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. అలాగే నియామకాల్లో పారదర్శకత, నైతికత అవసరమని స్పష్టం చేశారు. నైపుణ్యాలు నేర్పవచ్చని కానీ సమగ్రత లోపాన్ని మాత్రం భర్తీ చేయలేమన్నారు. టెక్నాలజీ సవాళ్లను ఎదుర్కొనేలా పబ్లిక్ సర్వీస్ కమిషన్లు ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని కమిషన్ చైర్మన్లకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సూచించారు. రెండు రోజుల పాటు ఈ సదస్సు జరగనుంది. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్లు.. ఈ సదస్సుకు హాజరయ్యారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్లు ఎదుర్కొంటున్న సవాళ్లు, పరీక్షల నిర్వహణలో అనుసరించాల్సిన పద్ధతులు, పరస్పర సహకారంపై ఈ సదస్సులో చర్చించనున్నారు. సదస్సుకు హాజరైన రాష్ట్రపతి ముర్ముకు రామోజీ ఫిలిం సిటీలో ఘన స్వాగతం పలికారు. ఆమె వెంట తెలంగాణకు చెందిన పలువురు మంత్రులతోపాటు ఉన్నతాధికారులు ఉన్నారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మయూపీఎస్సీ చైర్మన్ అజయ్‌కుమార్, యూపీఎస్సీ కార్యదర్శి శశి రంజన్ కుమార్ తదితరులు హాజరయ్యారు. ఈ సదస్సు శనివారంతో ముగియనుంది. ఈ సదస్సుకు భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ హాజరుకాను న్నారు. అంతకుముందు బొల్లారం రాష్ట్రపతి భవన్ నుంచి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము రామోజీ ఫిల్మ్‌సిటీకి చేరుకున్నారు. దేశంలోని పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్‌పర్సన్ల జాతీయ సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. శీతాకాల విడిది కోసం హైదరాబాద్ వచ్చిన ద్రౌపదీ ముర్ము.. బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో రామోజీ ఫిల్మ్‌సిటీకి చేరుకున్నారు. రాష్ట్రపతి వెంట గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రి సీతక్క ఉన్నారు. దేశంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్లు ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చించారు. సదస్సు అనంతరం సాయంత్రం రామోజీ ఫిల్మ్‌సిటీలో వివిధ ప్రదేశాలను ద్రౌపదీ ముర్ము సందర్శించారు.

# 41మంది మావోయిస్టుల లొంగుబాటు

(మొదటి పేజీ తరువాయి)

లొంగిపోయిన వారిలో ఆరుగురు డివిజనల్/కంపెనీ స్థాయి కమిటీ సభ్యులు, 12 మంది ఏరియా/ప్లాటూన్ కమిటీ సభ్యులు, 23 మంది సాధారణ పార్టీ సభ్యులు ఉన్నారు. ఇన్సాస్ ఎల్ఎంజీ, ఏకే47, ఎస్ఎల్ఆర్, ఇన్సాస్ రైఫిళ్లు, .303 రైఫిళ్లు తదితర ఆయుధాలు లొంగుబాటులో భాగంగా అప్పగించారు. మావోయిస్టు పార్టీలో సంస్థాగత బలహీనత, నాయకత్వంపై నమ్మకం తగ్గడం, అడవుల్లో తీవ్ర జీవన కష్టాలు, భద్రతా బలగాల ఒత్తిడి కారణంగానే తాము ప్రధాన జనజీవనంలోకి రావాలని నిర్ణయించుకున్నట్లు లొంగిపోయిన మావోయిస్టులు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపుకు స్పందనగా ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. లొంగిపోయిన వారికి రాష్ట్ర పునరావాస విధానం ప్రకారం డివిజనల్ కమిటీ సభ్యులకు రూ.5 లక్షలు, ఏరియా కమిటీ సభ్యులకు రూ.4 లక్షలు, పార్టీ సభ్యులకు రూ.లక్ష చొప్పున ప్రోత్సాహకం అందించనున్నారు. ఆయుధాలపై అదనపు రివార్డు కూడా ఇవ్వనున్నారు. మొత్తంగా రూ.1.46 కోట్లకు పైగా నగదు ప్రోత్సాహకాలు లభించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ లొంగుబాటుతో తెలంగాణలో మావోయిస్టు కార్యకలాపాలు మరింత బలహీన పడతాయని, మిగిలిన అజ్ఞాత కేడర్లు కూడా హింసను వీడి జనజీవనంలోకి రావాలని పోలీసులు పిలుపునిచ్చారు.నక్సలిజాన్ని రూపుమాపేందుకు, మావోయిస్టులను ఏరివేసేందుకు కేంద్రం ఆపరేషన్ కగార్ ను తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఎంతో మంది మావోలు భద్రతబలగాల ఎన్ కౌంటర్ లో మృతిచెందారు. మరికొందరు పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఈ క్రమంలో తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట 40 మంది మావోయిస్టులు లొంగిపోయారు. డీజీపీ సమక్షంలో జనజీవన స్రవంతిలో మావోయిస్టులు కలిసిపోయారు.. లొంగిపోయిన వాళ్లలో ముగ్గురు రాష్ట్రస్థాయి లీడర్లు.. కొందరు హిడ్మా బెటాలియన్ కమాండర్స్ ఉన్నారు. లొంగిపోయిన వారిలో కామారెడ్డికి చెందిన రాష్ట్ర కమిటీ కార్యదర్శి ఎర్రగొల్ల రవి, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఆరుగురు డివిజన్ కమిటీ సభ్యులు, ఇద్దరు తెలంగాణ వాసులు ఉన్నారు. మిగతా మావోయిస్టులంతా ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారిగా డీజీపీ శివధర్‌రెడ్డి పేర్కొన్నారు.

# శ్రీశైలం పర్యటనలో ఎన్నికల ప్రధానాధికారి జ్ఞానేశ్ కుమార్

(మొదటి పేజీ తరువాయి)

పాటిల్ స్వాగతం పలికారు. శుక్రవారం భారత ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ కుటుంబ సమేతంగా కలిసి శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు ఢిల్లీ నుండి ప్రత్యేక విమానంలో శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడి నుండి నేరుగా రోడ్డు మార్గాన శ్రీశైలం దర్శనానికి వెళ్తూ మార్గమధ్యంలో నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మున్ననూర్ గ్రామ పరిధిలో ఉన్న తెలంగాణ టూరిజం మృగవాణి గెస్ట్ హౌస్ కు చేరుకున్నారు. భారతదేశ ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ కు నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ గణపట్ రావు పాటిల్, నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ కే కార్తీక్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. కాసేపు విరామం తర్వాత నేరుగా శ్రీశైలం దర్శనానికి బయలు దేరి వేళ్ళారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి అమరేందర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎంపిలకు స్పీకర్ ఓంబిర్లా తేనీటి విందు

(మొదటి పేజీ తరువాయి)

గడిపారు. లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ జర్మనీ పర్యటనలో ఉండటంతో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా స్పీకర్ ఇచ్చిన టీపార్టీలో పాల్గొన్నారు. విపక్షం తరపున ప్రాతినిధ్యం వహించారు. 20 నిమిషాల పాటు జరిగిన ఈ సమావేశంలో ఓం బిర్లా, మోదీతో పాటు రాజ్‌నాథ్ సింగ్ కూర్చుని ఉండగా ఆయన పక్కన ప్రియాంక ఆసీనులయ్యారు. తన నియోజకవర్గం వయనాడ్ నుంచి తెచ్చుకున్న ఒక మూలికను ఎలర్జీ రాకుండా తీసుకుంటూ ఉంటానని ప్రియాంక వివరించా రట. మోదీ ఇటీవల జరిపిన ఇథియోపియా, జోర్డాన్, ఒమన్ పర్యటన గురించి ప్రియాంక అడగగా, బాగా జరిగిందని ఆయన బదులిచ్చారు. సమాజ్‌వాదీ పార్టీ నేత ధర్మేంద్ర యాదవ్, ఎన్‌సీపీ (ఎస్‌పీ) నేత సుప్రియా సులే, సీపీఐ నేత డి.రాజా కూడా సమావేశం లో పాల్గొన్నారు. శీతాకాల సమావేశాలను మరికొద్ది రోజులు పొడిగించి ఉండాల్సిందని ధర్మేంద్ర యాదవ్ అభిప్రాయపడగా, ఆయనకు గొంతు నొప్పి రాకుండా ఇక్కడితో ముగించామని మోదీ సరదాగా బదులిచ్చారు. బాగా ప్రిపేర్ అయి సభకు వచ్చారంటూ ఎన్‌కే రామచంద్రన్ తదితర విపక్ష ఎంపీల ను పీఎం అభినంది ంచారు. పాత పార్లమెంటు భవనంలో మాదిరిగానే న్యూ పార్లమెంట్ బిల్డింగ్‌లో ఎంపీల కోసం ఒక సెంట్రల్ హాల్ చేర్చాలని పలువురు ఎంపీలు మోదీని కోరారు. సెంట్రల్ హాలులో ఎంపీలు, రిటైర్‌మెంట్ అయిన ఎంపీలు చర్చించుకునే వారు. దీనిపై మోదీ సరదాగా స్పందించారు. అది రిటైర్‌మెంట్ తర్వాత కదా...ఇంకా మీరు చాలా సేవ చేయాల్సి ఉంది.. అని అనడంతో సమావేశ ంలో నవ్వులు వెల్లివిరిసాయి. విపక్ష పార్టీ సభ్యులను సభలో మాట్లాడేందుకు అనుమతించడం లేదని ఆరోపిస్తూ గత పర్యాయం స్పీకర్ టీ పార్టీని రాహుల్, ఇతర విపక్ష నేతలు బాయ్‌కాట్ చేశారు. అయితే ఈసారి పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో విపక్షాల విషయంలోనూ స్పీకర్ సముచితంగా వ్యవహరించారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అభిప్రాయ పడ్డారని, స్పీకర్ టీపార్టీకి విపక్ష ఎంపీలంతా తప్పనిసరిగా హాజరుకావాలనే నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది.

## మానవ ప్రమేయం లేకుండా పరకామణి లెక్కింపు

(మొదటి పేజీ తరువాయి)


సంస్కరణలు చేపట్టాలని.. తక్షణ, శాశ్వత ప్రణాళికలు రూపొందించాలని స్పష్టం చేసింది. హుండీ సీలింగ్, రవాణా, లెక్కింపులో భద్రతా చర్యలపై రెండు వారాల్లో నివేదిక ఇవ్వాలని హైకోర్టు ఆదేశిం చింది. కానుకలను వర్గీకరించడంతో పాటు విదేశీ కరెన్సీని గుర్తించేందుకు ఏఐని ఉపయోగించాలని సూచించింది. విలువైన లోహాలను వేరు చేసే అత్యాధునిక వ్యవస్థను ఏర్పాటు చేయాలని పేర్కొంది. దీనిపై 8 వారాల్లోపు ముసాయిదా రూపొందించి సమర్పించాలని ఉన్నత న్యాయస్థానం ఆదేశిం చింది. కానుల లెక్కింపు ప్రక్రియను సమూలంగా ప్రక్షాళించాలని ధర్మాసనం ఆదేశించింది. పరకామ ణిలో చోరీకి సంబంధించి శుక్రవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఈ విచారణ టీటీడీకి హైకోర్టు ముఖ్య సూచనలు చేసింది. కానుకల లెక్కింపులో మానవ ప్రమేయాన్ని తగ్గించి ఆర్టిఫిష యల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), అత్యాధునిక యంత్రాలను వినియోగించాలని టీటీడీకి స్పష్టీకరించింది. ఇందుకోసం తక్షణ, శాశ్వత ప్రణాళికలు రూపొందించాలని టీటీడీకి ఆదేశించింది. హుండీ సీలింగ్, రవాణా, లెక్కింపు విషయంలో తక్షణం చేపట్టాల్సిన భద్రతా చర్యలపై రెండు వారాల్లో నివేదిక సమర్పించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేయడంతో పాటు ఇరువురు న్యాయవాదులకు సూచించింది. శాశ్వత సంస్కరణలో భాగంగా కానుకలను వర్గీకరించడం, విదేశీ కరెన్సీని గుర్తించేందుకు ఏఐను ఉపయోగించడం, విలువైన లోహాలను వేరు చేసే అత్యాధునిక వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించింది. దీనిపై ఎనిమిది వారాల్లోపు ముసాయిదా రూపొందించి కోర్టుకు సమర్పించాలని ఆదేశించింది. నిందితుడు రవికుమార్, అతని కుటుంబ సభ్యుల ఆస్తుల అమ్మకాలు, రిజిస్ట్రేషన్ల వివరాలను సీల్డ్ కవర్లో వారంలోపు తమ ముందు ఉంచాలని ఏసీబీని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను డిసెంబర్ 26కు హైకోర్టు ధర్మాసనం వాయిదా వేసింది.

# ప్రజావాణితో సమస్యలకు పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలోని వివిధ వర్గాల నుంచి వస్తున్న అనేక సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించి, అన్ని శాఖలతో సమన్వయం చేస్తున్నామని తెలిపారు. ప్రజావాణికి స్పందన లేదని విపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని ఆక్షేపించారు. ఎంత దుష్ప్రచారం చేసినా ప్రజా సమస్యలు పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. అధికారానికి దూరమైన విపక్షం ఎన్ని విమర్శలు చేసినా.. తాము మరింత ముందుకు వెళ్తామన్నారు. పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో వనరులు ప్రజలకు ఉపయోగపడేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజావాణి విజయవంతం చేసిన చిన్నారెడ్డి, దివ్యాదేవరాజన్‌కు భట్టి అభినందనలు తెలిపారు.

# అమిత్‌షాతో సిఎం చంద్రబాబు భేటీ



**న్యూఢిల్లీ,డిసెంబర్19:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు న్యూఢిల్లీ పర్యటన బిజీ బిజీగా సాగుతోంది. శుక్రవారం రాత్రి కేంద్రం హోం శాఖ మంత్రి అమిత్ షాతో సీఎం చంద్రబాబు బేటీ అయ్యారు. తాజ్ ప్యాలెస్ హోటల్‌లో అమిత్ షాతో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. రాష్ట్రంలో జరుగుతున్న వివిధ ప్రాజెక్టుల పురోగతిని ఈ సందర్భంగా అమిత్ షాకు సీఎం చంద్రబాబు వివరించారు. ఇటీవల విశాఖపట్నం వేదికగా నిర్వహించిన పెట్టుబడుల భాగస్వామ్య సదస్సుకు పెద్ద ఎత్తున సానుకూల స్పందన వచ్చిందని అమిత్ షాకు సీఎం వివరించారు. అలాగే రాష్ట్రంలోని రాజకీయ పరిణామాలపై సైతం వీరు ప్రస్తావించినట్లు సమాచారం. అనంతరం క్రెడాయ్ నేషనల్ సదస్సులో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు.సీఎం చంద్రబాబు నాయుడు గురువారం సాయంత్రం న్యూఢిల్లీ చేరుకున్నారు. ఎకనామిక్ టైమ్స్ సంస్థ ఆయనకు పురస్కారాన్ని ప్రకటించింది.

# తాటి చెట్టు పైనుండి కింద పడిన కక్కెర్ల మహేష్ గౌడ్ కు తక్షణమే ఐదు లక్షలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలి.

**కల్లు గీత కార్మికసంగం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గుండెబోయిన రవిగౌడ్ బుర్ర శ్రీనివాస్ గౌడ**



**ములుగు జిల్లా ప్రతినిధి డిసెంబర్ 19 (పీపుల్స్ న్యూస్)**గోవిందరావు పేట (పస్రా రాంపూర్ ) పస్రా గ్రామానికి చెందిన కక్కెర్ల మహేష్ గౌడ్ తన విధి నిర్వాహనలో భాగంగా శుక్రవారం వారం రోజున ఉదయం 8 గంటలకు తాటి చెట్టు ఎక్కుచుండగా ప్రమాదవాషత్తు కాలు జారీ కిందపడటం జరిగింది. మహేష్ గౌడ్ ను సొసైటీ అధ్యక్షులు జక్కు రాజు గౌడ్ తోటిగీత కార్మికులు కుటుంబ సభ్యులు 108 వాహనం లో ములుగు ఏరియా హాస్పిటల్ తీసుకొనిరాగ మెరుగైన చికిత్స కోసం ఎం జి ఎం పోవడం జరిగిందని అన్నారు. మహేష్ గౌడ్ కు చెయ్యివిరి గీ బొక్క బయటకు రావడం కాళ్లకు చాతికి నడుముకు బలమైన దెబ్బలు తగిలినయి.. కావున ప్రభుత్వం తక్షణమే ఎక్స్ గ్రేషియా అలాగే తాడి కార్పొరేషన్ ద్వారా సహాయం అందించిఆదుకోవాలని సోసైటీ అధ్యక్షులు జక్కు రాజు గౌడ్ గుండెబోయిన రవిగౌడ్ బుర్ర శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు..

# కోటగుళ్ళు దేవాలయానికి రూ.16 వేలతో గంట బహుకరణ



**గణపురం ప్రతినిధి డిసెంబర్ 19 (పీపుల్స్ న్యూస్):**ప్రసిద్ధిగాంచిన చారిత్రక సంపద కాకతీయుల కళా క్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ళ దేవాలయానికి ములుగు వెంకటాపూర్ కు చెందిన తౌటు రెడ్డి స్వర?లత భాస్కర్ రెడ్డి దంపతులు రూ .16 వేలతో 11 కిలోల గంటను సోమవారం బహుకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు వారిని సాదరంగా ఆహ్వానించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆశీర్వచనాలు తీర్థప్రసాదాలను అందజేశారు. కోటగుళ్ళు దేవాలయానికి గంటను బహూకరించిన తౌటు రెడ్డి స్వర?లత భాస్కర్ రెడ్డి దంపతులకు కోటగుళ్ళు పరిరక్షణ కమిటీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.

# గౌరెడ్డిపేట సర్పంచిని సన్మానించిన ఎమ్మెల్యే విజయ రమణారావు.





**గోదావరిఖని డిసెంబర్ 19 (పీపుల్స్ న్యూస్):** ఈమధ్య కాలంలో జరిగిన సర్పంచ్ ఎన్నికలలో వివిధ గ్రామపంచాయతీలో భారీ మెజార్టీతో గెలుపొందిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా పెద్దపల్లి జిల్లా గౌరెడ్డిపేట గ్రామం నుండి కొమ్ము సుజాత జీవన్ భారీ మెజారిటీతో గెలుపొందడంతో, గ్రామంలో విజయోత్సవ సంబరాలు చేసుకున్నారు. ఈ క్రమంలో పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణ రావు ని స్వయంగా కొమ్ము సుజాత జీవన్ లు కలవడం జరిగింది. ఎమ్మెల్యే వారిని శాలువాతో సన్మానించడం జరిగింది. రానున్న కాలంలో గ్రామ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేయాలని, మీకు గ్రామ సమస్యలపై ఎలాంటి తోడ్పాటు కావాలన్నా నేను అందుబాటులో ఉండి సాయం చేస్తానని హామీ ఇచ్చారు. మనల్ని నమ్మి ఓటేసిన గ్రామ ప్రజల కోసం మనం అన్ని విధాల తోడ్పాటుగా ఉంటూ గ్రామాన్ని అభివృద్ధి చేయాలని ఆయన సూచించారు.

# ప్రశాంత వాతావరణంలో క్రిస్మస్ వేడుకలు జరుపుకోవాలి

**బాలానగర్‌లో చర్చల పెద్దలతో సీఐ సమావేశం.**






**సైబరాబాద్, క్రైమ్ బ్యూరో, డిసెంబర్ 19, (పీపుల్స్ న్యూస్ ) :** ప్రశాంత వాతావరణంలో క్రిస్మస్ వేడుకలను జరుపుకోవాలని బాలానగర్ సీఐ నర్సింహా రాజు అన్నారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా బాలానగర్ పోలీసులు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ముందస్తు భద్రతా చర్యలను చేపట్టారు. ఇందులో భాగంగా శుక్రవారం బాలానగర్ సీఐ నర్సింహా రాజు ఆధ్వర్యంలో ఎస్ఐలు సరిత రెడ్డి, వినోద్ కుమార్ నేతృత్వంలో డివిజన్ పరిధిలోని పలు చర్చిలను సందర్శించారు.ఈ సందర్భంగా సీఐ నర్సింహా రాజు చర్చిల పెద్దలు, పాస్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. హెచ్ఐఎల్ క్రైస్ట్ చర్చ్, రాజు కాలనీ ఎలిమ్ ఎం.బి చర్చ్, నవజీవన్ నగర్ వధువు సంఘం చర్చ్, సాయి నగర్‌లోని బాప్టిస్ట్ చర్చ్, హెబ్రోన్ చర్చ్ సంఘ పెద్దలతో ఆయన మాట్లాడారు. క్రిస్మస్ దినాన చర్చిల్లో నిర్వహించే కార్యక్రమాల వివరాలను సీఐ నర్సింహా రాజు అడిగి తెలుసుకున్నారు.ముఖ్యంగా, పండుగ వేళల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పోలీసుల తరపున పలు సూచనలు చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉండేందుకు చర్చిలు, రద్దీగా ఉండే ప్రాంతాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామని సీఐ తెలిపారు. అదనపు సిబ్బందిని నియమించి, నిఘా పెంచుతామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

# డిజాస్టర్ మేనేజ్మెంట్ మాక్ ఎక్సర్సైజ్ నిర్వహణకు ప్రణాళిక సిద్ధం

**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. వరదలు, పరిశ్రమ ప్రమాదాల నియంత్రణ పై జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ వీడియో సమావేశం ద్వారా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న పాల్గొన్న జిల్లా కలెక్టర్.**








**ములుగు జిల్లా ప్రతినిధి డిసెంబర్ 19 (పీపుల్స్ న్యూస్)**డిజాస్టర్ మేనేజ్మెంట్ మాక్ ఎక్సర్సైజ్ నిర్వహణకు ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారువరదలు, పరిశ్రమ ప్రమాదాల నియంత్రణపై శుక్రవారం జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ ఆధ్వర్యంలో ఎన్డిఎంఏ అధికారులతో కలిసి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా? రావు వీడియో సమావేశం ద్వారా జిల్లా కలెక్టర్ లు, అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ వీడియో అవగాహన సమావేశంలో కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., అదనపు కలెక్టర్ రెవెన్యూ సి హెచ్ మహేందర్ జి తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా సిఎస్., ఎన్డిఎంఏ అధికారులు జిల్లాలలో వరదలు, పరిశ్రమల ప్రమాదాలు జరిగి నప్పుడు స్పందించాల్సిన తీరుపై ముందస్తుగా జిల్లాలో మాక్ ఎక్సర్సైజ్ నిర్వహించాలని, దీనికి సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లపై సమీక్షించి పలు సూచనలు చేశారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న సీఎస్ కె. రామ కృష్ణా? రావు మాట్లాడుతూ తరచూ వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా ఆకస్మికంగా తక్కువ సమయం లో కురిసే భారీ వర్షాలతో వచ్చే వరదల వల్ల అనేక సమస్యలు ఉత్పన్నం అవుతున్నా యని అన్నారు. వరదల సమయంలో ప్రజలకు మెరుగైన పునరుద్ధరణ చర్యలు చేపట్టేందుకు ప్రణాళికా బద్ధంగా సిద్ధం కావాలని అన్నారు.పరిశ్రమ ప్రమాదాలు,రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో పాటించాల్సిన పద్ధతుల ఎస్.ఓ.పి. తయారు చేసుకోవాలని అన్నారు.ప్రతి పరిశ్రమ నందు డిజాస్టర్ మేనేజ్మెంట్ వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని అన్నారు.అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటీ సూచనలు, గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని వరదలు, పరిశ్రమ ప్రమాదాల సమయంలో అధికార యంత్రాంగం స్పందించాల్సిన తీరుపై మాక్ ఎక్సర్సైజ్ నిర్వహించేలా కార్యాచరణ తయారు చేయాలని అన్నారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ గోపాల్ రావు, వ్యవసాయ, పశు వైద్య, ఫైర్, పరిశ్రమలు, విద్యుత్, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

**కోటంచ జ పి భవన నిర్మాణ పనుల పర్యవేక్షించిన పిఆర్ డిఈ రవికుమార్.**




**రేగొండ,డిసెంబర్ 19(పీపుల్స్ న్యూస్)**గ్రామాలలో పంచాయతీరాజ్ నిధులతో చేపట్టిన నూతన గ్రామపంచాయతీ భవనాల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని పి ఆర్ డి ఈ రవికుమార్ పేర్కొన్నారు. రేగొండ మండలంలోని కోటంచ గ్రామంలో నూతనంగా రు.20 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులను శుక్రవారం డిఈ రవికుమార్, కాంట్రాక్టర్లతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డిఈ రవికుమార్ మాట్లాడుతూ.. పంచాయతీరాజ్ నిధులతో చేపట్టిన నిర్మాణ పనులను గుత్తేదారులు సకాలంలో పూర్తి చేసి అందుబాటులోకి తీసురావాలన్నారు. భవనాల నిర్మాణాల సందర్భంగా కాంట్రాక్టర్లు నాణ్యత పాటించాలని, ఎప్పటికప్పుడు క్యూరింగ్ చేస్తూ ఉంటే భవనం పటిష్టంగా ఉండడంతోపాటు దశబ్ద కాలాలు ప్రజా ఉపయోగంగా ఉంటాయని రవికుమార్ నాణ్యత పట్ల పలు సూచనలు చేశారు. ఈ సందర్భంలో డిఇ రవికుమార్ తో పాటు ఏ ఈ సంతోష్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఎస్ఎస్ఆర్ సంస్థల చైర్మన్ నాయినేని సంపత్ రావు, సదయ్య, నూతన గ్రామ సర్పంచ్ చావటి మొగిలి, మాజీ సర్పంచ్ పబ్బ శ్రీనివాస్ గౌడ్, పబ్బ సమ్మయ్య గౌడ్, గుత్తేదారులు తదితరులున్నారు.

# ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో మొదటి స్థానం రావాలి

**విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి కార్పొరేట్ కాలేజీలకు ధీటుగా గిరిజన విద్యా వ్యవస్థ బలోపేతం.**
**గిరిజన సంస్కృతి సంప్రదాయాలు ప్రపంచానికి చాటేలా మేడారం సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహణ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క**









**ములుగు జిల్లా ప్రతినిధి డిసెంబర్ 19 (పీపుల్స్ న్యూస్)**ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో ములుగు జిల్లా మొదటి స్థానంలో నిలవాలని, విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, కార్పొరేట్ కాలేజీలకు ధీటుగా గిరిజన విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు.శుక్రవారం తాడ్వాయి మండలం కేంద్రంలో పంచాయతీరాజ్ %ఠ% గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క , జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి , మేడారం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ లచ్చు పటేల్ లతో కలిసి గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ఆర్టికల్ 275-1,100.00 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల జూనియర్ కళాశాలను పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఎస్ ఎస్ మేడారం జాతర 38.00 లక్షల రూపాయల నిధులతో ఏర్పాటుచేసిన తాడ్వాయి - మేడారం జంక్షన్ అభివృద్ధి మరియు సుందరీకరణ థీమ్స్ లను ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ విద్యార్థులు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలని అన్నారు.ప్రజా ప్రభుత్వం ఏర్పాటు జరిగినప్పటి నుంచి విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తూ విద్యార్థుల భవిష్యత్ దృష్టిలో ఉంచుకొని కార్పొరేట్ విద్య వ్యవస్థకు ధీటుగా ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తున్నామని స్పష్టం చేశారు. దానిలో భాగంగానే విద్యార్థుల మెస్ ఛార్జీలను , కాస్మోటిక్ ఛార్జీలను పెంచిన ఘనతకూడా ప్రజా ప్రభుత్వానికే దక్కిందని , విద్యార్థుల చదువు తో సమాజం అభివృద్ధి చెందడం తోపాటు గా వారి ఇల్లు , గ్రామం కూడా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. విద్యార్థులు కళాశాల ప్రాంగణాన్ని చెట్లు పెంచుతూ పచదంగా ఉండేలా చూడాలని రహదారి నుంచి కళాశాల ప్రాంగణ ఆవరణలో త్వరలోనే సీసీ రోడ్ మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ కళాశాల ప్రిన్సిపాల్,లెక్చరర్స్, వర్కర్స్ విద్యార్థులను అత్యంత జాగ్రత్తగా చూసుకోవాలి సూచించారు.అనంతరం విద్యార్థుల మంత్రి క్రిస్మస్ , నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం 100 శాతం విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టిందని దానిలో భాగంగానే జిల్లాలో నూతన విద్యా భవనాలను ప్రారంభించడం జరుగుతుందని అన్నారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించడం తోపాటు సి ఐ ఎస్ ఆర్ నిధులతో పాఠశాలలకు కంప్యూటర్ లను అందించడం జరుగుతుందని పేర్కొన్నారు.తల్లి తల్లిదండ్రులు గర్వించేలా విద్యార్థులు విద్యను అభ్యసించాలని ఉన్నత స్థాయికి చేసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఐటీడీఏ అధికారులు , కళాశాల ఉపాధ్యాయులు , ఇతర అధికారులు పాల్గొన్నారు

# మేడారం దేవాలయ గద్దెల అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

**గద్దెల పునరుద్ధన లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలి.**
**పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క.**









**ములుగు జిల్లా ప్రతినిధి డిసెంబర్ 19( పీపుల్స్ న్యూస్)**మేడారం దేవాలయం అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని,గద్దెల పునరుద్ధన లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని పంచాయతీరాజ్ %ఠ% గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు.శుక్రవారం తాడ్వాయి మండలం మేడారం వనదేవతలను పంచాయతీరాజ్ %ఠ% గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ , మార్కెట్ కమిటీ చైర్మెన్ రేగ కళ్యాణి లతో కలిసి దర్శించుకున్నారు.మేడారం దేవాలయం అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని,గద్దెల పునరుద్ధన లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని , అలయ ఫ్లోరింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత గుత్తేదారులను ఆదేశించారు.సాండ్ స్టోన్ బొమ్మల లిపి చిత్రాలను,రాతి స్తంభాలను , ఐటీడీఏ - జంపన్న వాగు రహదారి పనులను పరిశీలించి సరిపోయే విధంగా వాటర్ క్యూరింగ్ చేయాలని సూచించారు.చిలకలగుట్ట జంక్షన్ లో ఏర్పాటు చేస్తున్న సుందరీకరణ పనులను పరిశీలిస్తూ పర్యాటకులను ఆకర్షించే విధంగా గిరిజన సంస్కృతి సంప్రదాయాలు ఉట్టి పడేలా సుందరీకరించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఐటీడీఏ అధికారులు, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు , ఇతర అధికారులు

# మల్యాలపల్లి పరిసరాల్లో పులి అడుగులు..!!!

**గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలి: అటవీ శాఖ హెచ్చరిక**







**గోదావరిఖని డిసెంబర్ 19 (పీపుల్స్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా మల్యాలపల్లి గ్రామాన్ని ఆనుకుని ఉన్న బీపీఎల్ ల్యాండ్‌లో, పైప్‌లైన్ మార్గంలో పులి అడుగులను అటవీ శాఖ అధికారులు గుర్తించారు. దీంతో పరిసర గ్రామాల్లో అప్రమత్తత పెంచారు.మల్యాలపల్లి, బద్రిపల్లి, రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలు, కుందనపల్లి తదితర గ్రామాల ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని అటవీ శాఖ అధికారులు సూచించారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో బయటకు వెళ్లకుండా, అడవులు, పొలాల వైపు ఒంటరిగా వెళ్లవద్దని హెచ్చరించారు.ఈ సందర్భంగా మల్లెలపల్లి గ్రామ ప్రజలను ఉద్దేశించి అటవీ అధికారులు మాట్లాడుతూ,"పులి సంచారం ఉన్నట్లు అనుమానం ఉన్న నేపథ్యంలో ప్రజలు భయాందోళనకు గురికాకుండా, తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి. పిల్లలు, వృద్ధులు, పశువుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ఏవైనా అనుమానాస్పద కదలికలు కనిపిస్తే వెంటనే అటవీ శాఖకు సమాచారం ఇవ్వాలి" అని తెలిపారు.పులి కదలికలపై నిరంతర నిఘా ఏర్పాటు చేసినట్లు, అవసరమైన చోట్ల గస్తీ పెంచినట్లు అధికారులు వెల్లడించారు. ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా అటవీ శాఖ పనిచేస్తోందని తెలిపారు. అటవీ శాఖ సూచించిన జాగ్రత్తలు రాత్రి వేళల్లో బయట తిరగవద్దు పొలాలకు ఒంటరిగా వెళ్లవద్దు చిన్నపిల్లలను నిర్లక్ష్యం చేయవద్దు పశువులను సురక్షితంగా ఉంచాలిఅనుమానాస్పద కదలికలు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలి గ్రామస్థులు అటవీ శాఖ సూచనలను పాటిస్తూ సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# ఖాతాలు తెరిచే సమయంలో బ్యాంకు సిబ్బంది నిబంధనలను మరింత కఠినతరం చేయాలి

**ఆర్బీఐ గవర్నర్‌తో హైదరాబాద్ సీపీ సజ్జనర్ భేటి**







**హైదరాబాద్, క్రైమ్ బ్యూరో, డిసెంబర్ 19, (పీపుల్స్ న్యూస్ ):** ఖాతాలు తెరిచే సమయంలో బ్యాంకు సిబ్బంది పాటించాల్సిన నిబంధనలను మరింత కఠినతరం చేయాలని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ అన్నారు. హైదరాబాద్‌లోని ఆర్బీఐ కార్యాలయంలో శుక్రవారం గవర్నర్ సంజయ్ మల్హోత్రాతో నగర సీపీ వీసీ సజ్జనర్ నేతృత్వంలోని ఉన్నతాధికారుల బృందంప్రత్యేకంగా భేటీ అయ్యింది ఈ సందర్భంగా పలు కీలక అంశాలను ఆర్బీఐ గవర్నర్ దృష్టికి తీసుకెళ్ళారు. ఈ సందర్భం గా నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థకు, సామాన్యుల కష్టార్జితానికి పెను సవాలుగా మారిన సైబర్ నేరాలు, ఆర్థిక మోసాలకు చెక్ పెట్టాలంటే ప్రస్తుత బ్యాంకింగ్ నిబంధనల్లో సమూల మార్పులు అనివార్యమని అన్నారు. సైబర్ నేరగాళ్లకు ఆక్సిజన్‌లా మారిన 'మ్యూల్ ఖాతాల' నియంత్రణలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మరింత కఠినంగా వ్యవహరించాలని ఆయన చె ప్పారు. సైబర్ నేరగాళ్లు అమాయక విద్యార్థులు, కూలీలకు రూ. 2 వేల నుంచి రూ. 5 వేల వరకు కమీషన్ ఆశచూపి, వారి పేర్లతో బ్యాంక్ ఖాతాలు తెరిపిస్తున్నారని సీపీ సజ్జనర్ ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల నుంచి దోచుకున్న సొమ్మును క్షణాల్లో ఈ ఖాతాల ద్వారానే మళ్లిస్తున్నారని వివరించారు. వీటిని అరికట్టడానికి మ్యూల్ ఖాతాల గుర్తింపునకు ప్రత్యేకంగా 'సెంట్రలైజ్డ్ డేటాబేస్' ఏర్పాటు చేయాలన్నారు. ఖాతాదారుడు భౌతికంగా ఉన్నాడా లేదా అని నిర్ధారించుకునేందుకు 'జియో వెరిఫికేషన్', 'లైవ్ వీడియో కేవైసీ'ని తప్పనిసరి చేయాలన్నారు. దీనివల్ల మ్యూల్ ఖాతాలకు అడ్డుకట్ట వేయవచ్చని అభిప్రాయపడ్డారు.సైబర్ నేరం జరిగిన వెంటనే బాధితుల సొమ్మును కాపాడాలన్నా, నేరగాళ్లను పట్టుకోవాలన్నా బ్యాంకుల నుంచి సత్వర స్పందన ఉండాలని ఆర్బీఐ గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు.ప్రస్తుతం ఒక్కో బ్యాంకు ఒక్కో ఫార్మాట్‌లో స్టేట్‌మెంట్లు ఇస్తుండటం వల్ల దర్యాప్తులో జాప్యం జరుగుతోందన్నారు. అన్ని బ్యాంకులు ఒకే తరహాలో స్టేట్‌మెంట్లు ఇవ్వాలన్నారు. డెబిట్, క్రెడిట్ వివరాలతో పాటు, డబ్బు పంపిన/అందుకున్న వారి పూర్తి వివరాలు స్పష్టంగా ఉండాలన్నారు. పోలీసుల దర్యాప్తునకు కీలకమైన సాంకేతిక ఆధారాలను వెంటనే పంచుకునేలా బ్యాంకులకు ఆదేశాలివ్వాలని కోరారు. డైరెక్ట్ సెల్లింగ్, మల్టీలెవల్ మార్కెటింగ్ పేర్లతో జరుగుతున్న పిరమిడ్, పాంజీ స్కీమ్‌లు దేశ ఆర్థిక వ్యవస్థకే ముప్పుగా మారాయని సీపీ పేర్కొన్నారు. 'ఇంటి నుంచే సంపాదన', 'పార్ట్‌టైమ్ జాబ్స్' పేరుతో నిరుద్యోగులు, గృహిణులను మోసగిస్తున్న ఇలాంటి సంస్థలపై ఈడీ, సీబీఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలతో సమన్వయం చేసుకుంటూ ఆర్బీఐ కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.సీపీ సజ్జనర్ లేవనెత్తిన అంశాలు, సమర్పించిన మూడు వేర్వేరు లేఖలపై ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా సానుకూలంగా స్పందించారు. ఈ సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కీలక సమావేశంలో హైదరాబాద్ అదనపు సీపీ (క్రైమ్స్) ఎం.శ్రీనివాసులు, సీసీఎస్ డీసీపీ శ్వేత, సైబర్ క్రైమ్స్ డీసీపీ అరవింద్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు బాల శాస్త్రవేత్తలుగా ఎదగాలి

**జాతీయ స్థాయిలో ములుగు జిల్లా విద్యార్థులు రాణించాలి**
**జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) శ్రీ సంపత్ రావు**














పాఠశాల విద్యాశాఖ, ములుగు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీ సిద్ధార్థ రెడ్డి ఆధ్వర్యంలో, పి.ఎం.శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్, బండారుపల్లి ప్రాంగణంలో నిర్వహించిన 53వ జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శిని ఇన్స్పైర్ %-% మానక్ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) శ్రీ సంపత్ రావు వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభించి, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభకు పేదరికం, గ్రామీణ నేపథ్యం, గిరిజన ప్రాంతం అనే పరిమితులు అడ్డు కాకూడదని, గిరిజన ప్రాంతమైన ములుగు జిల్లా నుండి ఆధునిక వైజ్ఞానిక ఆలోచనలు, సృజనాత్మకత, శాస్త్రీయ దృక్పథంతో కూడిన వినూత్న ప్రదర్శనలు వెలువడాలి అని ఆకాంక్ష వ్యక్తం చేశారు.ములుగు జిల్లా విద్యార్థులు రాష్ట్ర స్థాయితో పాటు జాతీయ స్థాయిలోనూ రాణించి జిల్లాకు గౌరవం తీసుకురావాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.అనంతరం జిల్లా సైన్స్ అధికారి అప్పని జయదేవ్ మాట్లాడుతూ, జిల్లా ఏర్పాటుట్కనప్పటి నుండి ప్రతి జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ ఇన్స్పైర్-మానక్ కార్యక్రమాలలో ములుగు జిల్లా విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుస్తూ విజయాలు సాధిస్తున్నారని తెలిపారు. ఈ ఉత్సాహాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఉపాధ్యాయులు,అధికారులు, విద్యార్థుల సమన్వయంతో భవిష్యత్తులోనూ ప్రతి సైన్స్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వహణకు సహకరించిన అధికారులకు, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఈ వైజ్ఞానిక ప్రదర్శనలో ఆర్ బి వి పి (రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రాజెక్టు) ఆధ్వర్యంలో "వికసిత ఆత్మనిర్భర భారత్ కొరకు ఎస్ టి ఈ ఎం అనే ప్రధాన అంశం కింద ఈ క్రింది ఉప అంశాలపై జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు ప్రదర్శించబడ్డాయి: సుస్థిరమైన వ్యవసాయంవ్యర్థ పదార్థాల నిర్వహణ ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయాలు హరిత శక్తి (గ్రీన్ ఎనర్జీ)అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు వినోదాత్మక గణిత నమూనాల తయారీ ఆరోగ్యం పరిశుభ్రత జల సంరక్షణ నిర్వహణఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి శ్రీ అప్పని జయదేవ్వి తో పాటు,డిసిఈబి కార్యదర్శి శ్రీ సూర్యనారాయణ,ఏసీజీఈ శ్రీ వినోద్ కుమార్, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు అర్షం రాజు, శ్యామ్ సుందర్ రెడ్డి, బుర్ర రజిత, సైకం శ్రీనివాస్ రెడ్డి,మండల విద్యాశాఖ అధికారులు దివాకర్, గడ్డి శ్రీనివాస్, కొయ్యడ మల్లయ్య, ఉపాధ్యాయులు డాక్టర్ కందాల రామయ్య, డాక్టర్ సముద్రాల శ్రీనివాస చారి, బాలాజీ రవి,ప్రధానోపాధ్యాయులు మల్లారెడ్డి, సోమారెడ్డి, లక్ష్మారెడ్డి, విద్యాసాగర్, శ్రీనివాస్, తిరుపతయ్య,వివిధ ఉపాధ్యాయ సంఘాల జిల్లా బాధ్యులు యాకుబ్ రెడ్డి, శ్రీరంగం, సతీష్ కుమార్, వాసుదేవ రెడ్డి, సమ్మయ్య, ఆదిరెడ్డి, సర్వర్ అహ్మద్, బాబురావు,అలాగే జిల్లాలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో విద్యార్థినీ-విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# గోదారమ్మ సంపదపై "ఇసుక మాఫియా" కన్ను

**పట్టపగలే ట్రాక్టర్లతో ఇసుక దోపిడి**
**ఎట్ల అయితే గట్లాయే తోడండి.... నింపండి అంటున్న మాఫియా**
**తెరవెనుక ఏ నేతల అండదండలు ఉన్నాయో?**
**అడ్డుకోవడానికి వెనుకంజ వేస్తున్న అధికారులు?**







**గోదావరిఖని: డిసెంబర్ 19 (పీపుల్స్ న్యూస్)**సహజ వనరులపై అర్కస్ తిర్కస్ నిఘా ఉండటంతో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వి ట్రాక్టర్లలో ఇతర ప్రాంతాలకు తరలించి భారీగా ఆర్జిస్తున్నారు ఇసుక మాఫియా. కొందరి కనుసన్నల్లో ఇసుక మాఫియా పేట్రేగిపోతున్నది. అక్రమార్జనే ధ్యేయంగా ఇసుక దొంగలు ఇష్టాను రీతిగా వ్యవహరిస్తున్నారు. గోదారమ్మ సంపదపై "ఇసుక మాఫియా" కన్నువేసి అక్రమంగా లక్షలు గడిస్తున్నారు. పట్టపగలే ట్రాక్టర్లతో ఇసుక దోపిడి చేస్తున్న అక్రమార్కులకు ఒక (అందరికీ తెలిసిన పార్టీనే) పార్టీకి చెందిన కొంతమంది నేతలు తెరవెనుక నుంచి అండదండలు అందిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ కారణంగానే ఇసుక అక్రమ తవ్వకందారులపై చర్యలకు అధికారులు సైతం వెనుకడుగు వేస్తున్నట్టు తెలిసింది. రెవెన్యూ, మైనింగ్, పర్యావరణ, జలవనరుల శాఖల నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా రేయింబవళ్లు ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వి, వాహనాల్లో తరలిస్తున్నారు. ఇలా ఇసుక మాఫియా చెలరేగిపోతున్న, రాత్రి, పగలు తేడా లేకుండా అడ్డగోలుగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ప్రశ్నించిన వారిని, ఫిర్యాదు చేసిన వారిని బెదిరిస్తూ దాడులకు పాల్పడుతున్నట్లు విశ్వసనీయ ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా అక్రమ ఇసుక దందాపై, ఇసుక మాఫియాపై ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ అధికారులు గట్టి నిఘా ఏర్పాటు చేసి కేసులు నమోదు చేసి కటకటాలు లెక్కించాలనేది మెజారిటీ ప్రజల డిమాండ్

# కాటన్ కొనుగోలు కేంద్రాలు, జిన్నింగ్ మిల్లులపై రాష్ట్రవ్యాప్త ఆకస్మిక తనిఖీలు











**హైదరాబాద్, క్రైమ్ బ్యూరో, డిసెంబర్ 19, (పీపుల్స్ న్యూస్ ):** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా కాటన్ కొనుగోలు కేంద్రాలు , జిన్నింగ్ మిల్లులలో పారదర్శకతను పెంచడానికి ,రైతు సంక్షేమాన్ని కాపాడటానికి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్మెంట్ శాఖ మూడు రోజుల పాటు ముమ్మర ఆకస్మిక తనిఖీలను నిర్వహించింది.ఈ తనిఖీలలో రైతులకు కనీస మద్దతు ధర లభించేలా చూడటానికి , కొనుగోలు ప్రక్రియలో అక్రమాలను అరికట్టడానికి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, లీగల్ మెట్రాలజీ , మార్కెటింగ్ శాఖల సమన్వయంతో ఈ ఆపరేషన్ జరిగింది. ఆదిలాబాద్, ఖమ్మం, నల్గొండ, వరంగల్, వికారాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, నాగర్‌కర్నూల్ , నారాయణపేట వంటి ప్రధాన పత్తి సాగు జిల్లాల్లోని 65కు పైగా జిన్నింగ్ మిల్లులు కొనుగోలు కేంద్రాలను అధికారులు తనిఖీ చేశారు. అధికారులు వేబ్రిడ్జి ధృవీకరణ పత్రాలు, తేమ కొలిచే యంత్రాలు , సీసీటీవీ సర్వైలెన్స్ (15 నుండి 120 రోజుల బ్యాకప్), అగ్నిమాపక భద్రత లైసెన్సులు , 'కపాస్ కిసాన్ యాప్' అమలు తీరును పరిశీలించారు. లీగల్ మెట్రాలజీ చట్టం కింద పలు కేసులు నమోదు యాదాద్రి భువనగిరి (మోత్కూరు) నల్గొండ (చింతపల్లి) జిల్లాల్లో నాణ్యత లేని లేదా సీలు లేని వేబ్రిడ్జిలను ఉపయోగిస్తున్న మిల్లులపై కేసులు నమోదయ్యాయని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిజి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లాలో ప్రామాణిక 20 కిలోల టెస్ట్ వెయిట్స్ నిర్వహించని మిల్లులపై కేసులు బుక్ చేశారు. వేబ్రిడ్జి వ్యత్యాసాల కారణంగా రంగారెడ్డి జిల్లాలోని ఒక మిల్లుకు రూ. 85,000 జరిమానా విధించారు. మిల్లులలో పత్తి నాణ్యతను తక్షణమే కొలవడానికి అవసరమైన శాస్త్రీయ పరికరాల కొరత ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వరంగల్ , ఉమ్మడి మహబూబ్ నగర్ ప్రాంతాల్లోని మిల్లుల నుండి నమూనాలను సేకరించి, సాంకేతిక ధృవీకరణ కోసం ప్రయోగశాలలకు పంపారు. చాలా చోట్ల సీసీటీవీలు ఉన్నప్పటికీ, తగినంత డేటా బ్యాకప్ సౌకర్యం లేదని తనిఖీల్లో తేలింది.రైతులు 'కపాస్ కిసాన్ యాప్',టైమ్-స్లాట్ బుకింగ్ పట్ల పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. దీనివల్ల నిరీక్షణ సమయం , రవాణా ఖర్చులు తగ్గాయని తెలిపారు. రంగారెడ్డి, నాగర్‌కర్నూల్ వంటి సరిహద్దు జిల్లాల రైతులు, జిల్లా పరిమితులతో సంబంధం లేకుండా తమకు దగ్గరలో ఉన్న మిల్లును ఎంచుకునేలా 'మిల్లు మ్యాపింగ్'లో వెసులుబాటు కల్పించాలని కోరారు. రైతుల ప్రయోజనాలను రక్షించడానికి , మధ్యవర్తుల ప్రమేయం లేకుండా చూడటానికి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ కట్టుబడి ఉందన్నారు. ఈ తనిఖీల నివేదికలు , మిల్లులలో సాంకేతిక పరికరాల అప్‌గ్రేడ్ కోసం సిఫార్సులను ప్రభుత్వం ముందు ఉంచుతున్నారు. ప్రభుత్వ నిధులు లేదా వనరుల దుర్వినియోగం గురించి సమాచారం తెలిస్తే టోల్ ఫ్రీ నంబర్ 14432 కు తెలియజేయాలని ప్రజలను కోరారు.,

# ప్రభాకర్ రావు కస్టడీ పొడిగింపు సుప్రీం ఆదేశం



**న్యూఢిల్లీ, డిసెంబర్ 19:** తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో కీలక నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు కస్టోడియల్ విచారణ గడువును మరో వారం రోజుల పాటు పొడిగించింది సుప్రీం కోర్టు. డిసెంబర్ 25 వరకు కస్టోడియల్ విచారణ చేసేందుకు సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. కాగా.. (గురువారం) ప్రభాకర్ రావు వారం రోజుల కస్టోడియల్ విచారణ పూర్తి అయిన విషయం తెలిసిందే. అయితే ట్యాపింగ్ కేసులో మరికొన్ని రోజులు విచారణ చేయాలని సుప్రీంకోర్టును సిట్ కోరింది. వారం రోజుల కస్టోడియల్ విచారణ రిపోర్ట్‌ను ఉన్నత న్యాయస్థానానికి సిట్ అందజేసింది.దీంతో ప్రభాకర్ రావు కస్టోడియల్ విచారణను వారం రోజుల పాటు పొడిగింపుకు సుప్రీం కోర్టు అనుమతి ఇచ్చింది. డిసెంబర్ 26న పోలీస్ కస్టడీ నుంచి ప్రభాకర్ రావును విడుదల చేయాలని.. తదుపరి విచారణ వరకు ఎలాంటి వ్యతిరేక చర్యలు తీసుకోవద్దని స్పష్టం చేసింది. పోలీసుల దర్యాప్తుకు సహకరించాలని ప్రభాకర్ రావును సుప్రీంకోర్టు ఆదేశించింది. అంతేకాకుండా ఇంటి నుంచి ఆహారం తెచ్చుకునేందుకు, అవసరమైన మందులు తీసుకునేందుకు ప్రభాకర్ రావుకు సుప్రీం కోర్టు అనుమతి ఇచ్చింది.కాగా.. కొత్త సిట్ ఏర్పాటుతో ట్యాపింగ్ కేసు మరింత వేగవంతంగా విచారణ జరిగే అవకాశం ఉంది. హైదరాబాద్ సీపీ సజ్జనార్ నేతృత్వంలో సిట్ విచారణ కొనసాగనుంది. కొత్తగా ఏర్పాటు చేసిన సిట్‌లో 9 మంది అధికారులు ఉన్నారు. సీపీ సజ్జనార్‌తో పాటు రామగుండం సీపీ అంబరి కిషోర్ ఝా కూడా సిట్‌లో ఉన్నారు. గతంలో వెస్ట్ జోన్ డీసీపీగా ఉన్న సమయంలో ఫోన్ ట్యాపింగ్ కేసులో సిద్ధిపేట సీపీ విజయ్ కుమార్ కీలకంగా వ్యవహరించిన విషయం తెలిసిందే. మాదాపూర్ డీసీపీ రితి రాజ్, మహేశ్వరం డీసీపీ నారాయణ రెడ్డితో పాటు రవీందర్, వెంకట గిరి, కేఎస్ రావు, శ్రీధర్, నాగేందర్ రావుతో కొత్త సిట్ ఏర్పాటు అయ్యింది.

# సంక్షేమం పక్కనపెట్టి ఫుట్‌బాల్‌పై రూ.10 కోట్లు ఖర్చు



**భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 19:** ఆదివాసులు, గిరిజనులపై సీఎం రేవంత్ రెడ్డి , మంత్రి సీతక్క శ్వేతపత్రం విడుదల చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. శుక్రవారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ పాలనలో ఆదివాసులు, గిరిజనులకు ఏం చేశారో వెల్లడించాలన్నారు. సింగరేణి పుట్టినిల్లు ఇల్లందులో కొత్త బొగ్గు బావులు మొదలు పెట్టాలని అన్నారు. సింగరేణి కార్మికులు సంక్షేమం కోసం కాకుండా సీఎం రేవంత్ ఫుట్ బాల్ కోసం పది కోట్లు ఖర్చు చేశారని ఆరోపించారు. ముగ్గురు మంత్రులు ఉన్న జిల్లాలో కొత్తగూడెంకు ప్రాధాన్యం లేదని విమర్శించారు. ఒక మంత్రి కొత్తగూడెంను దత్తత తీసుకోవాలని.. కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో సౌకర్యాలు పెంచాలన్నారు.మణుగూరు ఓసీ 2 ప్రైవేటీకరణ అడ్డుకుంటామని స్పష్టం చేశారు. సీతారామ ప్రాజెక్టు నీళ్లు భద్రాద్రి జిల్లాలో పొలాలకు అందించాలని డిమాండ్ చేశారు. ఆంధ్రాలో విలీనమైన ఎటపాక పురుషోత్తమ పట్నం, గుండాల, పిచుకులపాడు, కన్నాయిగూడెం గ్రామాలను భద్రాచలంలో కలపాలన్నారు. పరిపాలన సౌలభ్యం కోసం ఐదు గ్రామాలను భద్రాచలంలో కలపాలని ఏపీ సీఎం చంద్రబాబుకు కవిత విజ్ఞప్తి చేశారు. అలాగే అశ్వరావుపేట పెద్దవాగు ప్రాజెక్ట్ ఆధునీకరణ పనులు పూర్తి చేయాలని రెండు రాష్ట్ర ప్రభుత్వాలకు వినతి చేశారు. ప్రసాద్ స్కీంలో భద్రాచలం రామాలయానికి రెండు వందల కోట్లు నిధులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీకి నిధులు ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు. కొత్తగూడెంలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటులో గత ప్రభుత్వం, ఈ ప్రభుత్వం నిర్లక్ష్యం చేశాయని విమర్శించారు. కొత్తగూడెం బైపాస్ రోడ్డు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆదివాసులు, గిరిజనులకు రిజర్వేషన్లు ఉన్నాయని వారిని నిర్లక్ష్యం చేయొద్దన్నారు. సింగరేణి నిర్వాసిత గ్రామాల ప్రజలకు న్యాయం చేయాలని కవిత డిమాండ్ చేశారు.

# ఐబొమ్మ నేరకథాచిత్రమ్‌లో ఎవరీ 'ప్రహ్లాద్ కుమార్' పోలీసులకు అంతుచిక్కని మిస్టరీ!





**హైదరాబాద్:** రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన సినిమా పైరసీ వ్యవహారం కేసులో ఐబొమ్మ నిర్వాహకుడు ఇమంది రవిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు మూడోసారి కస్టడీకి తీసుకున్నారు. మూడు కేసుల్లో నాలుగు రోజుల చొప్పున 12 రోజుల పాటు విచారించేందుకు నాంపల్లి కోర్టు అనుమతించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే చంచల్‌గూడ జైలులో ఉన్న రవిని గురువారం మధ్యాహ్నం సైబర్ క్రైమ్ పోలీసులు తమ కస్టడీకి తీసుకున్నారు. తొలి రోజు విచారణలో ప్రసాద్, ప్రహ్లాద్ అనే ఇద్దరి పేర్లు కీలకంగా మారాయి. ఏపీలోని విశాఖపట్నంనకు చెందిన ప్రసాద్ అనే వ్యక్తి రవికి పదో తరగతి స్నేహితుడని తేలింది. ఇటీవల ప్రసాద్‌ను విచారించిన పోలీసులు అతడు చెప్పిన వాంగ్మూలాన్ని నమోదు చేశారు.ఆ విషయంలో ఇంకా వీడని మిస్టరీ : సినిమాల అక్రమ పైరసీ వ్యవహారం కేసులో ఇమంది రవి గురించి పలు విషయాలు వెలుగులోకి వచ్చినప్పటికీ, ప్రహ్లాద్ కుమార్ గురించి మాత్రం ఇంకా ఆచూకీ చిక్కలేదు. తొలిసారి పోలీసు కస్టడీలో రవిని ప్రశ్నించినప్పుడు అమీర్‌పేటలో కోచింగ్ తీసుకునే సమయంలో పరిచయం అయ్యాడని చెప్పాడు. రెండోసారి విచారణలో ఆయన ఎవరో తెలియదని తెలిపాడు. ప్రహ్లాద్ పేరుతోనే ఐబొమ్మ రవి ఆధార్, పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్సుతో పాటు కరీబియన్ దీవుల్లోని సెయింట్ కిట్స్ అండ్ నేవిస్ దేశ పౌరసత్వాన్ని తీసుకున్నట్లుగా తెలుస్తోంది. సినిమా పైరసీ వెబ్?సైట్? ఐబొమ్మను అతడి పేరుతోనే రిజిస్టర్ చేయించాడు.విచారణలో పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి : ఇమంది రవిని పోలీసులు ఇప్పటికే పలుమార్లు కస్టడీలోకి తీసుకుని విచారించారు. ఈ సందర్భంగా పలు ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. గత విచారణల్లో తాను చూపిస్తున్న సినిమా అవ్వడం కారణంగా ఐ-బొమ్మ అని పెట్టినట్లు తెలిపాడు. బొమ్మను ఇంటర్నెట్‌లో చూపిస్తున్నందుకే ఐబొమ్మ అని పేరు పెట్టానని పోలీసుల విచారణలో పేర్కొన్నాడు. మరో వెబ్?సైట్ బప్పంకు ఐబొమ్మకు సుప్రీమ్ అనే అర్థం వచ్చేలా పెట్టినట్లుగా విచారణలో తెలిసింది.తాను అప్‌లోడ్ చేసిన సినిమాలన్నీ దాదాపు టెలిగ్రామ్ నుంచి తీసుకున్నవేనని పోలీసుల విచారణలో ఇమంది రవి స్పష్టం చేశాడు. మరికొన్ని సినిమాలు బయటి వ్యక్తుల నుంచి కొనుగోలు చేసినట్లుగా చెప్పాడు. మరో వెబ్‌సైట్‌కు బలపం పేరు పెట్టాలని అనుకున్నానని, అది డొమైన్‌లో సాంకేతిక సమస్యతో 'ఎల్' అక్షరం తీసి బప్పంగా మార్చినట్లు చెప్పాడు. కేసు తీవ్రతను దృష్టిలో పెట్టుకుని పోలీసులు నిందితుడి నుంచి కీలక వివరాలు సేకరిస్తున్నారు. రవి నివాసంలో స్వాధీనం చేసుకున్న హార్డ్ డిస్కులు, కంప్యూటర్లు, బ్యాంకు అకౌంట్ల వివరాలను అతని ఎదురుగా ఉంచి పోలీసులు గతంలో ప్రశ్నించినట్లుగా తెలిసింది.అసలేంటీ ఐబొమ్మ కేసు : కొత్తగా విడుదలైన సినిమాలు, వెబ్?సిరీస్?లను అక్రమంగా పైరసీ చేసి, ఐబొమ్మ వెబ్?సైట్?లో పెట్టారనేది ప్రధాన ఆరోపణ. దీనివల్ల సినీ రంగానికి తీవ్ర నష్టం వాటిల్లిందని చలనచిత్ర రంగ ప్రముఖులు ఇచ్చిన ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలోనే ఏపీలోని విశాఖపట్నానికి చెందిన రవిని అరెస్టు చేశారు. అతడి నుంచి పలు హార్డ్?డిస్క్?లు సహా, ల్యాప్?టాప్?లను స్వాధీనం చేసుకున్నారు. 21 వేల సినిమాలు ఇమంది రవి హార్డ్ డిస్క్‌లో ఉన్నట్లుగా సీపీ సజ్జనార్ కొద్ది రోజుల క్రితం? వెల్లడించారు. 1972లో విడుదలైన గాడ్‌ఫాదర్ నుంచి మొన్న వచ్చిన ఓజీ సినిమా వరకు అందులో ఉన్నాయని చెప్పారు. రూ.20 కోట్లు పైరసీ ద్వారా సంపాదించాడని ఓ ప్రెస్?మీట్?లో పోలీసులు తెలిపిన విషయం విదితమే. ఈ కేసులో పురోగతి సాధించేందుకు ఇమంది రవిని పోలీసులు కస్టడీలోకి తీసుకుని పలు అంశాలపై ప్రశ్నిస్తున్నారు. విచారణలో మరిన్ని విషయాలు తెలియాల్సి ఉంది.

# మంత్రి పదవిపై కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు ఇన్నాళ్లు ఆగాను కచ్చితంగా వచ్చి తీరుతుంది



**హైదరాబాద్:** తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు అందరి కళ్లూ ఆ రెండు ఖాళీ మంత్రి పదవుల పైనే ఉన్నాయి. ముఖ్యంగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన తాజా వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీశాయి. తన పట్ల అదృష్టం తలుపు తడితే త్వరలోనే మంత్రి పదవి వస్తుందని.. అప్పటి వరకు వేచి చూస్తానని ఆయన అనడం వెనుక అధిష్టానం నుండి ఏదైనా గ్రీన్ సిగ్నల్ వచ్చిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొలువుదీరినప్పటి నుండి ఇప్పటి వరకు రెండు సార్లు మంత్రి వర్గ విస్తరణ జరిగింది. రాజ్యాంగ నిబంధనల ప్రకారం తెలంగాణ అసెంబ్లీ బలాన్ని బట్టి గరిష్టంగా 18 మంది మంత్రులు ఉండవచ్చు. మొదట సీఎంతో పాటు.. 11 మంది మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో మొత్తం సంఖ్య 12 కి చేరింది. తర్వాత సామాజిక సమీకరణాలను బ్యాలెన్స్ చేస్తూ ముగ్గురు కొత్త మంత్రులను కేబినెట్‌లోకి తీసుకున్నారు. అందులో.. గడ్డం వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వాకిటి శ్రీహరికి మంత్రి పదవులు దక్కాయి.ఆ తర్వాత మాజీ క్రికెటర్ మహమ్మద్ అజారుద్దీన్ ను మంత్రిగా నియమించడంతో మంత్రివర్గ సంఖ్య 16 కి పెరిగింది. ప్రస్తుతం కేబినెట్‌లో ఇంకా రెండు ఖాళీలు ఉన్నాయి. ఈ రెండు స్థానాల కోసం కాంగ్రెస్ పార్టీలో భారీ స్థాయిలో పోటీ నెలకొంది. రాజగోపాల్ రెడ్డి మొదటి నుంచీ ఈ పదవిపై ఆశలు పెట్టుకున్నారు. ఒకే కుటుంబం నుండి ఇద్దరు మంత్రులు ఉండకూడదనే వాదనను రాజగోపాల్ రెడ్డి తిప్పికొడుతున్నారు. క్రికెట్‌లో ఇర్ఫాన్ పఠాన్, యూసుఫ్ పఠాన్ ఇద్దరూ దేశం కోసం ఆడలేదా అని ప్రశ్నిస్తూ.. తన సోదరుడు కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మంత్రిగా ఉన్నా తనకు పదవి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.పార్టీలో చేరే సమయంలో ఇచ్చిన మాట ప్రకారం తనకు మంత్రి పదవి ఇవ్వాలని ఆయన అధిష్టానాన్ని కోరుతున్నారు. అయితే సామాజిక సమీకరణాలు, జిల్లాల వారీ ప్రాతినిధ్యం దృష్ట్యా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ రెండు స్థానాలను ఎవరితో భర్తీ చేస్తారనేది సస్పెన్స్‌గా మారింది. తెలంగాణ కేబినెట్‌లో ఇంకా మైనార్టీ వర్గానికి సరైన ప్రాతినిధ్యం కల్పించాలనే డిమాండ్ ఉంది. అలాగే హైదరాబాద్, ఆదిలాబాద్, నిజామాబాద్ వంటి జిల్లాల నుండి మంత్రులు లేరు.ముదిరాజ్ సామాజిక వర్గం నుండి వాకిటి శ్రీహరిని, మాల మరియు మాదిగ వర్గాల నుండి వివేక్, లక్ష్మణ్‌లను తీసుకోవడం ద్వారా ప్రభుత్వం అట్టడుగు వర్గాలకు ప్రాధాన్యత ఇచ్చింది. మిగిలిన రెండు స్థానాల్లో ఒకటి రెడ్డి సామాజిక వర్గానికి ఇస్తే.. మరొకటి మైనార్టీ లేదా మహిళా కోటాలో వెళ్లే అవకాశం కనిపిస్తోంది. రాజగోపాల్ రెడ్డి ధీమాను చూస్తుంటే.. తదుపరి విస్తరణలో ఖాయమనే ప్రచారం జరుగుతోంది. కానీ కాంగ్రెస్ రాజకీయాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందో ఊహించడం కష్టమే మరి.

# ఆ ఐసిస్ ఉగ్రవాది ఆరుసార్లు హైదరాబాద్ వచ్చారు



**హైదరాబాద్:** ఆస్ట్రేలియా బాండీ బీచ్?లో కాల్పులకు తెగబడి పోలీసుల చేతుల్లో హతమైన ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ సిరియా ఉగ్రవాది సాజిద్ అక్రమ్‌కు హైదరాబాద్‌తో సంబంధాలున్న సంగతి తెలిసిందే. అతను హైదరాబాద్ నగరంలోనే బీకామ్ వరకూ చదివారని తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డితెలిపారు. సాజిద్ అక్రమ్ 27 సంవత్సరాల కాలంలో ఆరుసార్లు మాత్రమే భారతదేశానికి వచ్చాడని వెల్లడించారు. 1998లో అక్రమ్ ఉపాధి కోసం ఆస్ట్రేలియా వెళ్లాడని.. ఆ తర్వాత అదే సంవత్సరం యురోపియన్ కు చెందిన యువతి వెనెరా గ్రోసోని వివాహం చేసుకున్నాడని తెలిపారు.పెళ్లి అయిన అదే ఏడాది మొదటిసారిగా భార్యతో కలిసి హైదరాబాద్ వచ్చాడని చెప్పారు. 2004లో ఓసారి, 2009 ఫిబ్రవరిలో మరోసారి నగరానికి వచ్చాడని డీజీపీ వెల్లడించారు. 2011 జూబ్లీ ప్రాపర్టీ సెటిల్మెంట్ ఇంకోసారి వచ్చాడని, 2016 మరోసారి ప్రాపర్టీ సెటిల్మెంట్ కోసం ఇక్కడికి వచ్చాడని చెప్పుకొచ్చారు. 2022 తల్లి, సోదరిని చూడటం కోసం నగరానికి డీజీపీ శివధర్ రెడ్డి చెప్పారు. కాగా, ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ సిరియాతో సంబంధం ఉన్న తండ్రీకొడుకులు సాజిద్ అక్రమ్, నవీద్ అక్రమ్.. యూదులంతా బాండీ బీచ్?లో హనుక్కా పండుగ చేసుకుంటుండగా కాల్పులకు తెగబడ్డారు.ఈ కాల్పుల్లో 16 మంది మృతిచెందగా.. 36 మంది గాయపడ్డారు. పోలీసుల కాల్పుల్లో సాజిద్ అక్రమ్ అక్కడికక్కడే మృతిచెందగా.. అతని కుమారుడు నవీద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా పోలీసులు అరెస్టు చేశారు. మరోవైపు నవీద్‌పై న్యూ సౌత్‌వేల్స్ పరిధిలోని బాండీ బీచ్ పోలీసులు మొత్తం 59 నేరాలకు పాల్పడినట్టు అభియోగాలు నమోదు చేశారు. వాటిలో 15 హత్యలు, ఓ ఉగ్రవాద చర్యకు సంబంధించిన కేసులు ఉన్నాయి.

# కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చిన్నారెడ్డిపై ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు



**వనపర్తి :** పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకుల మధ్య ఆరోపణలు సంచలనంగా మారుతున్నాయి. పార్టీలో సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి చిన్నారెడ్డి పై కాంగ్రెస్ వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. చిన్నారెడ్డి వెన్నుపోటు రాజకీయాల వల్లే జిల్లాలో పార్టీకి నష్టం జరిగిందని శుక్రవారం మీడియా సమావేశంలో ఆరోపించారు.చిన్నారెడ్డితో పాట మరికొందరి నాయకులపై ఏఐసీసీ, పీసీసీ , క్రమశిక్షణ సంఘానికి ఫిర్యాదు చేస్తానని వెల్లడించారు. బీఆర్ఎస్ పార్టీకి వచ్చిన 51 గ్రామపంచాయతీ స్థానాలలో 15 నుంచి 20 స్థానాలు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుల వల్లే గెలుచుకుందని పేర్కొన్నారు. ఈ విషయమై ఏఐసీసీ క్రమశిక్షణ కమిటీకి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తానని వివరించారు.ఎమ్మెల్యే గా తనపై , నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవిపై కోపం ఉంటే ప్రత్యక్షంగా చూసుకోవాలని పరోక్షంగా చిన్నారెడ్డిని ఉదాహరిస్తూ ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులమని చెప్పుకుంటూ పార్టీకి ద్రోహం చేస్తున్నారని తీవ్రంగా దుయ్యబట్టారు.

# కొల్లాపూర్ రేంజ్ అటవీ పరిధిలో పెద్దపులి జాడలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక



**కొల్లాపూర్ :** కొల్లాపూర్ రేంజ్ సోమశిల సెక్షన్ సరిహద్దు గ్రామాలలోని ఎంగం పల్లి తండా గ్రామ పరిధిలో పెద్దపులి సంచారం కలకలం రేపుతుంది. సమాచారం అందిన వెంటనే జిల్లా అటవీ శాఖ ఉన్నతాధికారులు డీఎఫ్‌వో , ఎఫ్‌డీవో ఎఫ్ఆర్‌వో ఆదేశాల మేరకు కొల్లాపూర్ అటవీ శాఖ అధికా రులు రంగంలోకి దిగారు.ఎంగంపల్లి తండా గ్రామ పరిసర ప్రాంతాలు, వ్యవసాయ పొలాలు, అటవీ సరిహద్దు ప్రాంతాల్లో అధికారులు విస్తృతంగా పరిశీలనలు చేపట్టారు. ఈ పరిశీలన సమయంలో పొలాల్లో కనిపించిన పాదముద్రలు, ఇతర ఆనవాళ్లను సాంకేతికంగా పరిశీలించిన అనంతరం అవి పెద్దపులికి చెందిన జాడలేనని అటవీ శాఖ అధికారులు కాశన్న, ముజీబ్ ఘోరి నిర్ధారించారు.ఎంగంపల్లి తండాతో పాటు అటవీ సరిహద్దు గ్రామ సర్పంచ్ గోపి నాయక్ ఆధ్వర్యంలో గ్రామాలలో ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని చాటింపు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో పొలాల వద్ద ఒంటరిగా వెళ్లవద్దని, చిన్న పిల్లలను అటవీ ప్రాంతాల వైపు పంపవద్దని, గొర్లు, పశువులను కాపాడే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.పులి కనిపించినా లేదా అనుమానాస్పద కదలికలు గమనించినా వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ఎవరు కూడా పంట పొలాల్లో ఉచ్చుళ్లు గాని, కరెంట్ గాని పెడితే అటవీ చట్టం 1972 ప్రకారం 10 సంవత్సరాల జైలు శిక్ష ఉంటుం దని తెలిపారు. ప్రజల భద్రతకు ఎలాంటి లోటు లేకుండా చర్యలు తీసుకుంటామని అటవీ శాఖ కొల్లాపూర్ రేంజ్ అధికారి మక్దూం హుస్సేన్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శశి, నవీన్, చోటేపాషా, నాగమల్లి సిబ్బంది పాల్గొన్నారు.

# ఐటీ ఉద్యోగులే టార్గెట్‌గా గంజాయి సరఫరా చెక్ పెట్టిన పోలీసులు



**హైదరాబాద్, డిసెంబర్ 19:** రాష్ట్రంలో గంజాయి సరఫరాను అడ్డుకునేందుకు పోలీసులు అనేక రకాలుగా చర్యలు తీసుకుంటున్నారు. గంజాయిని అమ్ముతున్నా, కొనుగోలు చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అయినప్పటికీ ఎక్కడో చోట గంజాయి సరఫరా జరుగుతూ పట్టుబడటం పోలీసులకు సవాల్‌గా మారింది. తాజాగా రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో భారీగా గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఐటీ ఉద్యోగులే టార్గెట్‌గా గంజాయి సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన మాదాపూర్ ఎస్వోటీ పోలీసులు.. గంజాయి సరఫరా చేస్తున్న సోహెల్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.

# డిజిటల్ అరెస్ట్ పేరుతో భారీ మోసానికి సైబర్ నేరగాళ్ల పన్నాగం

**నల్లగొండ సిటీ, డిసెంబర్ 19 :** డిజిటల్ అరెస్ట్ అంటూ బెదిరింపులకు గురిచేస్తూ రూ.18 లక్షలు తమ అకౌంట్‌కి ట్రాన్స్‌ఫర్ చేయాలి, లేదంటే మిమ్మల్ని అరెస్ట్ చేస్తామని భయభ్రాంతులకు గురిచేసిన కేసును నలగొండ జిల్లా సైబర్ క్రైమ్ పోలీసులు వెంటనే స్పందించి బాధితుడి వద్ద నుండి నగదు బదిలీ కాకుండా కాపాడడం జరిగింది. నల్లగొండ పట్టణానికి చెందిన రిటైర్డ్ టీచర్ పుచ్చకాయల దేవేందర్ రెడ్డి పేరుతో సైబర్ నేరగాళ్లు కొత్త సిమ్ తీసుకుని అతనికి ఫోన్ కాల్ చేశారు. బెంగళూరులో అసాంఘిక కార్యకలాపాలు చేస్తున్నట్లు తప్పుడు ఆరోపణలు చేస్తూ అరెస్ట్ చేస్తున్నట్లు బెదిరించారు. అరెస్ట్ కాకుండా ఉండాలంటే తామిచ్చే అకౌంట్ నంబర్‌కు వెంటనే రూ.18 లక్షలు డిపాజిట్ చేయాలని డిమాండ్ చేశారు.

# జాతీయ మెగా లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి

## బాలానగర్ ఏసీపీ పింగిలి నరేష్ రెడ్డి

**సైబరాబాద్, క్రైమ్ బ్యూరో, డిసెంబర్ 19, ( పీపుల్స్ న్యూస్ ) :** ఈ నెల 21 వ తేదీన జరగనున్న జాతీయ మెగా లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని బాలానగర్ ఏసీపీ పింగిలి నరేష్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.జాతీయ మెగా లోక్ అదాలత్ ద్వారా త్వరితగతిన, ఇరువైపుల సమ్మతితో సమస్యలను పరిష్కరించుకునే అవకాశం అందుబాటులో ఉందని తెలిపారు. రాజీ చేసుకునే అవకాశమున్న వివిధ రకాల కేసులు క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన కేసులు, వైవాహిక జీవితం , కుటుంబ సమస్యలకు సంబంధించిన కేసులు, డ్రంకన్ డ్రైవ్, మోటారు వాహన చట్ట ఉల్లంఘనలు, చెక్ బౌన్స్ కేసులు, బ్యాంకు రికవరీ కేసులు, విద్యుత్ చౌర్యం తదితర కేసులు పరిష్కరించుకోవచ్చు అని వివరించారు. కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని వృథా చేసుకోవద్దని అన్నారు. న్యాయశాఖ అందిస్తున్న ఈ అవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని సూచించారు.

# తిరుమల పరకామణి లెక్కింపుపై హైకోర్టు ఆదేశాలివే




**అమరావతి , డిసెంబర్ 19:** తిరుమల పరకామణి విషయంలో ఏపీ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. కానుల లెక్కింపు ప్రక్రియను సమూలంగా ప్రక్షాళించాలని ధర్మాసనం ఆదేశించింది. పరకామణిలో చోరీకి సంబంధించి (శుక్రవారం) హైకోర్టులో విచారణ జరిగింది. ఈ విచారణ సందర్భంగా టీటీడీకి హైకోర్టు ముఖ్య సూచనలు చేసింది. దొంగతనాలను అరికట్టేందుకు రెండు దశలలో సంస్కరణలు చేపట్టాలని సూచించింది. కానుకల లెక్కింపులో మానవ ప్రమేయాన్ని తగ్గించి ఆర్టిఫిషయల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), అత్యాధునిక యంత్రాలను వినియోగించాలని టీటీడీకి స్పష్టీకరించింది.ఇందుకోసం తక్షణ, శాశ్వత ప్రణాళికలు రూపొందించాలని టీటీడీకి ఆదేశించింది. హుండీ సీలింగ్, రవాణా, లెక్కింపు విషయంలో తక్షణం చేపట్టాల్సిన భద్రతా చర్యలపై రెండు వారాల్లో నివేదిక సమర్పించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేయడంతో పాటు ఇరువురు న్యాయవాదులకు సూచించింది. శాశ్వత సంస్కరణలో భాగంగా కానుకలను వర్గీకరించడం, విదేశీ కరెన్సీని గుర్తించేందుకు ఏఐను ఉపయోగించడం, విలువైన లోహాలను వేరు చేసే అత్యాధునిక వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించింది.దీనిపై ఎనిమిది వారాల్లోపు ముసాయిదా రూపొందించి కోర్టుకు సమర్పించాలని ఆదేశించింది. నిందితుడు రవికుమార్, అతని కుటుంబ సభ్యుల ఆస్తుల , రిజిస్ట్రేషన్ల వివరాలను సీల్డ్ కవర్లో వారంలోపు తమ ముందు ఉంచాలని ఏసీబీని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను డిసెంబర్ 26కు హైకోర్టు ధర్మాసనం వాయిదా వేసింది.

# నంద్యాల విజయ పాల డైరీ వద్ద హై టెన్షన్




**నంద్యాల జిల్లా :** ముత్యాలపాడు గ్రామంలో జరిగిన సొసైటీ ఎన్నికల్లో భూమా విఖ్యాత్ రెడ్డి ఘన విజయం సాధించారు. అయితే, భూమా విఖ్యాత రెడ్డి డెయిరీకి ఉన్న అప్పును చెల్లించాలంటూ డిఫాల్టర్ నోటీసులు ఇచ్చింది వియజ పాల డెయిరీ యాజమాన్యం. దీనిపై వివరణ ఇవ్వడానికి డెయిరీ వద్దకు వచ్చారు విఖ్యాత్ రెడ్డి. కానీ అక్కడ డైరీ యాజమాన్యం కానీ, దానికి బాధ్యత వహించే అధికారులు కానీ ఎవరూ అందుబాటులో లేకపోవడంతో విఖ్యాత్ రెడ్డి ఆయన అనుచరులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.డెయిరీకి తాను వస్తున్న విషయం తెలిసి కూడా యాజమాన్యం ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై విఖ్యాత్ రెడ్డి కోపంతో ఊగిపోయారు. దీంతో అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారిపోయింది. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని డెయిరీ పరిసరాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంది.

# శబరిమలలో బంగారం చోరీ కేసు - ఈడీకి దర్యాప్తునకు కోర్టు ఆదేశం




**శబరిమల :** శబరిమల బంగారు చోరీ కేసులో కొల్లం విజిలెన్స్ కోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. బంగారు దోపిడీపై దర్యాప్తు చేయడానికి కొల్లం విజిలెన్స్ కోర్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కి అనుమతి ఇచ్చింది. ఈ కేసుకు సంబంధించిన అన్ని పత్రాలను ఈడీకి అప్పగించాలని కోర్టు ప్రత్యేక దర్యాప్తు బృందం ని ఆదేశించింది. ఇప్పటివరకు నమోదైన రెండు ఎఫ్ఐఆర్ కాపీలు, నిందితులకు సంబంధించిన రిమాండ్ రిపోర్టులు సహా ఇతర కీలక దస్త్రాలను ఈడీకి తక్షణమే ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశించింది.ఈ కేసులో ఈడీ త్వరలో మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద కేసు నమోదుచేయనుందని తెలిసింది. శబరిమల ఆలయంలోని దేవుడి విగ్రహాల బంగారు తాపడం బరువులో వ్యత్యాసంపై దర్యాప్తు చేపట్టేందుకు కేరళ ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా సిట్ ఏడుగురిని అరెస్టు చేసింది. అయితే మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేపట్టేందుకు అనుమతించాలని కోరుతూ ఈడీ తొలుత కేరళ హైకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు సూచన మేరకు కొల్లాం విజిలెన్స్ కోర్టులో పిటిషన్ వేయగా, ఈడీ విజ్ఞప్తిని సిట్ వ్యతిరేకించింది. ఒకేసారి రెండూ కొనసాగడం దర్యాప్తును ప్రభావితం చేస్తాయని అభిప్రాయపడింది. సిట్ వాదనలను తిరస్కరించిన కొల్లాం విజిలెన్స్ కోర్టు, ఈడీ విచారణకు అనుమతిచ్చింది.

# ఈనెల 23న తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు



**తిరుమల :** తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో డిసెంబర్ 30 నుంచి జనవరి 8వ తేదీ వరకు వైకుంఠ ద్వార దర్శనాల సందర్భంగా ఈనెల 23న మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తున్నట్లు టీటీడీ అధికారులు వెల్లడించారు.ఈ సందర్భంగా 23వ తేదీన ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేయడంతో 22వ తేదీ సిఫార్సు లేఖలు స్వీకరించబడవని స్పష్టం చేశారు. సాధారణంగా సంవత్సరంలో నాలుగుసార్లు ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని వివరించారు.ఇందులో భాగంగా ఉదయం 6 నుంచి 10 గంటల వరకు ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని అర్చకులు ఆగమోక్తంగా నిర్వహిస్తారని, ఈ కారణంగా అష్టదళ పాద పద్మారాధన సేవను రద్దు చేశామన్నారు.

# సీఆర్ పాటిల్‌తో సీఎం చంద్రబాబు భేటీ కీలక అంశాలపై చర్చ



**ఢిల్లీ, డిసెంబరు19 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీలో (శుక్రవారం) పర్యటిస్తున్నారు. పలు కార్యక్రమాల్లో సీఎం పాల్గొంటున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్ బిజీ బిజీగా ఉంది. ఈ నేపథ్యంలోనే కేంద్ర జల శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో చంద్రబాబు భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఏపీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పాల్గొన్నారు.ఏపీకి సంబంధించిన పలు ఇరిగేషన్ ప్రాజెక్టులపై చర్చించారు. పోలవరం, బనకచర్ల నిర్మాణంతో సహా కొత్తగా చేపట్టే ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఏపీలో సాగునీటి ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వ అనుమతులు, వివిధ పథకాలకు నిధుల విడుదలపై కేంద్రమంత్రి సీఆర్ పాటిల్‌తో చర్చించారు ముఖ్యమంత్రి చంద్రబాబు.

ప్రత్యేకించి విభజన హామీల్లో భాగంగా ఆమోదం పొందిన ప్రాజెక్టులకు తక్షణమే ఆర్థిక సాయం అందించాలని, పెండింగ్ అంశాలపై ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించాలని కోరారు. ఏపీకి నీటి భద్రత అత్యంత కీలక అంశమని... రాష్ట్రంలో సాగు, తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని కేంద్రం సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాజెక్టులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయం మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు సీఎం చంద్రబాబు.జల్ జీవన్ మిషన్2025 నుంచి 2026 ఆర్థిక సంవత్సరానికి జల్ జీవన్ మిషన్ అమలు కోసం ఏపీకి అదనంగా రూ.1,000 కోట్లు కేటాయించాలని విన్నవించారు.జల్ జీవన్ మిషన్ కోసం ఏపీ ప్రభుత్వ వాటాగా రూ.524.41 కోట్లు ఖర్చు చేశామని, అలాగే దీనికి సంబంధించిన కేంద్ర వాటా నిధులను కూడా విడుదల చేయాలని సీఎం చంద్రబాబు కోరారు.ప్రధానమంత్రి కృషి సించాయి యోజన పథకం కింద చెరువులు, కాలువల పునరుద్ధరణకు రాష్ట్రం ప్రతిపాదనలు సిద్ధం చేసిందని పాటిల్ దృష్టికి సీఎం తీసుకువచ్చారు.ఈ పథకానికి సంబంధించి కేంద్రం వాటా నిధులు వెంటనే విడుదల చేస్తే గ్రామీణ ప్రాంతాల్లో సాగునీటి సామర్థ్యం గణనీయంగా పెంచుకునేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.పోలవరం జాతీయ ప్రాజెక్టులో వివిధ పనులకు సంబంధించి పెండింగులో ఉన్న అనుమతులు వెంటనే వచ్చేలా చూడాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిని కేంద్ర మంత్రికి సీఎం చంద్రబాబు వివరించారు.రెండో దశ పనులు పూర్తి చేయడానికి అవసరమైన నిధులపై త్వరలోనే పూర్తి నివేదిక కేంద్రానికి సమర్పిస్తామని చెప్పుకొచ్చారు.వంశధార నది వివాద ట్రిబ్యునల్ :వంశధార నది వివాదానికి సంబంధించి ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పుల అమలు ఇంకా పూర్తిగా జరగడం లేదని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. నేరడి బ్యారేజ్ నిర్మాణం శ్రీకాకుళం జిల్లాలోని కరువు ప్రాంతాల నీటి అవసరాలకు అత్యంత అవసరమని తెలిపారు. దీనికి అనుమతులు మంజూరు చేయాలని సూచించారు.ఆంధ్రప్రదేశ్ హక్కులకు భంగం కలగకుండా, ట్రిబ్యునల్ నిర్ణయాల అమలుకు కేంద్రం స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని కోరారు. ఈ అంశంపై తక్షణమే కేంద్ర జోక్యం చేసుకోవాలని సూచించారు సీఎం చంద్రబాబు.ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపు అంశం :ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం కలిగించేలా కర్నాటక రాష్ట్ర ప్రభుత్వం ఆల్మట్టి డ్యామ్ ఎత్తును పెంచాలని భావిస్తోందని, దీనికి సంబంధించి భూసేకరణకు కూడా సిద్ధమైందని ప్రస్తావించారు.అయితే ఈ వివాదం సుప్రీంకోర్టు పరిధిలో ఉన్నందున కర్నాటక ప్రభుత్వం ఈ విషయంపై ముందుకు వెళ్లకుండా కేంద్ర ప్రభుత్వం నిలువరించాలని సీఆర్ పాటిల్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు.

# రాజమండ్రికి లోకేష్ ఆప్యాయంగా పలకరిస్తూ ఫోటోలు దిగిన మంత్రి



**రాజమహేంద్రవరం, డిసెంబర్ 19:** విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ (శుక్రవారం) రాజమండ్రి ఎయిర్ పోర్ట్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా మంత్రికి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. తన వద్దకు వచ్చిన మంత్రి ఆప్యాయంగా పలకరిస్తూ ఫోటోలు దిగారు. అనంతరం విమానాశ్రయం నుంచి బయలుదేరిన లోకేష్‌కు అడుగడుగునా ఘన స్వాగతం లభించింది. బూరుగుపూడి, గాడాల గ్రామంలో మంత్రికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. రాజమండ్రి క్వారీ మార్కెట్ జంక్షన్ వద్దకు చేరుకున్న లోకేష్‌కు పార్టీ జెండాలు, డప్పులు, బాణా సంచాలతో పెద్ద ఎత్తున తెలుగు దేశం నేతలు, ప్రజలు స్వాగతం పలికారు. ఆపై లాలాచెరువు జంక్షన్‌లో కూడా మంత్రిని ఘన స్వాగతించారు టీడీపీ శ్రేణులు.ఇక జిల్లా పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి పనులను మంత్రి మొదలుపెట్టనున్నారు. రాజమండ్రి ప్రభుత్వ ఆర్ట్స్ కాలేజీలో పలు నూతన భవనాలను లోకేష్ ప్రారంభించనున్నారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. ఆపై ఆదికవి నన్నయ్య యూనివర్సిటీలో పలు నూతన భవనాలను ప్రారంభిస్తారుఅనంతరం రాజమండ్రిలోని చెరుకూరి వీర్రాజు సుబ్బలక్ష్మి కన్వెన్షన్ సెంటర్‌లో రాజమండ్రి, రాజానగరం నియోజకవర్గాల ఉత్తమ కార్యకర్తల సమావేశంలో మంత్రి పాల్గొననున్నారు. అలాగే రాజమండ్రి, రాజానగరం నియోజకవర్గాల కార్యకర్తలు, నేతలతో సమన్వయ సమావేశంలో మంత్రి నారా లోకేష్ పాల్గొంటారు.

# తెలంగాణకు ఇచ్చినట్టే మాకు ఇవ్వాలని కేంద్రాన్ని కోరాం



**న్యూఢిల్లీ, డిసెంబర్ 19:** ఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో సీఎం చంద్రబాబు కీలక భేటీ జరిగిందని ఏపీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. శుక్రవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. ఇరిగేషన్ ప్రాజెక్టులపై మంచి చర్చ జరిగిందన్నారు. పోలవరం జాతీయ ప్రాజెక్టుకు కేంద్ర సహకారానికి సీఎం కృతజ్ఞతలు తెలిపారన్నారు. 2011లో జారీ చేసిన పోలవరం స్టాప్ వర్క్ ఆర్డర్‌ను శాశ్వతంగా రద్దు చేయాలని విజ్ఞప్తి చేశామని. స్టాప్ వర్క్ ఆర్డర్ ప్రస్తుతం 2026 నవంబర్ వరకు పొడిగించారని చెప్పారు. పోలవరం రైట్, లెఫ్ట్ మెయిన్ కెనాల్స్ సామర్థ్యాన్ని 17,500 క్యూసెక్కులకు పెంపు, అదనపు వ్యయాన్ని పోలవరం ప్రాజెక్టు ఖర్చులో చేర్చాలని కేంద్రానికి విజ్ఞప్తి చేసినట్లు మంత్రి తెలిపారు.గోదావరి జలాల పంపకాలపై వెంటనే ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశామన్నారు. అపెక్స్ కౌన్సిల్ నిర్ణయాన్ని అమలు చేయాలని కేంద్రాన్ని సీఎం కోరారన్నారు. వంశధార ట్రిబ్యునల్ 2021 తీర్పును వెంటనే అమలు చేయాలని విజ్ఞప్తి చేశామన్నారు. వంశధార తీర్పుతో నేరేడు బ్యారేజ్ నిర్మాణానికి అవకాశం ఉంటుందన్నారు. పోలవరం %–% నల్లమల సాగర్‌కు తక్షణ సాంకేతిక, ఆర్థిక అనుమతులు ఇవ్వాలని కోరామని తెలిపారు. గోదావరిలో వృధాగా సముద్రంలో కలిసిపోతున్న వరద జలాల వినియోగమే లక్ష్యమని స్పష్టం చేశారు. గత 50 ఏళ్లలో 1.53 లక్షల టీఎంసీల నీరు సముద్రంలో కలిసినట్టు వెల్లడించారు. గత 5 ఏళ్లలోనే 20,300 టీఎంసీల నీరు వృథా అయ్యిందని.. ఏటా సగటున 4,000 టీఎంసీల నీరు బంగాళాఖాతంలో కలుస్తోందని చెప్పారు.దిగువ రాష్ట్రంగా వరద నీటిని వినియోగించుకునే హక్కు ఏపీకి ఉందని స్పష్టం చేశారు. తెలంగాణలో చేపట్టిన కాళేశ్వరం , సీతారామ ప్రాజెక్టుకు ఎలా అనుమతులు ఇచ్చారో తమకు అలాగే అనుమతులు ఇవ్వాలని కోరామన్నారు. తెలంగాణ ప్రాజెక్టులకు ఇచ్చిన అనుమతులే ఏపీకి కూడా వర్తించాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. తెలంగాణలో ఉన్న రాజకీయ విభేదాల కారణంగానే తెలంగాణ ప్రభుత్వం కేసులు వేస్తుంది తప్ప వేరే అంశం అంటూ ఏమీ లేదన్నారు. సుప్రీంకోర్టులో తాము కూడా కెవియట్ పిటిషన్ దాఖలు చేశామన్నారు. వృథా నీటిని వినియోగించడం జాతీయ ప్రయోజనమని వ్యాఖ్యానించారు. తెలుగు రాష్ట్రాలు రెండూ బాగుండాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమని మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు.

# ఆ అవార్డుతో జగన్ కడుపు మంట మరింత పెరిగింది: దేవినేని



**అమరావతి, డిసెంబర్ 19:** శాసనసభకు వెళ్లి ప్రశ్నించలేని జగన్... ఇవాళ లోక్ భవన్ ముందు పచ్చి అబద్ధాలు ఆడుతున్నారని మాజీ మంత్రి దేవినేని ఉమా ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. ఢిల్లీలో వైసీపీ ఎంపీలు చేసే నాటకాలు ఏంటో.. గల్లీలో జగన్ అబద్ధాలు ఏంటో అర్థం కావడం లేదన్నారు. మెడికల్ కాలేజీలు పీపీపీ విధానంలోనే నిర్మిస్తే బాగుంటుందని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పేర్కొందని తెలిపారు. వైసీపీ ఎంపీ గురుమూర్తి పీపీపీ విధానానికి అనుకూలంగా సంతకం చేశారని.. వైవీ సుబ్బారెడ్డి, మిగతా వైసీపీ ఎంపీలకు కేంద్ర ప్రభుత్వమే మొట్టి కాయలు పెట్టిందని అన్నారు. పార్లమెంటరీ స్థాయి సంఘం, నీతి ఆయోగ్ , న్యాయస్థానాలు సైతం పీపీపీ విధానం మేలని చెబుతున్నాయని తెలిపారు. పీపీపీ విధానంలో వైద్య కాలేజీలను పూర్తి చేసి వేల మంది పేద విద్యార్థులకు వైద్య విద్య, పేదలకు కార్పొరేట్ వైద్యం అందిస్తామని స్పష్టం చేశారు.ఆరోగ్య శ్రీ, 108,104 వ్యవస్థలు పీపీపీ విధానం ద్వారా నడపలేదా జగన్ అని ప్రశ్నించారు. ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ. 6000 కోట్లు ఖర్చు చేశామని.. ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.1000 కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. రుషికొండను బోడి గుండు చేసి రూ.463 కోట్లు ఖర్చు చేశారని.. నిన్న ప్రెస్ మీట్‌లో రూ.230 కోట్లు ఖర్చు చేసినట్లు జగన్ అంటున్నారని మండిపడ్డారు. కేంద్ర క్యాబినెట్‌లో యోగాంధ్ర గురించి ప్రధాని మోదీ మెచ్చుకున్నారని.. ఈవెంట్ ఖర్చు రూ.60 కోట్లు.. దానిపై కూడా జగన్ అసత్యాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. పులివెందుల మెడికల్ కాలేజీకి రూ.481 కోట్లు ఖర్చు చేసిన జగన్.. పాడేరు, పార్వతీపురం కాలేజీలకు ఎందుకు ఖర్చు చేయలేదని ప్రశ్నించారు.కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మంగళగిరి ఎయిమ్స్‌కు 31 లక్షల ఓపీలు వచ్చాయని... వేల కొలది ఆపరేషన్లు జరిగాయన్నారు. జగన్ ఐదేళ్ల కాలంలో కేవలం 20 లక్షల ఓపీలు మాత్రమే వచ్చాయని చెప్పుకొచ్చారు. సీఎం చంద్రబాబు నాయుడుకు ఎకనామిక్ టైమ్స్ వారు ఇచ్చిన అవార్డుతో జగన్ మోహన్ రెడ్డికి కడుపు మంట మరింత పెరిగిందని... అందుకే పచ్చి అబద్ధాలు ఆడుతున్నారని ఫైర్ అయ్యారు. టీడీపీ ప్రభుత్వ హయంలో వైద్య రంగంలో 4వ స్థానంలో ఉన్న ఏపీ రాష్ట్రాన్ని జగన్ 10వ స్థానానికి తీసుకెళ్లారని విమర్శించారు. పరకామణి కేసు చిన్నది అనడంతో దేవాలయాలు, హిందువులపై జగన్ అభిప్రాయం ఏంటో అర్థమవుతోందన్నారు. చెడ్డీల కంపెనీ పక్క రాష్ట్రాలకు తరిమేసిన జగన్ గూగుల్ తీసుకొచ్చాడనటం హాస్యాస్పదమని మాజీ మంత్రి దేవినేని ఉమా వ్యాఖ్యలు చేశారు.

# డిజిటల్ అరెస్టు పేరుతో హెడ్ మాస్టర్‌కే టోకరా




**గుంటూరు:** సాంకేతిక పరిజ్ఞానం పెరిగే కొద్దీ కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. విద్యావంతులే లక్ష్యంగా లక్షలు, కోట్లు కొట్టేస్తున్నారు. ఒకప్పుడు గ్రామీణ పేదలు, నిరక్షరాసులకు ఫోన్లు చేసి మోసాలకు పాల్పడేవారు. బ్యాంకు అధికారులమని చెప్తూ అకౌంట్లలో సొత్తు కాజేసేవారు. అయితే, ఇటీవల కాలంలో డిజిటల్ అరెస్టులు పెరిగిపోయాయి. పెద్దపెద్ద చదువులు చదివిన వారు, ఎమ్మెల్యేలు, ఎంపీలు వంటి రాజకీయ నేతలూ, బిజినెస్ మ్యాన్లు ఈ డిజిటల్ అరెస్టుల బారిన పడుతున్నారు. ఏకంగా లక్షలు, కోట్లు పోగొట్టుకుంటున్నారు. నిందితులను పట్టుకోవడమూ కష్టం కావడంతో ఇటీవల ఈ తరహా నేరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. అయితే, డిజిటల్ నేరస్తులకు ఎప్పటికప్పుడు చెక్ పెడుతున్న పోలీసులు.. వారి ఆట కట్టిస్తున్నారు. తాజాగా అటువంటి ఘటనే గుంటూరు జిల్లాలో చోటు చేసుకుంది. గుంటూరు జిల్లా కాకుమాను పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ పాఠశాల హెడ్ మాస్టర్‌ను బురిడీ కొట్టించారు సైబర్ నేరస్తులు. తాము సీఐడీ అధికారులమని ప్రధానోపాధ్యాయుడికి ఫోన్ చేసిన కేటుగాళ్లు.. హ్యూమన్ ట్రాఫికింగ్ కేసులో మీ పేరు ఉందంటూ ఆయనపై బెదిరింపులకు దిగారు. డిజిటల్ అరెస్టు చేయబోతున్నట్లు భయభ్రాంతులకు గురి చేశారు. అయోమయంలోకి నెట్టేసి ఆపై డబ్బులు డిమాండ్ చేశారు. అరెస్టు చేయకుండా ఉండాలంటే రూ.42లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. హెడ్ మాస్టర్ నుంచి చివరికి రూ.22లక్షలు దండుకున్నారు. ఈ మేరకు నగదును విశాఖపట్నానికి చెందిన ఇంద్రవస్థ హాస్పిటల్ డైరెక్టర్ అకౌంట్‌కి ట్రాన్స్ ఫర్ చేశారు ఉపాధ్యాయుడు. అయితే, తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు వెంటనే కాకుమాను పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.కాల్ డేటా, నగదు ట్రాన్స్ ఫర్ అయిన వివరాల ఆధారంగా విచారణ ప్రారంభించారు. విచారణలో ఇంద్రవస్థ హాస్పిటల్ డైరెక్టర్ సురేశ్ నాయుడి ఖాతాకు నగదు బదిలీ అయినట్లు గుర్తించారు. అతన్ని విచారించగా.. కేటుగాళ్ల నుంచి 3 స్మార్ట్ ఫోన్లు, రూ.50వేలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నేరానికి పాల్పడిన ఇంద్రవస్థ హాస్పిటల్ అకౌంట్ కిట్‌ను సీజ్ చేసినట్లు వెల్లడించారు. డిజిటల్ అరెస్టులు అనేవి ఉండవని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. అలాంటి కాల్స్ చేసి ఎవరైనా బెదిరింపులకు దిగితే వెంటనే పోలీసులను సంప్రదించాలని కోరారు. మోసాలకు గురై ఆర్థికంగా నష్టపోవద్దని హితవు పలికారు.

# లోక్‌సభ నిరధిక వాయిదా ఆమోదం పొందిన కీలక బిల్లులు

**న్యూఢిల్లీ:** పార్లమెంట్ శీతాకాల సమావేశాలు తో(శుక్రవారం) ముగిశాయి. లోక్‌సభ నిరవదిక వాయిదా పడింది. డిసెంబర్ 1వ తేదీన సమావేశాలు మొదలయ్యాయి. 19వ తేదీ () వరకు కొనసాగాయి. మొత్తం 15 రోజుల పాటు సమావేశాలు జరిగాయి. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు వాడీ వేడిగా సాగాయి. సమావేశాల సందర్భంగా లోక్‌సభ పలు కీలక బిల్లులకు ఆమోదం తెలిపింది.లోక్ సభ ఆమోదం తెలిపిన కీలక బిల్లులు.మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో 'వీబీ జీ రామ్ జీ' పేరుతో తీసుకువచ్చిన బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ప్రతిపక్ష ఎంపీల ఆందోళనలు, నిరసనల మధ్య ఈ బిల్లును ఆమోదించారు. లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశ పెట్టనున్నారు.అణు ఇంధన రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ఆహ్వానించేందుకు ఉద్దేశించిన శాంతి బిల్లును పార్లమెంట్ ఆమోదించింది. సస్టెయినబుల్ హార్నెసింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా(శాంతి)



బిల్లును మూజువాణి ఓటుతో రాజ్యసభ ఆమోదించింది.బీమా రంగంలో విదేశీ పెట్టుబడుల పరిమితిని 100 శాతానికి పెంచే బీమా సవరణ బిల్లు (సబ్ కా బీమా సబ్ కా రక్ష)ను ప్రతిపక్షాల నిరసనల మధ్యే లోక్‌సభ ఆమోదించింది.మణిపూర్ గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్(రెండవ సవరణ) బిల్లు 2025 కి లోక్ సభ ఆమోదం తెలిపింది.సెంట్రల్ ఎక్సైజ్ (సవరణ) బిల్లు 2025.నేషనల్ సెక్యూరిటీ సెస్ బిల్లు 2025.సెక్యూరిటీస్ మార్కెట్స్ కోడ్ బిల్లు 2025.ఉన్నత విద్యా కమిషన్ బిల్లు 2025.జన్ విశ్వాస్(నిబంధనల సవర) బిల్లు,దివాళా, దివాళా కోడ్ (సవరణ) బిల్లు.పారదర్శకంగా భూసేకరణ కోసం జాతీయ రహదారుల(సవరణ) బిల్లు. కంపెనీల చట్టం సవరించడానికి కార్పొరేట్ చట్టలు(సవరణ) బిల్లులకు లోక్ సభ ఆమోదం తెలిపింది.

# నా విజయం వెనుక భార్య త్యాగం ఉంది

**చెన్నై:** ప్రతి పురుషుడి విజయం వెనుక స్త్రీ ఉంటుంది అనేది సుప్రసిద్ధ నానుడి అని, ఆ కోవలోనే తన విజయపరంపరల వెనుక తన సతీమణి ఆదరణ, ప్రోత్సాహం, త్యాగం దాగి ఉందని, ఆమె ఓర్పుగా ఉండడం వల్లే తానింతటి ఉన్నత స్థితికి చేరుకోగలిగానని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌అన్నారు. భార్య చెప్పే మంచిమాటలను భర్త శిరసావహించాలని, అప్పుడే అన్యోన్య దాంపత్యం సాగుతుందన్నారు. గురువారం కొళత్తూరు నియోజకవర్గంలోని రూ.25.72 కోట్లతో నిర్మించిన అన్నా కళ్యాణమండపాన్ని ప్రారంభించిన, ఆయన 15 జంటలకు వివా హం జరిపించారు.అదేవిధంగా రూ.17.47 కోట్లతో జీకేఎం కాలనీలో ప్రభుత్వ ఆదర్శ మహోన్నత పాఠశాల, పెరియార్‌నగరంలో అముదం అంగడి (రేషన్‌షాపు) కూడా ఆయన ప్రాంభించారు. 15 జంటలకు వివాహాలు జరిపించి ఆశీర్వదించిన అనంతరం స్టాలిన్ మాట్లాడుతూ ప్రతి పది రోజులకూ తన సొంత నియోజకవర్గంలో పర్యటించడానికి మంత్రి శేఖర్‌బాబు కారణమని, తన నియోజకవర్గంలో కనీసం 10 కార్యక్రమాలకు తగ్గకుండా ఏర్పా



టు చేసి తనను ఆహ్వానించడం అలవాటుగా పెట్టుకున్నారని కొనియాడారు. ఈనియోజకవర్గం ప్రజల విజ్ఞప్తి మేరకు రాజీవ్‌గాంధీ స్మా రక సర్వజన ఆసుపత్రి (జీహెచ్) కంటే మరిన్ని సదుపాయాలతో పెరియార్ ఆస్పత్రి స్థాయిని పెంచామని తెలిపారు. నూతన వధూవరులకు తాను చెప్పదలచిందొకటేనని, భార్య మాటకు కట్టుబడితేనే మగవాడి జీవితం ధన్యమవుతుందని తెలిపారు. రాజకీయాల్లో ఉన్నత స్థితికి చేరటానికి తన భార్యే కారణమని, ఎమర్జెన్సీ రోజుల్లో యేడాదిపాటు జైలు శిక్ష అనుభవించానని, తాను ఏ జైలులో ఉన్నానో కూడా తెలియని పరిస్థితుల్లో తన సతీమణి సహనం పాటించిందని, లేకుంటే తానింత ఉన్నత స్థితికి చేరేవాడిని కానన్నారు.తనకు కష్టాలు ఎదురైనప్పుడల్లా ఆమె ఉత్సాహపరస్తూ ఉండేవారని స్టాలిన్ వివరించారు. తన సమక్షంలో వివాహం చేసుకున్న 15 జంటలకు తానిచ్చే సలహా ఒక్కటేనని తమకు పుట్టబోయే బిడ్డలకు అందమైన పేర్లు పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో మంత్రులు కేఎన్ నెహ్రూ, పీకే శేఖర్‌బాబు, అన్బిల్ మహేష్, మేయర్ ఆర్ ప్రియ, ఎమ్మెల్యేలు తాయగం కవి, జోసెఫ్ సామువేల్, వెట్రి అళగన్, డిప్యూటీ మేయర్ మహేషకుమార్, కార్పొరేషన్ కమిషనర్ కుమారగురుబరన్, డిప్యూ టీ కమిషనర్ గట్టా రవి, మాజీ శాసనసభ్యుడు రంగనాథన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆ సీట్ల కోసం షిండే పట్టు మహాయుతిలో విభేదాలు తీవ్రం

**ముంబై:** మహారాష్ట్ర లో త్వరలో జరుగనున్న బీఎంసీ ఎన్నికల్లో సీట్ల పంపకాల విషయంలో షిండే సారథ్యంలోని శివసేన, బీజేపీ మధ్య ప్రతిష్టంభన నెలకొంది. 2017 బ్రిహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలను ప్రస్తావిస్తూ ఆ సమయంలో ఐక్య శివసేన గెలిచిన 84 సీట్లు తమకే కేటాయించాలని షిండే శివసేన డిమాండ్ చేసినట్టు తెలుస్తోంది. అయితే ఈ డిమాండ్‌ను బీజేపీ నిర్ద్వంద్వంగా తోసిపుచ్చినట్టు సమాచారం.ప్రస్తుత పరిస్థితికి, 2017 నాటి పరిస్థితికి చాలా తేడా ఉందని బీజేపీ వాదనగా ఉంది. షిండే శివసేన, ఉద్ధవ్ ఠాక్రే శివసేన మధ్య ముఖాముఖీ పోటీ వల్ల మహాయుతి కూటమికి నష్టం జరుగుతుందని బీజేపీ చెబుతోంది. షిండే శివసేన ఎక్కడైతే బలంగా ఉందో గెలుపు అవకాశాలు మెండుగా ఉన్నాయో ఆయా సీట్లను మాత్రమే కేటాయించగలమని బీజేపీ స్పష్టం చేసినట్టు తెలుస్తోంది. బీఎంసీలోని 227 సీట్లలో ఇరు పార్టీల మధ్య 77 సీట్ల విష



యంలో విభేదాలు తలెత్తాయి. రాబోయే రెండు రోజుల్లో ఈ ప్రతిష్టంభనకు తెరపడే ఆవకాశం ఉంది.పోలింగ్ షెడ్యూల్బీఎంసీతో పాటు మహారాష్ట్రలోని 29 మున్సిపల్ కార్పొరేషన్లకు ఎన్నికల షెడ్యూల్‌ను డిసెంబర్ 15న రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటించింది. 2026 జనవరి 15న ఒకే విడతలో ఈ ఎన్నికలు జరుగనున్నాయి. జనవరి 16న ఫలితాలు వెలువడతాయి.కమిటీ ఏర్పాటుబీఎంసీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపిక కోసం ముంబై బీజేపీ అధ్యక్షుడు అమిత్ సతమ్ 20 మంది సభ్యుల కమిటీని ఏర్పాటు చేశారు. అమిత్ సతమ్ చైర్మన్‌గా వ్యవహరించే ఈ కమిటీలో కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్, జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే, రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ రాహుల్ నార్వేకర్‌తో పాటు పలువురు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు సభ్యులుగా ఉన్నారు.

# బీజేపీ రాష్ట్ర చీఫ్ సంచలన కామెంట్ ఆయన ఓ ఔట్ గోయింగ్ సీఎం

**బెంగళూరు:** బెళగావి సువర్ణసౌధ వేదికగా రాష్ట్రానికి చెందిన ఇద్దరు ముఖ్యనేతల మాటల తూటాలు పేల్చారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్రఆరోపణలకు డీసీఎం డీకే శివకుమార్ ధీటైన పదజాలంతో తిప్పికొట్టారు. గురువారం విజయేంద్ర మీడియాతో మాట్లాడుతూ సిద్దరామయ్య అవుట్‌గోయింగ్ సీఎం అన్నారు. ఖజానా ఖాళీ చేశారని ప్రతి విషయంలోను గ్రాంట్ల లోటు అన్నారు. కాంగ్రెస్ పాలనలో అవినీతి పెరిగిందని వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో 90 కోట్ల రూపాయలకు పైగా దాకా అవినీతి జరిగిందన్నారు.ఆయనో కలెక్షన్ కింగ్: డీకేఇదే విషయమై డీసీఎం డీకే శివకుమార్ తీవ్రంగా స్పందించారు. తండ్రి యడియూరప్ప పేరు చెడిపారని అతడో కలెక్షన్ కింగ్ అంటూ విజయేంద్రను ఉద్దేశించి మండిపడ్డారు. ఎక్కడెక్కడో తిరుగుతూ మాట్లాడటం కాదని అసెంబ్లీలో ప్రశ్నిస్తే సమాధానం చెబుతానన్నారు. విజయేంద్రకు సభలోను జీవితంలోనూ, రాజకీయంగాను అనుభవం లేదన్నారు. విజయేంద్ర ఓ పెద్ద



కలెక్షన్ మాస్టర్ అన్నారు. అతడి ట్రాన్స్‌ఫర్ కలెక్షన్ గురించి విడమరచి చెప్పాలా అంటూ సవాల్ చేశారు.అయితే డీకే శివకుమార్ వ్యాఖ్యలపైనా విజయేంద్ర ధీటుగా స్పందించారు. డీకే శివకుమార్ నుంచి పాఠాలు నేర్చుకోవాల్సిన గతి తనకు పట్టలేదన్నారు. మాట్లాడే ముందు నోరు అ దుపులో పెట్టుకోవాలన్నారు. తన గురించి, తన తండ్రి గురించి మాట్లాడే ముందు తెలుసుకోవాలన్నారు. తాను రోజు అసెంబ్లీకు వస్తున్నానని కేవలం బుధవారం మాత్రమే ఢిల్లీ వెళ్ళానని అంతకు మించి రోజూ సభలో ఎన్ని అంశాలపై మాట్లాడానో తెలుసుకోవాలన్నారు.మాజీ మంత్రి రాజణ్ణ స్పందిస్తూ మేం కూడా విజయేంద్ర అవుట్ గోయింగ్ బీజేపీ ప్రెసిడెంట్ అంటామన్నారు. ఇలాంటి వ్యాఖ్యలను జీర్ణించుకునే ఆయనకు సత్తా ఉందా అని సవాల్ విసిరారు. అనవసర ఆరోపణలు చేస్తే సహించేది లేదని, బీజేపీ నేతలు నిజమెరిగి మాట్లాడాలన్నారు. కాంగ్రెస్ గ్యారెంటీలు, అభివృద్ధిని చూసి ఓర్వలేకనే అనవసర ఆరోపణలు చేస్తున్నారని మండి పడ్డారు. సభలో ఇరు వర్గాలకు తీవ్ర వాగ్వాదం జరిగింది.

# మ్యూజియానికి నెహ్రూ లేఖలను సోనియా తిరిగి ఇవ్వాలి

**న్యూఢిల్లీ, డిసెంబర్ 19:** భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూకు సంబంధించి లేఖలను ప్రైమ్ మినిస్టర్స్ మ్యూజియం అండ్ లైబ్రరీకి (పీఎం ఎంఎల్) కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ తిరిగి ఇవ్వాలని కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అన్నారు. పీఎంఎంఎల్ నుంచి లేఖలను తీసుకెళ్లడంపై ఈ మేరకు ప్రశ్నలు లేవనెత్తారు. దేశ డాక్యుమెంటరీ వారసత్వాన్ని కాపాడుకునే ప్రయోజనం కోసం వాటిని తిరిగి ఇవ్వాలని ఆయన కోరారు.' 1971 నుంచి 1992 మధ్య 9 వేర్వేరు సందర్భాల్లో జవహర్‌లాల్ నెహ్రూకు సంబం ధించిన సుమారు 4 లక్షల పత్రాలు ప్రధాని మ్యూజియానికి అం దజేశారు. ఈ పత్రాలు అప్పగించినప్పుడు స్పష్టంగా ఇవి బహు మతులు కావు, కేవలం భద్రపరచడానికి ఇచ్చినవే అని రాసి ఉంది. ఈ నిబంధనను ఉపయోగించుకొని 2008లో సోనియా గాంధీ ఆదేశాల మేరకు ఎంవీ రాజన్ అక్కడికి వెళ్లి, భద్రపరచిన పత్రాల్లో కొన్నిటిని తిరిగి కావాలని చెప్పి తీసుకెళ్లారు. తర్వాత 21 వేల పత్రాలను తిరిగి ఇచ్చారు. అయితే ఆ లేఖలను తిరిగి ఇవ్వాలని పీఎం మ్యూజియం సోనియా గాంధీని కోరింది. దానికి సోనియా గాంధీ స్పందిస్తూ ఈ విషయం పరిశీలిస్తాను అని సమాధానం ఇచ్చారు. కానీ పత్రాలు తిరిగి ఇవ్వలేదు. ఆ పత్రాల ను ప్రధాని మ్యూజియానికి తిరిగి ఇవ్వాలని నేను ఆమెను కోరుతున్నాను'



అని గజేంద్ర సింగ్ షెకావత్ అన్నారు. అంతకుముందు 'ప్రధానమంత్రుల మ్యూజియం నుంచి నెహ్రూ ప్రైవేటు పేపర్లు గల్లంతు అయ్యాయా?' అని ప్రశ్నిస్తూ బీజేపీ ఎంపీ సంబిత్ పాత్ర అడిగిన ఓ ప్రశ్నకు ఈమేరకు కేంద్ర సాం స్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ రాతపూర్వక సమా ధానం ఇచ్చారు. దేశ తొలి ప్రధానికి సంబంధించిన ఏ ఒక్క డాక్యుమెంట్ కూడా మ్యూజియం నుంచి మిస్ కాలేదని తేల్చి చెప్పారు. అవి కాంగ్రెస్ మాజీ చీఫ్ సోనియాగాంధీ దగ్గరే ఉన్నా యని తెలిపారు. నెహ్రూకు సంబంధించిన పేపర్లను తిరిగి మ్యూ జియానికి ఇచ్చేయమని ఇప్పటికే ఆమెను కోరామని వెల్లడించారు. దీనిపై కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నెహ్రూ ప్రైవేటు పేపర్లు సోనియాగాంధీ వద్ద ఉన్నాయనే ఆరోపణ చేసినందుకు క్షమాపణ చెప్పాలని కేంద్ర సర్కారును డిమాండ్ చేశారు. ఆ పేపర్లు సోనియాగాంధీ వద్ద లేకపోయినా, వాటిని తిరిగి ఇచ్చేయాలని ఆమెను కోరడం సరికాదన్నారు.నెహ్రూ ఎవరికి లేఖలు రాశారు?చరిత్రక ప్రాముఖ్యత కలిగిన నెహ్రూ లేఖలను జవహర్ లాల్ నెహ్రూ మెమోరియల్ 1971లో నెహ్రూ మెమోరియల్ మ్యూజియం అండ్ లైబ్రరీకి అప్పగించింది. అయితే 2008లో 51 బాక్సుల్లో ప్యాక్ చేసిన వాటిని సోనియాగాంధీకి పంపారు. తండ్రి మోతీలాల్ నెహ్రూ, తల్లి స్వరూపా రాణి, సోదరీమణులు విజయలక్ష్మీ పండిట్, క్రిష్ణ హుతీసింగ్, కుమార్తె ఇందిరాగాంధీ, ఎడ్వినా మౌంట్‌బాటన్, పీఎన్ హక్సర్, ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, జయప్రకాశ్ నారాయణ్, బాబు జగ్జీవన్ రామ్ వంటి వారికి నెహ్రూ లేఖలు రాశారు. సాధారణంగా ఇలాంటి లేఖలు, డైరీలు, నోట్సులను పరిశోధకుల కోసం లైబ్రరీలు, పరిశోధనా సంస్థలకు విరాళంగా ఇస్తుంటారు. మొదటి నుంచి న్యూఢిల్లీలోని నెహ్రూ మెమోరియల్ అండ్ లైబ్రరీ సొసైటీలో నెహ్రూ డాక్యుమెంట్లు ఉన్నాయి. 2023లో ఈ సొసైటీ పేరును ప్రధానమంత్రుల మ్యూజియం అండ్ లైబ్రరీ సొసైటీగా మార్చారు.

# బీజాపూర్ జిల్లాలో ఎన్ కౌంటర్ మావోయిస్ట్ మృతి



**ఛత్తీస్‌గఢ్ :**ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులకు షాకుల మీద షాకులు తగులుతున్నాయి. భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య చోటుచేసుకుంటున్న ఎన్ కౌంటర్లలో పెద్ద ఎత్తున మావోయిస్టులు ప్రాణాలు కోల్పోతూ ఉన్నారు. శుక్రవారం బీజాపూర్ జిల్లాలో డీఆర్‌జీ జవాన్లకు మావోయిస్టులకు మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఎదురు కాల్పుల్లో ఓ మావోయిస్టు ప్రాణాలు కోల్పోయాడు. సంఘటనా స్థలం నుంచి భద్రతా దళాలు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాయి. ఇంద్రావతి ప్రాంతంలోని అడవుల్లో మావోయిస్టులు ఉన్నారనే సమాచారంతో డీఆర్‌జీ జవాన్లు సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించారు.ఉదయం నుంచి డీఆర్‌జీ బృందానికి, మావోయిస్టులకు మధ్య అడపాదడపా కాల్పులు జరుగుతున్నాయి. ఎదురుకాల్పుల ఘటనను ఎస్పీ జితేంద్ర కుమార్ యాదవ్ ధృవీకరించారు. భైరంగఢ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎన్ కౌంటర్ జరిగినట్లు తెలిపారు. కాగా, ఛత్తీసగఢ్‌లోని సుక్మా జిల్లా కిష్టారం అడవుల్లో మావోయిస్టులు, డీఆర్‌జీ బలగాల మధ్య గురువారం జరిగిన కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. వీరిలో ఒక మహిళ కూడా ఉంది. కిష్టారం అడవుల్లో మావోయిస్టులు ఉన్నారనే సమాచారంతో డీఆర్‌జీ బలగాలు కూంబింగ్ చేపట్టగా ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. చనిపోయినవారు మావోయిస్టు పార్టీ కిష్టారం ఏరియా కమిటీ సభ్యులైన మడివి జోగా, సోది బండి, నుప్పో బజ్జీ (మహిళ)గా పోలీసులు గుర్తించారు.

# మహిళా న్యాయవాదిపై పోలీస్ స్టేషన్‌లో లైంగిక వేధింపులు



**లక్నో:** ఒక క్లయింట్‌కు సహాయంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన మహిళా న్యాయవాదిపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. ఆమెను శారీరకంగా హింసించడంతో పాటు లైంగికంగా వేధించారు. ఆ మహిళా లాయర్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ నేపథ్యంలో ఆ పోలీస్ స్టేషన్‌లోని సీసీటీవీ ఫుటేజ్‌ను అత్యున్నత న్యాయస్థానం కోరింది. డిసెంబర్ 3న అర్ధరాత్రి దాటిన తర్వాత మహిళా న్యాయవాది ఒక క్లయింట్‌కు సహాయంగా ఉత్తరప్రదేశ్ నోయిడా సెక్టార్ 126లోని పోలీస్ స్టేషన్‌కు వెళ్లింది. తీవ్రంగా గాయపడిన క్లయింట్ వినయ్ సింఘాల్ ఫిర్యాదుపై తప్పనిసరిగా ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలని ఆమె పట్టుబట్టింది.కాగా, ఆ సమయంలో డ్యూటీలో ఉన్న స్టేషన్ హౌస్ ఆఫీసర్‌తో పాటు పోలీసులు ఆ మహిళా న్యాయవాదిని అక్రమంగా నిర్బంధించారు. అర్ధరాత్రి 12.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆమెను శారీరకంగా హింసించారు. లైంగికంగా వేధించారు. మహిళా లాయర్ ధరించిన నల్లకోటును చించారు. రహస్య వీడియో రికార్డర్ కోసం ఆమె దుస్తులను తనిఖీ చేశారు. తాకి అసభ్యకరంగా ప్రవర్తించినట్లు ఆమె ఆరోపించింది.


# జీ రామ్ జీ బిల్లు ఆమోదంపై రాత్రంతా ప్రతిపక్షాల నిరసన

**న్యూఢిల్లీ:** మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామి పథకాన్ని వీజీ-జీ రామ్ జీగా మార్పు చేసిన బిల్లును పార్లమెంటు ఆమోదించడంపై ప్రతిపక్షాలు నిరసన తెలిపాయి. ఎంపీలు గురువారం రాత్రంతా పార్లమెంటు ఆవరణలో ధర్నా చేశారు. 12 గంటలపాటు నిరసన కొనసాగించారు.వికసిత్ భారత్ గ్యారెంటీ రోజ్‌గార్, అజీవిక మిషన్ (గ్రామీణ్) (వీజీ-జీ రామ్ జీ) బిల్లును ప్రతిపక్షాల నిరసనల మధ్య గురువారం పార్లమెంటు ఆమోదించింది. రాజ్యసభలో అర్ధరాత్రి తర్వాత దీనికి ఆమోదం తెలిపారు.కాగా, ప్రస్తుత ఎంజీఎన్ఆర్ఈజీఏ పథకం నుంచి మహాత్మా గాంధీ పేరు తొలగించడంపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. ప్రతిపక్ష ఎంపీలు గురువారం రాత్రంతా పార్లమెంటు ఆవరణలో 12 గంటల పాటు ధర్నా చేశారు. కొత్త బిల్లు రైతులు, గ్రామీణ పేదల వ్యతిరేకమని ఆరోపించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి మహాత్మా గాంధీ పేరు తొలగించడంపై దేశ వ్యాప్తంగా నిరసనలు చేపడతామని తెలిపారు.




# అఫ్ఘానిస్థాన్‌ను వణికించిన భూకంపం మణిపూర్‌లోనూ ప్రకంపనలు

**అఫ్ఘానిస్థాన్ :** అఫ్ఘానిస్థాన్ లో భూకంపం సంభవించింది. శుక్రవారం ఉదయం భూమి ఒక్కసారిగా కంపించింది. రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత 4.1గా నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది. భూమికి 10 కిలోమీటర్ల లోతులో భూకంపం కేంద్రం ఉన్నట్లు తెలిపింది. అయితే, భూకంపం తీవ్రత స్వల్ప స్థాయిలోనే ఉండటంతో ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదు. ఈ ప్రకంపనలతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఇండ్ల నుంచి బయటకు పరుగులు తీశారు.మరోవైపు ఈశాన్య రాష్ట్రం మణిపూర్ నూ భూమి కంపించింది. ఉఖ్రుల్‌లో ఇవాళ తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో భూప్రకంపనలు చోటు చేసుకున్నాయి. రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత 2.9గా నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ తెలిపింది. భూమికి సుమారు 35 కిలోమీటర్ల లోతులో భూకంపం సంభవించినట్లు పేర్కొంది.



# ప్రజా సమస్యలపై పట్టింపు లేని సమావేశాలు !

పార్లమెంట్ శీతాకాల సమావేశాలను కూడా మమ అనిపించారు. ఏ సమస్యపైనా సమగ్ర చర్చ జరగ కుండానే సాగాయి. ఈ సమావేశాల్లో కూడా అధికార ఎన్‌డిఎ కూటమిదే పైచేయిగా సాగింది. ఒకప్పుడు విపక్షాలది పైచేయిగా ఉండేది. విపక్షంలో అనుభవ రాహిత్యం కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది. డిసెంబరు 1న ప్రారంభమైన పార్లమెంట్ శీతాకాల సమావేశాలు తొలినాటి నుండి గందరగోళంగానే సాగాయి. అందుకే ప్రభుత్వంపై పైచేయి సాధించడంలో, ప్రజల పక్షాన కొట్లాడంలో విఫలం అయ్యారు. పార్లమెంటులో గొడవ పడడం, వాకౌట్ చేయడం, బయట ధర్నాలు చేయడం పరిపాటిగా మారింది. సమస్యలపై కేంద్రాన్ని నిలదీసే సత్తా ఉన్న నేతలు కానరావడం లేదు. అందుకే ప్రభుత్వం తాను కోరుకున్నట్లుగా వందేమాతరంపై చర్చించింది. ఎన్నికల సంస్కరణలపై తూతూమంత్రంగా చర్చ సాగింది. ఉపాధిహామిని రద్దు చేసి జీ రాం జీ బిల్లును ఆమోదించింది. ఢిల్లీ కాలుష్యంపై ఆందోళన వ్యక్తం అవుతోంది. దీనిపై సమగ్రంగా చర్చించి, పరిష్కారం కనుగొనే ప్రయత్నం చేయడంలో అధికార, విపక్షం పూర్తిగా విఫలం అయ్యింది. ఇంతటి తీవ్ర సమస్యపై పార్లమెంటు సభ్యుల్లో అవగాహన కొరవడడం ప్రజల దురదృష్టం. ఇలాంటి వారు ఏ సమస్య పైనా సీరియస్‌గా చర్చిస్తారని అనుకోవడం బుద్ధి తక్కువే అవుతుంది. ఇక అన్నింటికి మించి పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న ప్రతి సందర్భం లోనూ ప్రధాని మోడీ విదేశీ పర్యటనలో ఉంటున్నారు. చర్చలో పాల్గొనడం, సమాధానం చెప్పడం అన్నది అరుదుగా కనిపిస్తోంది. అలాగే ప్రధాని తరవాత విపక్షనేత కూడా రాహుల్ జర్మనీ చెక్కేశారు. అసలు సమావేశాల సందర్భంగా ఇలాంటి పర్యటనలు లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంది. ఇక కార్మిక చట్టాలపై సర్వత్రా వ్యతిరేకత వస్తోంది. ప్రధానంగా లెఫ్ట్ పార్టీలు వీటిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. దేశం ఎదుర్కొంటున్న ప్రజా సమస్యలు పార్లమెంట్ సమావేశాల్లో కనీస ప్రస్తావనకు కూడా రాలేదు. తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో అమలవుతున్న రెండవ విడత ఓటర్ల జాబితా సవరణ పై ఎన్నికల సంస్కరణ పేరుతో చర్చించినా విపక్షాలు సఫలం కాలేదు. అనేక అంశాలను చర్చించాల్సి ఉన్నా కేవలం సర్‌పై మాత్రమే దృష్టి సారించింది. బీహార్ ఎన్నికల ఫలితాలను ఈ 'సర్' తలకిందులు చేసిందని ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్నా కనీస వివరణ ఇవ్వడానికి కూడా కేంద్రం సిద్ధం కాలేదు. రెండవ విడత సవరణ జరుగుతున్న రాష్ట్రాల్లో సుమారు 11 కోట్ల మంది ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని ప్రతిపక్షాలు ఆందోళన చేయడమే తప్ప సూటిగా జరిగే తప్పులను లేవనెత్తలేక పోయారు. ఎవరి ఓటు గల్లంతు అవుతుందో చెప్పడం లేదు. ప్రజాస్వామ్య సౌధానికి పునాది అయిన ఓటునే 'సర్' బీటలుబారుస్తుందనడం ద్వారా ఆరోపణలు చేయడం తప్ప ఆధారాలతో నిలదీయడంలో విపక్షం పూర్తిగా విఫం అయ్యింది. ఇకపోతే ఇప్పటి వరకు అమలులో వున్న కార్మిక, కర్షక చట్టాలు సమగ్రమైనవి, సర్వసమస్యలను పరిష్కరించేవి కాకపోయినా మార్పులు చేశారు. 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా కుదించేశారు. కోట్ల మంది గ్రామీణ కూలీలకు 'పని' గ్యారంటీగా ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని పథకం పేరు మారింది. పనితీరు మారింది. నిధులు విడుదలా మారింది. దేశ సైనిక, ఆర్థిక రక్షణకు తోడ్పడిన అణు, బీమా రంగాల్లోకి నూరు శాతం విదేశీ పెట్టుబడుల ప్రవేశానికి అనుమతులు ఇచ్చే బిల్లులను ఆమోదించారు. సెల్‌ఫోన్‌ల ద్వారా వ్యక్తుల రహస్యాలను సేకరించేందుకు ఉద్దేశించిన 'సంచార్ సాథీ' బిల్లును తీసుకురావడానికి ప్రయత్నించి, ప్రతిఘటనతో వెనక్కు తగ్గారు. 71 పాత చట్టాలను రద్దు లేదా సవరణ చేసే మరో బిల్లును పార్లమెంట్ ఆమోదించింది. పార్లమెంట్ సమావేశాలకు కొద్ది రోజుల ముందు ఢిల్లీ ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుళ్ళ, రక్షణ వైఫల్యాలు, ఉగ్రవాద నిర్మూలనకు కేంద్రం చేపడుతున్న చర్యల గురించి పార్లమెంట్‌కు చెప్పాల్సిన బాధ్యతను విపక్షంతో పాటు కేంద్రం కూడా విస్మరించింది. అలాగే 'వికసిత భారత్' రాజధాని ఢిల్లీలోని ఒకరోజు నివసిస్తే కాలుష్యం వల్ల 15 సిగరెట్లు కాల్చినంతగా ఆరోగ్యం చెడిపోతుందని నిపుణులు చెబుతున్నారు. ఇంతటి



కాలుష్యానికి కారణాలు ఏమిటన్నదాని నివారణకు తీసుకుంటున్న చర్యలు ఏమిటో, ప్రజలు ఏమీ చేయాలో పార్లమెంట్ సాక్షిగా ప్రభుత్వం చెబుతుందని ఆశించినవారికి నిరాశే మిగిలింది. డాలర్‌లో రూపాయి మారకం విలువ సుమారు 91 రూపాయలకు పడిపోయింది. దీనివల్ల ముడిచమురు ధరలు పెరిగి నిత్యావసర సరుకుల ధరలతో పాటు, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు మూతపడి, అదనపు నిరుద్యోగం పెరుగుతుంది. ఇంతటి ముఖ్యమైన అంశం పార్లమెంట్‌లో ప్రస్తావనకుకూడా రాలేదు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ధిక్కరించి 5 వేల విమాన సర్వీసులను రద్దు చేసి దేశ ప్రతిష్టను దిగజార్చిన ప్రైవేట్ విమాన సర్వీసు 'ఇండిగో' గురించి, హెచ్1 బి వీసా, సుంకాల పెంపు, రష్యా చమురు దిగుమతులపై ఆంక్షలు విధిస్తున్న ట్రంప్ నిర్ణయాలపై చర్చ జరపకుండా ప్రజా సమస్యలను గాలికొదిలేశారు. ఇవన్నీ చర్చించేలా ఎజెండాను సెట్ చేయాల్సిన విపక్షనేతలు మరచి పోయారు. ఇవన్నీ కూడా చర్చించి, తద్వారా సమస్యలను పరిష్కరించుకోవాల్సి ఉంది. కానీ ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ అనుభవ రాహిత్యం, ఆయన అనుచరుల వ్యూహాత్మక తప్పిదం కారణంగా అనేక సమస్యలు ఎప్పటిలానే వెనకబడి పోయాయి. ఇందుకు ప్రభుత్వాన్ని నిందించడం కన్నా చర్చను లేవనెత్తే విషయంలో విఫలం అయినందుకు విపక్షాన్ని దునుమాడాల్సిందే. అలాగే 1962 నాటి అణుశక్తి, 2010 నాటి పౌర అణు నష్టబాధ్యత చట్టాలను సవరిస్తూ ఈ పార్లమెంట్‌లో బిల్లు ఆమోదించారు. అణుశక్తి వంటి వ్యూహాత్మక, కీలక రంగం లోకి తమకిష్టమైన కార్పొరేట్ కంపెనీలకు అనుమతులు ఇచ్చి అణురక్షణ, దేశ భద్రతను ప్రమాదంలో వేశారు. కొత్త బిల్లు ప్రకారం అణు రియాక్టర్ల వల్ల ప్రమాదం జరిగినప్పుడు పౌరులకు చెల్లించాల్సిన నష్టపరిహారం యజమానుల దయాదాక్షిణ్యాలకు వది లేసింది. ఉన్న చట్టాలే అమలు చేయని ఈ కంపెనీలు రానున్న రోజుల్లో ప్రజలకు ఏరకంగా బాధ్యత వహిస్తాయో పాలకులే చెప్పాలి.

# కార్మిక చట్టాలను తుంగలో తొక్కడం దారుణం

**కొత్త చట్టాలతో కార్మికుల హక్కులకు భంగం**

**కేంద్రం తీరుపై మండిపడ్డ లెఫ్ట్ నేతలు**

**విజయవాడ,డిసెంబర్19:** కార్మిక చట్టాల రద్దు గురించి పార్లమెంటులో చర్చ జరగాలని ప్రతిపక్షాలు పట్టుపట్టినా కేంద్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని లెఫ్ట్ నేతలు మండిపడ్డారు. ఈ కోడ్‌ల ప్రకారం దేశంలోని 70 శాతం పరిశ్రమల్లోని 74 శాతం కార్మికులకు ఎలాంటి చట్టబద్ధమైన హక్కులు లేకుండా పోతున్నాయి. ప్రజా సంక్షేమ చట్టాలను రద్దు చేస్తూ కేంద్రం తీసుకుంటున్న నిర్ణయాలను నివారించగలిగే స్థితి రాష్ట్రంలోని తెలుగుదేశం, జనసేన పార్టీలకు వుంది. ఈ పార్టీలు మద్దతు ఇవ్వకపోతే కేంద్ర ప్రభుత్వం మనుగడ కోల్పోతుంది. మన రాష్ట్రంలోని గ్రామీణ కూలీలకు, మౌలిక సౌకర్యాల ఏర్పాటుకు తోడ్పడుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కుదించి రాష్ట్రంపై భారం వేస్తున్న బిల్లును బలపరచి ఆర్థిక భారం రాష్ట్రంపై వేయవద్దని టిడిపి ఎంపీ కోరడం విడ్డూరంగా వుంది. చట్టబద్ధంగా రాష్ట్రానికి రావలసిన నిధులే ఇవ్వని కేంద్రం ఈ విజ్ఞప్తులకు, విన్నపాలకు స్పందిస్తుందా అని అన్నారు. స్వదేశీ నినాదంతో అధికారంలోకి వచ్చిన బిజెపి ఏలుబడిలో బ్రిటిష్ కాలం నాటి 12 గంటల పని విధానాన్ని అమలులోకి తెచ్చింది. కార్మికుల జన్మహక్కుగా వున్న సమ్మె హక్కు ప్రమాదంలో పడింది. గతంలో జర్మనీ, ఇటలీ దేశాల్లో ఫాసిస్టు పాలకులు చేసిన మొదటి పని కార్మిక సంఘాలను నిషేధించడం, వారి చట్టబద్ధ హక్కులను కాలరాయడం. నేడు దేశంలో అదే తరహా విధానాలు అమలవుతున్నాయని సిపిఎం నేతలు మధు, గఫూర్‌లో వేర్వేరుగా అభిప్రాయపడ్డారు. 2005లో ప్రారంభించిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం గ్రామీణ వ్యవసాయ కూలీలకు పనిని హక్కుగా ఇచ్చింది.

ఆ హక్కును తొలగించి, రాష్ట్రాలపై నిధుల భారం వేస్తూ వికసిత్ భారత్-గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ (విబి-జి ఆర్‌ఎఎమ్ జి) బిల్లును ఆమోదించుకున్నారు. వారి మతతత్వ ఎజెండాకు అనుగుణంగానే పాత చట్టంలోని మహాత్మా గాంధీ పేరును తొలగించి 'రామ్' వచ్చేలా పేరు పెట్టారని మండిపడ్డారు. గత ఐదు సంవత్సరాలుగా ఉపాధి చట్టానికి కేంద్రం నిధులు తగ్గిస్తూ వచ్చింది.

ఈ చట్టంలో అవినీతి జరుగుతుందని, వ్యవసాయ సమస్యలకు కారణమని, ఉచిత పథకాలు ఎంత కాలమని బిజెపి నేతలు, వారి అనుంగ మీడియా చాలా కాలంగా చేస్తున్న ప్రచారానికి తగ్గట్టుగానే కొత్త బిల్లును తెచ్చారని మండిపడ్డారు.

12.16 కోట్ల మంది గ్రామీణ పేదలకు ఇచ్చే ఈ అతికొద్ది మొత్తమే అవినీతి, అక్రమం అయితే మోడీ 11 సంవత్సరాల పాలనలో కార్పొరేట్ కంపెనీలకు రూ.17.2 లక్షల కోట్ల రుణాలను రద్దు చేయడాన్ని ఏమనాలని నిలదీశారు. ఇదికాక బ్యాంకుల్లో తీసుకున్న మరో 10 లక్షల కోట్లు చెల్లించకుండా మొండి బకాయిలుగా మార్చి బ్యాంకులను దివాళా తీయించడాన్ని ఏమనాలన్నారు. ప్రభుత్వ రంగంలో బీమా కంపెనీలు ఉండడం వల్ల ప్రజల సొమ్ముకు, దేశ ఆర్థికవ్యవస్థకు భద్రత వుంటుందని 1956లో ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలను జాతీయం చేశారు. అదే సంవత్సరం సెప్టెంబర్ 1న లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్‌ఐసి) ప్రభుత్వ రంగంలో ఏర్పడింది. 98 శాతం క్లెయిమ్‌లను సకాలంలో అమలు చేసి ప్రపంచంలోనే ప్రతిష్టాత్మకమైన బీమా కంపెనీగా ఎల్‌ఐసి అభివృద్ధి చెందింది.

దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా వుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.54.52 లక్షల కోట్ల విలువైన ఆస్తులు కలిగిఉంది. ఈ రంగాన్ని కబ్జా చేయాలని చాలా కాలంగా దేశ, విదేశీ బీమా కంపెనీ లు ప్రయత్నిస్తున్నాయి. ఈ రంగంలో 50 శాతం లోపు మాత్రమే ప్రైవేట్ పెట్టుబడులు వుండాలనే నిబంధనను క్రమంగా సవరిస్తూ 74 శాతానికి పెంచారు. ఇప్పుడు ఏకంగా 100 శాతం విదేశీ పెట్టుబడులకు అనుమతిస్తూ మోడీ ప్రభుత్వం ఈ పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు పాస్ చేసుకుంది. ఈ నిర్ణయం పాలసీదారుల వ్యక్తిగత గోప్యతకు, దేశ ఆర్థిక భద్రతకు అత్యంత ప్రమాదం అని వారు అభిప్రాయపడ్డారు.

# 29 నుండి జనవరి 2వ తేదీ వరకు కపిలేశ్వరాలయంలో తెప్పోత్సవాలు



**తిరుపతి,డిసెంబరు19:** తిరుపతి శ్రీ కపిలేశ్వరస్వామివారి ఆలయంలో డిసెంబరు 29 నుండి జనవరి 2వ తేదీ వరకు తెప్పోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగనున్నాయి. ఐదు రోజులపాటు జరిగే తెప్పోత్సవాల లో మొదటిరోజైన డిసెంబరు 29వ తేదీన శ్రీ వినాయక స్వామివారు, శ్రీ చంద్రశేఖర్ స్వామివారు పుష్కరిణిలో 9 చుట్లు విహరిస్తారు. నవంబరు 30న శ్రీ వళ్ళి దేవసేన సమేత శ్రీ సుబ్రమణ్యస్వామివారు 9 చుట్లు, డిసెంబరు 31న శ్రీ సోమస్కందస్వామివారు 9 చుట్లు, జనవరి 1న శ్రీ కామాక్షి అమ్మవారు 9 చుట్లు, జనవరి 2న శ్రీ చండికేశ్వరస్వామివారు మరియు శ్రీ చంద్రశేఖర స్వామివారు తెప్పలపై 9 చుట్లు తిరిగి భక్తులకు దర్శనమిస్తారు. ప్రతిరోజూ సాయంత్రం 6 నుండి రాత్రి 8 గంటల వరకు ఊంజల సేవ, తెప్పోత్సవాలు నిర్వహిస్తారు.జనవరి 3వ తేదీన ఆరుద్ర దర్శన మహోత్సవం సందర్భంగా ఉదయం 6 నుండి రాత్రి 9 గంటల వరకు శ్రీ నటరాజస్వామివారు, శ్రీ శివగామి అమ్మవారు, శ్రీ మాణిక్యవాసగ స్వామివారి ఉత్సవ విగ్రహాలను పురవీధులలో ఊరేగించనున్నారు. తెప్పోత్సవాల సందర్భంగా టిటిడి అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ప్రతిరోజూ భక్తి సంకీర్తనలు ఆలపిస్తారు.

# ఉపాధి హామీ పథకం సవరణలకు నిరసన

- **రాష్ట్రవ్యాప్తంగా లెఫ్ట్ కార్మిక సంఘాల ఆందోళన**
- **ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడుతామన్న సిపిఎం**

**అమరావతి/విశాఖపట్టణం,డిసెంబర్19:** ఉపాధి హామీ పథకం సవరణలకు వ్యతిరేకంగా. వామపక్షాలు, కార్మిక, వ్యవసాయ, రైతు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్రంలో పలుచోట్ల నిరసనలు నిర్వహించారు. ఉపాధి హామీ పథకం సవరణలకు వ్యతిరేకంగా వామపక్షాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం సాగిస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ చట్టాన్ని తిరిగి పునరుద్ధరించే వరకు పోరాటం సాగుతుందని స్పష్టం చేశారు. శుక్రవారం విశాఖపట్నం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకొని దీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గాంధీజీ విగ్రహానికి సిపిఎం నాయకులు వి.శ్రీనివాసరావు, కె.లోకనాథం, సిహెచ్ నర్సింగరావు, ఎం.జగ్గు నాయుడు, తదితరులు కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ . మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి కేంద్రం చేస్తున్న సవరణలను రద్దు చేయాలన్నారు. చట్టబద్ద హక్కుగా ఉన్న ఈ పథకాన్ని రద్దు చేసేందుకు కేంద్రం చేస్తున్న కుట్రలను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. యుపిఎ ప్రభుత్వంపై వామపక్షాలు తీసుకువచ్చిన ఒత్తిడి ఫలితంగా రూపుదిద్దుకున్న మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ చట్టం మౌలిక స్వభావాన్ని కేంద్ర ప్రభుత్వం మారుస్తోందన్నారు. వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజీవిక మిషన్ (విబి-జి రాం జి) పేరుతో ఉపాధి హామీ పథకానికి 'రాంరాం' పలకనుందన్నారు. రాజ్యాంగంలో పేర్కొన్న విధంగా పని హక్కుగా ఉన్న పాతచట్టాన్ని మార్చి ఇదొక సాధారణ పథకంగా అమలు చేయనున్నారని తెలిపారు. సాధారణ పథకంగా దీనిని మారిస్తే, ఈ పథకం కొనసాగవచ్చు లేదా రద్దు చేయవచ్చు అన్నారు. ఇప్పటివరకు వ్యవసాయ కార్మికుల డిమాండ్ ను బట్టి ఉపాధి కల్పించే విధానాన్నిమార్చేసి అవసరాన్ని (సప్లయిని బట్టి పనులు పెట్టడం అంటే ఈ పథకం మౌలిక స్వభావాన్ని నిర్వీర్యం చేయడమేనని విమర్శించారు. కొత్త పథకంలో పనిదినాలు 100 నుండి 125 రోజులకు పెంచనున్నట్లు చెప్పడం ప్రజలను మభ్యపెట్టేందుకేనన్నారు. వ్యవసాయ పనులు రద్దీగా ఉండే సమయాల్లో 60 రోజుల ఉపాధిని నిలుపుదల చేయడం వల్ల అత్యంత అవసరమైన సమయాల్లో గ్రామీణ కార్మికులకు పని నిరాకరించబడుతోందని

# కొత్త కొత్త ఎత్తులతో సైబర్ మోసాలు




**న్యూ ఇయర్ గిఫ్ట్, క్రిస్మస్ గిఫ్ట్ లింక్‌లను క్లిక్ చేయవద్దు**

**అప్రమత్తంగా ఉండకుంటే అంతే సంగతులు**

**హెచ్చరించిన సైబర్ పోలీసులు**

**హైదరాబాద్,డిసెంబర్19:** క్రిస్మస్ గిఫ్ట్, న్యూఇయర్ గిఫ్ట్ అంటూ సైబర్ నేరగాళ్లు చేసే మోసాల బారిన పడవద్దని పోలీసులు హెచ్చరించారు. ఎప్పటికప్పుడు మారుతున్న సమాజంలోని పరిస్థితులకు అనుగుణంగా సైబర్ నేరగాళ్లు వారి నేర విధానాన్ని మార్చుకుంటూ ప్రజలను మోసం చేయడానికి కొత్త కొత్త మార్గాలను ఎంచుకుంటున్నారని ప్రజలను హెచ్చరించారు. పండుగ సీజన్ ప్రారంభమైన వెంటనే ఆన్‌లైన్ షాపింగ్ ప్లాట్ ఫారమ్‌లలో విపరీతమైన విక్రయాలు ప్రారంభమ వుతాయని కొంత మందికి క్రిస్మస్ గిఫ్ట్ అంటూ, న్యూఇయర్ గిఫ్ట్ అంటూ వాట్సాప్ లేదా ఇమెయిల్‌లో సందేశాలతో లింక్ లు వస్తుంటాయని, ఆ లింక్ లను క్లిక్ చేసి మోసపోవద్దని, చిన్నగా 500 డాలర్లు గిఫ్ట్ కార్డ్‌ను గెలుచుకోండి అని మెసేజ్‌లు వస్తుంటాయని, ఆ లింక్ లపై క్లిక్ చేసిన తర్వాత దానితో ఓ లింక్ కూడా ఉంటు ందని, దీనికి ఇచ్చే కాప్షన్ కూడా మిమ్ములను ఆ లింక్ క్లిక్ చేసే విధంగా పురిగొ ల్పుతుందన్నారు. కాబట్టి ఎలాంటి పరిస్థితిలలోను అపరిచితుల నుంచి వచ్చిన లింక్ లపై క్లిక్ చేయవద్దని, మీ వ్యక్తిగత సమాచారం పాన్‌కార్డు నంబర్, పాన్‌కార్డ్ ఫోటోలు అపరిచిత లింక్ లలో పంచుకోవద్దు అని సూచించారు. ఒకవేళ ఆ లింక్ లో వివరాలు ఇస్తే మీ వ్యక్తిగత వివరాలు మీ ఫోన్ నంబర్ ఆధారంగా మీ బ్యాంక్ ఎకౌంట్ నుంచి డబ్బులు ఖాళీ అవుతాయని హెచ్చరించారు. ఆన్‌లైన్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఒకవేళ ఏదైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే సంబంధిత మీ దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్ కి వెళ్ళి ఫిర్యాదు చేయాలని, లేదా సైబర్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కు, మీ దగ్గర లోని పోలీసు స్టేషన్ నంబర్ కు గాని కాల్ చేయాలని, లేదా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ లో ఫిర్యాదు చేయాలని తెలిపారు.

## సోండేపూర్ ఉప సర్పంచ్ గా పాండు నాయక్



**డిసెంబర్ 20 వికారాబాద్ :** ఇటీవలే నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసినప్పటికీ కొన్ని గ్రామాలలో ఉపస సర్పంచ్ లను ఎన్ను కోవడం కొంచెం ఆలస్యమైంది. దీనిలో భాగంగానే వికారాబాద్ జిల్లా పరిగి మండలం సోండేపూర్, గ్రామపం చాయ తీలో శు క్రవారం గ్రామ ప్రజలు సర్పంచ్ వార్డు మెంబర్ల ఆధ్వర్యంలో ఉప సర్పంచ్ గా పి.పాండు నాయక్, ను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా పాండు నాయక్ మాట్లాడుతూ.. గ్రామ ప్రజలందరూ నా తోటి వార్డు మెంబర్లు సర్పంచ్ కలిసి అప్పజెప్పిన ఈ బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తూ గ్రామ ప్రజల అందరి సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించినందుకు తండా వాసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ వార్డు మెంబర్లను సన్మానించిన కడుమూరు ఆనందం రామచంద్ర యాదవ్



**డిసెంబర్ 20 వికారాబాద్ :** నూతనంగా గెలుపొందిన సర్పంచ్ వార్డు మెంబర్లను ఘనంగా సన్మానించిన హైకోర్టు న్యాయవాది కడుమూరు ఆనందం, బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్, శుక్రవారం వికారాబాద్ జిల్లా పూడూరు మండలం మిట్ట కంకల్ గ్రామంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన సర్పంచ్ రావుల గోపాల్, ఉపసర్పంచ్ మురళి బంధయ్య, వార్డు మెంబర్లు, బేరి సత్యనారాయణ, రావుల సుమత, చాకలి లక్ష్మయ్య, మొర్రి . శ్రీనివాస్, రావుల రాములమ్మ, రావుల మనీష్ కుమార్, మొర్రి. అండాలు, లను ఘనంగా సన్మానించి వారికి శు భాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కడు మూరు ఆనందం, బేరి రామచంద్ర యాదవ్, లు మాట్లా డుతూ... గ్రామ ప్రజలు మీకు ఓటు వేసి ఆశీర్వదించి గ్రామ సర్పంచ్ గా ఓ బాధ్యతను అప్పజెప్పారు మీరు ఈ బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తూ... గ్రామంలో ఉన్నటువంటి ప్రధాన సమస్యలను పరిష్కరిస్తూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామంలో ఎలాంటి సమస్యలు తలె త్తకుండా చర్యలు చేపట్టాలని వారికి సూచించారు. గ్రామ అభివృద్ధి కొరకు పార్టీలకు అతీతంగా గ్రామ ప్రజలను అందరిని కలుపుకొని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని వారికి సూచించారు ఈ కార్య్ర కమంలో మాజీ సర్పంచ్, ముర్రి శ్యాం కుమార్ మాజీ డి.ఎస్.పి బంటు రాములు వెంకట్ రెడ్డి, జక్రియ భాయ్ గ్రామ పెద్దలు యువజన సంఘాలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## చర్మంపై ఆయా భాగాల్లో దురద ఉందా.. అయితే ఈ చిట్కాలను పాటించండి



మన శరీరంలోని అతి పెద్ద అవయవాలల్లో చర్మం ఒకటి. అంతర్గత అవయవాలతో పాటు బాహ్య శరీరాన్ని కాపాడడంలో చర్మం ముఖ్యపాత్ర పోషిస్తుంది. శరీరంలోని ఇతర అవయవాల గురించి ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటామో అలాగే చర్మ ఆరోగ్యం గురించి కూడా అంతే జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవ సరం. కానీ మనలో చాలా మంది దురద సమస్యతో బాధపడుతుంటారు. చంకలు, పిరు దులు, తొడల వంటి శరీర భాగాల్లో ఈ సమస్య మరీ ఎక్కువగా ఉంటుంది. దురద వల్ల కలిగే బాధ అంతా కాదు. వ్యాయామం ఎక్కువగా చేయడం, బిగుతైన దుస్తులను ధరించడం, తడిగా ఉన్న దుస్తులను ధరించడం, అధికబ రువు వంటి కారణాల వల్ల దురద ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది. దురద కారణంగా చర్మం పొడిబారడంతోపాటు చర్మ సౌందర్యం కూడా తగ్గుతుంది. చర్మంపై వచ్చే దురదను మనం కొన్ని ఇంటి చిట్కాలను ఉపయోగించి సహజ సిద్దంగా తగ్గించుకోవచ్చు.ఒక గిన్నెలో 3 టేబుల్ స్పూన్ల వంటసోడాను తీసుకుని అందులో కొద్దిగా నీటిని వేసి మెత్తని పేస్ట్ లాగా చేసుకోవాలి. ఈ పేస్ట్ ను దురద ఉన్న చోట రాసి సున్నితంగా మర్దనా చేయాలి. ఇలా చేయడం వల్ల దురద తగ్గుతుంది. వంటసోడాలో ఉండే ఆల్కలీన్ లక్షణాలు దురదను తగ్గించడంలో సహాయపడతాయి. అలాగే కలబంద ఆకుల నుండి గుజ్జును తీసి జెల్ లాగా చేసుకోవాలి. దీనిని దురద ఉన్న చోట రాయడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. కలబంద గుజ్జు అందుబాటులో లేనివారు మార్కెట్ లో లభించే కలబంద జెల్ ను కూడా ఉపయోగించుకోవచ్చు. అదేవిధంగా మార్కెట్ లో మనకు అనేక రకాల పెట్రోలియం జెల్లీలు అందుబాటులో ఉన్నాయి. దురదను తగ్గించడంలో ఇవి కూడా మనకు సహాయ పడతాయి. స్నానం చేసిన తరువాత దురద ఉన్న చోట పెట్రోలియం జెల్లీని రాసుకోవాలి. ఇలా చేయడం వల్ల కూడా దురద తగ్గుతుంది. నెయ్యి, కొబ్బరినూనె.. దురదను తగ్గించడంలో నెయ్యి కూడా ప్రభావవంతంగా పని చేస్తుంది. దురద ఉన్న చోట చర్మంపై రోజుకు రెండు సార్లు నెయ్యిని రాయాలి. ఇలా చేయడం వల్ల దురదతో పాటు మంట, ఎరుపుదనం కూడా తగ్గుతాయి. అలాగే దురదను తగ్గించడంలో కొబ్బరి నూనె ప్రభావవంతంగా పని చేస్తుంది. కొబ్బరి నూనెను రాయడం వల్ల దురద తగ్గడంతోపాటు చర్మం సున్నితంగా తయారవుతుంది.కలేండాలా క్రీమ్..ఈ క్రీమ్ ను బంతిపువ్వుల నుండి తయారు చేస్తారు. దీనిలో యాంటీ ఇన్ ఫ్లామేటరీ, యాంటీ మైక్రోబయల్ లక్షణాలు అధికంగా ఉంటాయి. దురద ఉన్న చోట చర్మంపై ఈ క్రీమ్ ను రాసుకోవడం వల్ల దురద నుండి చక్కని ఉపశమనం కలుగుతుంది.

# గ్రామ పంచాయతీ ఎన్నికలలో విజయం సాధించిన సర్పంచ్ భర్తపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి



**డిసెంబర్ 20 వికారాబాద్ :** ఇటీవలే జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికలలో విజయం సాధించిన సర్పంచ్ భర్తపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసిన ఘటన వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి, మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కోట్‌పల్లి గ్రామ నూతన సర్పంచ్ బసమ్మ భర్త సంగయ్య స్వామిపై గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు మాస్కులు వేసుకొని దాడి చేసినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. సర్పంచ్ బసమ్మ, ఆమె భర్త సంగయ్య స్వామి ఇద్దరు అత్యంత వెనుకబడిన జంగమ కులానికి చెందినవారు. అలాంటివారు కోట్‌పల్లి గ్రామ సర్పంచ్ కావడం జీర్ణించుకోలేని కొందరు కక్షపూరితంగానే ఆయనపై దాడి చేశారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ దాడిపై కేసు నమోదు చేసుకున్న కోటిపల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

**- దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి - శుభప్రద్ పటేల్**

ఈ ఘటనకు సంబంధించి బీసీ కమిషన్ మాజీ సభ్యులు శుభప్రద్ పటేల్ మాట్లాడుతూ..బీసీ కులానికి చెందిన సర్పంచ్ భర్తపై దాడి చేయడం హేయమైనా చర్య అన్నారు. సర్పంచ్‌గా ప్రమాణ స్వీకారం చేయకముందే ఇలాంటి దాడులకు పాల్పడడం సిగ్గుచేటు అన్నారు. దాడి చేసిన వారిని వెంటనే గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**- బాధితుడిని పరామర్శించిన - పట్నం మహేందర్ రెడ్డి**

ఇటీవలే గుర్తు తెలియని నిందితుల దాడికి గురై హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జంగం సంగయ్య స్వామి,ని ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి శుక్రవారం పరామర్శించారు. దాడి చేసిన వారిని పట్టుకొని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా కృషి చేస్తా అన్నారు. ఈ సందర్భంగా ఆ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు.


**- నిందితులను కఠినంగా శిక్షించాలి. ప్రజా సంఘాలు**

నిరుపేద కుటుంబానికి చెందిన సర్పంచ్ భర్త జంగం సంగయ్య, ను గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని నిందితులు కక్షపూరితంగా విచక్షణ విధంగా దాడి చేయడం జరిగింది.



దాడికి నిరసనగా గ్రామ ప్రజలతోపాటు ప్రజాసంఘాలు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు నిందితులను వెంటనే పట్టుకొని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.

## రోజూ ఉదయం పూట 10 నిమిషాల పాటు యోగా చేస్తే కలిగే అద్భుతమైన లాభాలు ఇవే




శరీర ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవడానికి, ఒత్తిడి, ఆందోళన వంటి మానసిక సమస్యలను తగ్గించుకోవడానికి మనం అనేక రకాల వ్యాయామాలు చేస్తూ ఉంటాము. ఇలాంటి వ్యాయామాలల్లో యోగా కూడా ఒకటి. యోగాను ఎవరైనా కూడా చాలా సులభంగా చేయవచ్చు. చిన్న వయసు నుండే పిల్లలకు యోగా చేయడం నేర్పించడం వల్ల వారి ఆరోగ్యంతో పాటు ఏకాగ్రత కూడా పెరుగుతుంది. రోజూ యోగా చేయడం వల్ల మనకు ఎంతో మేలు కలుగుతుంది. ఈ విషయాలను యోగా నిపుణులు తెలియ జేస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం 10 నిమిషాల పాటు యోగా చేయడం వల్ల మనకు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి.రీసెట్ బటన్‌లాగా..ఉదయం చేసే ఈ యోగా మనకు ఒక రీసెట్ బటన్ లాగా పనిచేస్తుంది. రోజంతా మనస్సును ప్రశాంతంగా ఉంచుతుంది. పది నిమిషాల పాటు యోగా, శ్వాస వ్యాయామాలు చేయడం వల్ల శరీరం స్థిరంగా ఉంటుంది. మనసు తేలికగా ఉంటుంది. సరళమైన శ్వాస వ్యాయా మాలు చేయడం వల్ల ఊపిరితిత్తుల ఆరోగ్యం మెరుగుపడుతుంది. శరీరంలో ఆక్సిజన్ స్థాయిలు మెరుగుపడతాయి. దీంతో శరీర శక్తి స్థాయిలు పెరుగుతాయి. అలాగే రాత్రంతా నిద్రపోవడం వల్ల కండరాలు బిగుతుగా తయారవుతాయి. శరీరం నొప్పు లుగా అనిపిస్తుంది. అలాంటి వారు ప్రతిరోజూ యోగా చేయడం వల్ల శరీర నొప్పులు తగ్గుతాయి. రోజూ యోగా చేయడం, సులభమైన ఆసనాలు వేయడం వల్ల మానసికంగా ఉత్సాహంగా తయారవుతారు. సులభంగా నిర్ణయాలు తీసుకోగలుగుతారు. మెదడు పదునుగా తయారవుతుంది.ఒత్తిడి హార్మోన్లు..అంతేకాకుండా ఉదయం పూట ఒత్తిడి హార్మోన్ అయిన కార్టిసాల్ శరీరంలో ఎక్కువగా ఉంటుంది. రోజూ ఉదయం యోగా చేయడం వల్ల ఈ హార్మోన్ స్థాయిలు అదుపులో ఉంటాయి. శరీరం, మనసు ప్రశాంతంగా ఉంటాయి. రోజూ యోగా చేయడం, శరీరాన్ని వంచడం వంటి కొన్ని ఆసనాలు వేయడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. రోజంతా అసౌకర్యం లేకుండా ఉంటుంది.వెన్నెముక ఆరోగ్యానికి..ఉదయం పూట యోగా చేయడం వల్ల వెన్నెముక ఆరోగ్యం మెరుగుపడుతుంది. కూర్చోవడం, నడవడం వంటివి మరింత సహజంగా అనిపిస్తాయి. అలాగే ప్లాంట్ లేదా బోట్ వంటి భంగిమలు చేయడం వల్ల నడుము కింద భాగం

ఆరోగ్యం మెరుగుపడుతుంది. రోజూ యోగా చేయడం వల్ల భాగోద్వేగాలు అదుపులో ఉంటాయి. 10 నిమిషాల పాటు యోగా చేయడం వల్ల త్వరగా స్పందించే గుణం తగ్గుతుంది. దీంతో కోపం, ఆందోళన వంటివి తగ్గి ప్రశాంతంగా

ఆలోచించే గుణం పెరుగుతుంది. ఈ విధంగా యోగా మన శరీర ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యానికి కూడా ఎంతో

మేలు చేస్తుందని యోగా నిపుణులు చెబుతున్నారు.

# రోజూ కాఫీని తాగడం వల్ల కలిగే ఈ అద్భుతమైన లాభాల గురించి మీకు తెలుసా



మనలో చాలా మంది తమ రోజును ఒక కప్పు కాఫీతో ప్రారంభిస్తూ ఉంటారు. ఉదయం కాఫీ తాగనిదే వారికి రోజు గడిచినట్టుగా కూడా ఉండదు. అలాగే ఏకాగ్రత పెరగడానికి, పని మధ్యలో కొంత విశ్రాంతి లభించడానికి కూడా కాఫీని తాగుతూ ఉంటారు. కాఫీ తాగడం వల్ల శరీరానికి ఉత్తేజం రావడంతో పాటు మనం అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలను కూడా పొందవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. కాఫీ తాగడం వల్ల మనకు కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. కాఫీ తాగడం వల్ల శరీర రోగనిరోధక శక్తి మెరుగుపడుతుంది. కాఫీలో యాంటీ ఆక్సిడెంట్లు, పాలీఫినాల్స్ అధికంగా ఉంటాయి. ఇవి వ్యాధుల బారినుండి శరీరాన్ని కాపాడడంలో సహాయపడతాయి.

తలనొప్పి తగ్గేందుకు..కాఫీలో కెఫిన్ అధికంగా ఉంటుంది. ఇది శరీరాన్ని, మనసును ఉత్తేజపరచడంలో దోహదపడుతుంది. కాఫీ తాగడం వల్ల ఏకాగ్రతతో పాటు జ్ఞాపకశక్తి కూడా పెరుగుతుంది. ఇక కండరాలు బిగుసుకుపోకుండా చేయడంలో కూడా కాఫీ మనకు సహాయపడుతుంది. కాఫీ తీసుకోవడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. తలనొప్పి కూడా తగ్గుతుంది. అదే విధంగా వ్యాయామాలు ఎక్కువగా చేసేవారు, ఆటలు ఎక్కువగా ఆడేవారు కాఫీ తాగడం వల్ల మంచి ఫలితాలను పొందుతారు. కాఫీ తీసుకోవడం వల్ల శరీరం చురుకుగా ఉంటుంది. అలసట తగ్గుతుంది. చేసే పనిపై దృష్టిని కేంద్రీకరించడంలో సహాయపడుతుంది. బరువు తగ్గాలనుకునే వారు బ్లాక్ కాఫీని తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.కొవ్వు కరిగేందుకు..బ్లాక్ కాఫీ తీసుకోవడం వల్ల శరీరంలో అధికంగా పేరుకుపోయిన కొవ్వు వేగంగా కరుగుతుంది. అంతేకాకుండా కాఫీని తీసుకోవడం వల్ల క్యాన్సర్, గుండెపోటు, స్ట్రోక్ వంటి ప్రమాదకరమైన వ్యాధుల బారిన పడే అవకాశాలు తక్కువగా ఉంటాయని సైంటిస్టులు చెబుతున్నారు. కాఫీని తీసుకోవడం వల్ల అల్జీమర్స్, పార్కిన్సన్స్ వంటి నాడీ సంబంధిత వ్యాధుల బారిన పడే అవకాశాలు భవిష్యత్తులో తక్కువగా ఉంటాయి. అంతేకాకుండా కాఫీ తీసుకోవడం వల్ల టైప్ 2 డయాబెటిస్ వచ్చే అవకాశాలు 25 శాతం తక్కువగా ఉంటాయని పరిశోధకులు తెలియజేస్తున్నారు.

గుండె ఆరోగ్యానికి..ఇక కాఫీ తాగడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. గుండె సంబంధిత వ్యాధుల బారిన పడే అవకాశాలు తక్కువగా ఉంటాయి. అలాగే కాఫీ తాగడం వల్ల మనసుకు ఉల్లాసంగా ఉంటుంది. మనసు తేలికపడి ఆనందం కలుగుతుంది. మానసిక ప్రశాంతత కలుగుతుంది. ఈ విధంగా కాఫీ తాగడం వల్ల మనకు అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని వైద్యులు సూచిస్తున్నారు. కాఫీ మన ఆరోగ్యానికి మేలు చేసేదే అయినప్పటికి దీనిని తక్కువ పరిమాణంలో తీసుకున్నప్పుడే మనకు ఆ ప్రయోజనాలు కలుగుతాయని అంటున్నారు. మితిమీరిన పరిమాణంలో కాఫీని తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి బదులుగా అనారోగ్యానికి గురికావాల్సి వస్తుందని వారు హెచ్చరిస్తున్నారు.


# జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృషా?రావు ను కలిసిన ఆదిలాబాద్ డిసిసి డా నరేష్ జాదవ్



**ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి** అదిలాబాద్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి క ృషా?రావు ని హైదరాబాదులోని వారి క్యాంపు కార్యాలయంలో ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షులు శ్రీ డా. నరేష్ జాదవ్ కలవడంజరిగింది. ఈ సందఠరేగా ఆయన ఆదిలాబాద్ జిల్లాలో ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల గురించి చర్చించి ఆదిలాబాద్ జిల్లా లో పలు అభివ ృద్ధి కార్యక్రమాల విషయంగురించి, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల గురించి చర్చించారు. వారి తో పాటు ఖానాపూర్ ఎమ్మెల్యే నిర్మల్ డిసిసి అధ్యక్షులు వెడ్మ బొజ్జు పటేల్ , మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి , నిర్మల్ మాజీ డిసిసి శ్రీహరిరావు , ఆసిఫాబాద్ అసెంబ్లీ ఇన్చార్జ్ శ్యాం నాయక్ , లోక భూమారెడ్డి పాల్గొన్నారు.

# బిజెపి బలపరిచిన నూతనంగా ఎన్నికైన సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డ్ మెంబర్ల కు ఘన సన్మానం









**ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి**నిర్మల్ పట్టణంలోని జిల్లాలోని ఆయా గ్రామాల్లో గ్రామపంచాయతీ ఎన్నికలో భారతీయ జనతా పార్టీ బలపరిచిన నూతనంగా ఎన్నికైన సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు, వార్డ్ మెంబర్ల కు ఆత్మీయ సన్మాన సభ నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావ్ , ఎమ్మెల్యే రామారావు పటేల్ బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి , బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మరియు రాష్ట్ర నాయకులు ముఖ్య అతిథులు పాల్గొని నూతంగా ఎన్నికయిన సర్పంచ్ లను, ఉప సర్పంచ్లను,వార్డ్ మెంబర్లను అభినందించి,శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# చలికాలంలో షుగర్ ఉన్నవారు తప్పక తినాల్సిన నాలుగు కూరగాయలు, మెడిసిన్‌లా పనిచేస్తాయని చెప్పిన డాక్టర్





డయాబెటిస్ కేసులు రోజు రోజుకి పెరిగిపోతున్నాయి. మన దేశంలోనే కాదు.. ప్రపంచ వ్యాప్తంగా డయాబెటిస్ కేసులు ఎక్కువైపోతున్నాయి. డయాబెటిస్ ఉన్నవారు తినే తిండి విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఏది పడితే అది తినకూడదు. డయాబెటిస్ ఉన్నవారు ఈ సీజన్‌లో కొన్ని కూరగాయల్ని తప్పక తినాలని డాక్టర్ ప్రమోద్ త్రిపాఠి సలహా ఇచ్చారు.ఈ రోజుల్లో జీవనశైలి వ్యాధులు ఎక్కువైపోయాయి. కొలెస్ట్రాల్, ఊబకాయం, ఫ్యాటీ లివర్, డయాబెటిస్ వంటి వ్యాధులతో చాలా మంది బాధపడుతున్నారు. వాటిలో డయాబెటిస్ ఒకటి. ఈ వ్యాధి లైఫ్‌స్టైల్‌కి సంబంధించింది. దీనికి సరైన చికిత్స లేదు. కేవలం జీవనశైలిలో మార్పులు, సరైన ఆహారం, మందులు తీసుకుంటేనే కంట్రోల్‌లో ఉంటుంది.ఈ వ్యాధి లైఫ్‌స్టైల్‌కి సంబంధించింది. అందుకే మందులు మాత్రమే సరిపోవు. షుగర్ ఉన్నవారికి ఆహారం కీలక పాత్ర పోషిస్తుంది. అందుకే తిన ఆహారంపై ఫోకస్ పెట్టాలి. శీతాకాలంలో షుగర్ ఉన్నవారికి మేలు చేసే కూరగాయలు అందుబాటులో ఉంటాయి. ఈ కూరగాయలు తింటే రక్తంలో షుగర్ లెవల్స్ కంట్రోల్ ఉంటాయి.అలాంటి కూరగాయలు గురించి.. డాక్టర్ ప్రమోద్ త్రిపాఠి.. తన ఫ్రీడమ్ ఫ్రమ్ డయోబెటిస్ ఇన్‌స్టాగ్రామ్ పేజీలో పంచుకున్నారు. ఈ కూరగాయలు డయాబెటిస్‌కి ఔషధంగా పనిచేస్తాయని ఆయన అంటున్నారు. చాలా మందికి వాటి ప్రయోజనాలు గురించి తెలియవు. ఆ పూర్తి వివరాలపై ఇప్పుడు ఓ లుక్కేద్దాం.ఎర్ర ముల్లంగి.. గుండ్రటి ఆకారంలో ఉంటుంది. ఇందులో ఎన్నో పోషకాలు ఉన్నాయి. ఎర్ర ముల్లంగిలో ఫైబర్, పొటాషియం, విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు నిండుగా ఉన్నాయి. అందుకే ఇది డయాబెటిస్ పేషంట్లకు ఒక సూపర్ ఫుడ్. ఈ కూరగాయలో ఉండే ఫైబర్, గ్లైకోసినోలేట్లు షుగర్ ఉన్నవారికి ఎంతో మేలు చేస్తాయి.ఇవి శరీరంలో ఆల్ఫా – గ్లూకోసిడేస్ ఇన్హిబిట్లరుగా పనిచేస్తాయి. ఇది పేగుల్లో గ్లూకోజ్ శోషణను తగ్గిస్తుంది. తిన్న తర్వాత సడన్‌గా పెరిగే రక్తంలోని షుగర్ లెవల్స్‌ని నివారిస్తుంది. ఈ కూరగాయను సలాడ్ రూపంలో తీసుకోవచ్చు. ఉల్లిపాయలు, ఎర్ర ముల్లంగిని కలిపి సలాడ్‌గా తీసుకోవచ్చు. మీరు ఆహారంలో ఎర్ర ముల్లంగి సూప్‌ని కూడా చేర్చుకోవచ్చు. చలికాలంలో చిలగడదుంపలు ఎక్కువగా దొరుకుతాయి. చిలగడదుంపలు తినడం కూడా షుగర్ ఉన్నవారికి మేలు చేస్తుందని డాక్టర్ అంటున్నారు. చిలగడదుంపల్లో రెసిస్టెంట్ స్టార్చ్, బీటా కెరోటిన్ ఉంటాయి. ఇవి GLP-1 హార్మోన్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తాయి. ఓజెంపిక్, మౌంజారో వంటి మందులు కూడా అదే పనిచేస్తాయని డాక్టర్ ప్రమోద్ త్రిపాఠి అంటున్నారు. GLP-1 హార్మోన్ ఉత్పత్తిని పెంచడం వల్ల ఆకలిని నియంత్రిస్తుంది.అతిగా తినకుండా నిరోధించడానికి, రక్తంలో షుగర్ లెవల్స్ నిర్వహించడానికి సాయపడుతుంది. చిలగడదుంపల్ని ఆవిరి మీద ఉడికించి. మసాలా దినుసులతో కలిపి తినాలని సిఫార్చ్చేస్తున్నారు. వాటిని చల్లబరిచి మళ్లీ ఉడికించడం వల్ల నిరోధక స్టార్చ్ మరింత పెరుగుతుందని.. ఇది డయాబెటిక్ పేషంట్లకు చాలా మేలు చేస్తుందని డాక్టర్ అంటున్నారు. అయితే, ఒక చిలగడదుంప అయితే బెస్ట్ అంటున్నారు.

# మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలి

## కేంద్ర ప్రభుత్వనికి వ్యతిరేకంగా నినాదాలు


**ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి**నిర్మల్ జిల్లా 6 ఖానాపూర్ మండలంలో ఉపాధి హామీ పథకానికి ఉన్న మహాత్మా గాంధీ పేరును తొలగించడం బిజెపి సర్కార్ గాడ్సే చర్యలు. మూడోసారి అధికారంలోకి రావడంతో జాతిపిత మహాత్మా గాంధీ పేరును తొలగించింది. క్రమక్రమంగా ఉపాధి హామీ పథకాన్ని తొలగించే దానిలో భాగమే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పేరు తొలగించి వి బి జి రాంజీగా మార్చడం.ఈరోజు ఖానాపూర్ లోని మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న మహాత్మా గాంధీ విగ్రహం ముందు భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి నిరసన తెలపడం జరిగింది . ఉపాధిహామీ పథకంలో పథకంలో 90 శాతం నిధులు కేంద్ర ప్రభుత్వం 10% నిధులు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సి ఉండగా బిజెపి సర్కార్ తీసుకొచ్చిన కొత్త పథకం 40% రాష్ట్రప్రభుత్వం 60 శాతం కేంద్ర ప్రభుత్వం భరించాలని చెప్పడం ఉపాధి హామీ పనిని ఎత్తివేయడమే అవుతుంది. కేంద్ర బిజెపి సర్కార్ ప్రజా వ్యతిరేక విధానాలు మాని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు నిర్మల్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్ జిల్లా కమిటీ సభ్యులు నాగేల్లి నర్సయ్య వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి ,ఉపాధ్యక్షులు సుంచుల నారాయణ శ్రీనివాస్‌లి ,సిపిఎం నాయకులు లిబుఖ్య విలాస్ ,సిపిఎం సీనియర్ నాయకులు దుర్గం పోశలింగం పాల్గొన్నారు



# ముందస్తు అప్రమత్తత ద్వారా విపత్తుల సమయంలో ప్రాణ నష్ట నివారణ:

## డిసెంబర్ 22 వ తేదీన విపత్తు నిర్వహణ మాక్ ఎక్సర్సైజ్ విజయవంతంగా నిర్వహించాలి: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృషా? రావు.

**ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి** నిర్మల్ జిల్లా ముందస్తు అప్రమత్తత ద్వారా విపత్తుల సమయంలో ప్రాణ నష్టాలను నివారించవచ్చునని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామక ృషా?రావు అన్నారు.శుక్రవారం, ప్రక ృతి విపత్తుల నిర్వహణకు సంబంధించి మాక్ ఎక్సర్సైజ్ కార్యక్రమ నిర్వహణ, వైపరీత్యాల నివారణ నిర్వహణ చర్యలపై సిఎస్ రామక ృష? రావు, జాతీయ విపత్తుల నిర్వహణ ప్రాధికార సంస్థ (నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటి) అధికారులతో కలిసి, రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కానారేన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందఠరేగా సిఎస్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఈ నెల 22 న విపత్తుల నిర్వహణ మాక్ ఎక్సర్సైజ్ విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్‌లను ఆదేశించారు.ముందస్తు అప్రమత్తత ద్వారా విపత్కర సమయాల్లో ప్రాణ నష్టాలు నిర్వహించడంతో పాటు, ఆస్తి నష్టాలు తగ్గించగలుతామని చెప్పారు. పరిస్థితులను అంచనా వేయగలిగితే నష్టాలను తగ్గించగలుగుతామని వివరించారు. వైపరీత్యాల సమయంలో సమాచార మార్పిడి అత్యంత కీలకమని అన్నారు. ఇందుకోసం అవసరమైన అన్ని సాధనాలు వినియోగించుకోవాలని స్పష్టం చేశారు. వైపరీత్యాల సమయంలో ప్రాణాలు కాపాడటమే లక్ష్యంగా పని చేయాలని పేర్కొన్నారు. దాదాపు 35 శాఖలు సమన్వయంతో మెలగాలని తెలిపారు. వర్షపాతం, ప్రాజెక్టుల నీటిమట్టం, నీరు విడుదల, వంతెనలు, రోడ్ల స్థితి వంటి అంశాల రియల్ టైమ్ సమాచారం ప్రజలకు చేరవేయాలని చెప్పారు. అత్యవసర సమయాల్లో ప్రజలకు అవసరమగు అన్ని సేవల టోల్ ఫ్రీ నంబర్ల సమాచారం ప్రజలందరికీ తెలిసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పారిశుధ్య నిర్వహణ, వైద్య సేవలు అనేవి వైపరీత్యాల సమయంలో అత్యంత కీలకమని అన్నారు. రాష్ట్రంలోని ఎస్డిఆర్ఎఫ్ బ ృందాలకు ఎన్డిఆర్ఎఫ్ బ ృందాలు సహకారం అందిస్తాయని తెలిపారు. అవసరమైతే అత్యవసర సమయాల్లో హెలికాప్టర్ సేవలు వినియోగించుకోవచ్చు అని అన్నారు. పరిశ్రమల్లో ప్రమాదాలు సంభవించకుండా తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు.అనంతరం జాతీయ విపత్తుల నిర్వహణ ప్రాధికార సంస్థ అధికారులు విపత్తు నివారణ చర్యలపై పలు









అంశాలను కూలంకషంగా చర్చించారు.ఈ వీడియో కానారేన్స్ లో భాగంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, జిల్లాల్లో విపత్తుల నిర్వహణకు అధికార యంత్రాంగం ఎల్లప్పుడూ అన్ని విధాలుగా సిద్ధంగా ఉందని అన్నారు. ఈ నెల 22 న విపత్తు నిర్వహణపై మాక్ ఎక్సర్సైజ్ విజయవంతంగా నిర్వహిస్తామని అన్నారు. ప్రజలకు విపత్తుల సమయంలో రక్షణ పొందేలా అవగాహన కార్యక్రమాలు కల్పించామని చెప్పారు. గత వర్షాకాలం జిల్లాలో ఎన్నడూ లేని విధంగా భారీ వర్షాలు కురిసి, వరదలు సంభవించాయని తెలిపారు. ముందస్తు అప్రమత్తత, స్పష్టమైనప్రణాళికలు,విపత్తుల అంచనా,ఎన్డిఆర్ఎఫ్, ఎస్డిఆర్ఎఫ్ బృందాల సమన్వయ చర్యలు, అధికార యంత్రాంగం, ప్రజల సహకారంతో ఎటువంటి నష్టాలు లేకుండా వరదలను ఎదుర్కొన్నామని వివరించారు. మున్ముందు కూడా ఎటువంటి నష్టాలు కలుగకుండా సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఇటీవలి ప్రతి మండలానికి ఒకటి చొప్పున అత్యవసర సమయాల్లో ఉపయోగపడే వస్తువులతో కూడిన కిట్ ను అందించామని చెప్పారు. మరింత విస్త ృతంగా ప్రజలకు విపత్తుల సమయంలో రక్షణపై అవగాహన కల్పిస్తామని తెలిపారు.ఈ వీడియో కానారేన్స్ లో అదనపు కలెక్టర్ లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అయోధ్య పురం నిరుద్యోగుల పోరాటానికి దళిత హక్కుల పోరాట సమితి సంపూర మద్దతు

**హనుమకొండ, డిసెంబర్ 19:**కాజీపేట మండలం అయోధ్య పురం గ్రామం ప్రజలు, రైతులు నిరుద్యోగులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి దళిత హక్కుల పోరాట సమితి వరంగల్ జిల్లా, హన్మకొండ జిల్లాలు సంపూర? మద్దతు తెలుపుతున్నట్లు దళిత హక్కుల పోరాట సమితి వరంగల్ జిల్లా, హన్మకొండ జిల్లాల ప్రధాన కార్యదర్శులు సంఘీ ఎలేందర్, రోంటాల దేవా తెలియజేశారు త ఈ సందఠరేగా వారు మాట్లాడుతూ కాజీపేట మండలం అయోధ్య పురం గ్రామంలో శ్రీ మెట్టు రామలింగేశ్వర స్వామి భూములకు శిస్తు కడుతూ దున్నుకొని సాగు చేసుకుని జీవనం సాగిస్తున్న అయోధ్య పురం గ్రామా రైతులకు, రైతు కూలీలకు నిరుద్యోగులకు, యువకులకు వెంటనే ఉద్యోగ ఉపాది అవకాశాలు కల్పిస్తూ తక్షణమే రైల్వే ఉన్నతాధికారులు ప్రజాప్రతినిధులు స్పష్టమైన ప్రకటన చేయాలని దళిత హక్కుల పోరాట సమితి డిమాండ్ చేశారు.అయోధ్య పురం గ్రామంలో శ్రీ మెట్టు రామలింగేశ్వర స్వామి భూములను ఆ గ్రామ ప్రజలు గత కొన్ని సంవత్సరాలుగా ఆ భూములకు శిస్తు కడుతూ దున్నుకొని సాగు చేసుకుంటున్నా భూములను కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం కొరకు 160 ఎకరాల భూములను రైల్వే ఉన్నత అధికారులు ప్రజాప్రతినిధులు తీసుకొన్నారు. ఈ సందఠరేగా ఆ గ్రామ ప్రజలకు, నిరుద్యోగులకు, యువకులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చి భూములను తీసుకున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైల్వే ఉన్నతాధికారులు వెంటనే గ్రామ ప్రజలకు నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాది కల్పిస్తామని స్పష్టమైన ప్రకటన చేయాలని





డిమాండ్ చేశారు. రైల్వే జేఏసీ ఆధ్వర్యంలో జరుగుతున్న న్యాయపోరాటానికి మద్దతుగా ఈనెల 21న అయోధ్య పురం గ్రామంలో జరిగే రౌండ్ సమావేశాన్ని జయప్రదం చేయడానికి అన్ని దళిత ప్రజా ఉద్యమాలు రాజకీయ పార్టీలు కమ్యూనిస్టు పార్టీలు భాగస్వాములై గ్రామ ప్రజలకు అండగా ఉద్యమాన్ని ఉధ ృతం చేయాలని పిలుపునిచ్చారు.

# వైస్ కెప్టెన్ గిల్ ఎంపికపై ఉత్కంఠ




క్రికెట్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న తరుణం రానే వచ్చింది. 2026 టీ20 ప్రపంచ కప్‌కు సమయం దగ్గరపడుతున్న వేళ, డిఫెండింగ్ ఛాంపియన్ టీమ్‌ఇండియా తన అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకుంటోంది. ఈ మెగా టోర్నీలో బరిలోకి దిగే భారత జట్టు కూర్పు ఎలా ఉండబోతోంది ఎవరెవరికి ఛాన్స్ దక్కుతుంది అనే ప్రశ్నలకు రేపు సమాధానం దొరకనుంది. ముంబయిలోని బీసీసీఐ హెడ్ క్వార్టర్స్‌లో శనివారం జరగబోయే అత్యంత కీలకమైన సమావేశంపై ఇప్పుడు అందరి ద ృష్టి పడింది. కేవలం ద్వైపాక్షిక సిరీస్ కోసమే కాకుండా, ప్రపంచ కప్‌ను ద ృష్టిలో ఉంచుకుని ఈ ఎంపిక జరగనుండటంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది.సౌతాఫ్రికాతో సిరీస్ ముగిసిన వెంటనే భారత సెలెక్టర్లు ముంబయిలో సమావేశం కానున్నారు. డిసెంబర్ 20న జరగనున్న ఈ భేటీలో న్యూజిలాండ్‌తో జరగబోయే హోమ్ సిరీస్‌కు, అలాగే 2026 టీ20 వరల్డ్ కప్‌కు సంబంధించిన జట్టును ఎంపిక చేయనున్నారు. ఈ సమావేశం అనంతరం కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ మీడియా ముందుకు వచ్చి వివరాలు వెల్లడించే అవకాశం ఉంది. అహ్మదాబాద్‌లో సౌతాఫ్రికాతో మ్యాచ్ ముగించుకుని సూర్య నేరుగా ముంబయి చేరుకోనున్నాడు.సౌతాఫ్రికాతో సిరీస్ ముగిసిన వెంటనే భారత సెలెక్టర్లు ముంబయిలో సమావేశం కానున్నారు. డిసెంబర్ 20న జరగనున్న ఈ భేటీలో న్యూజిలాండ్‌తో జరగబోయే హోమ్ సిరీస్‌కు, అలాగే 2026 టీ20 వరల్డ్ కప్‌కు సంబంధించిన జట్టును ఎంపిక చేయనున్నారు. ఈ సమావేశం అనంతరం కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ మీడియా ముందుకు వచ్చి వివరాలు వెల్లడించే అవకాశం ఉంది. అహ్మదాబాద్‌లో సౌతాఫ్రికాతో మ్యాచ్ ముగించుకుని సూర్య నేరుగా ముంబయి చేరుకోనున్నాడు.జట్టులో చాలావరకు స్థానాలు ఖరారైనప్పటికీ, కొన్ని స్లాట్స్ విషయంలో మాత్రం ఇంకా సందిగ్ధత కొనసాగుతోంది. ముఖ్యంగా వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఫామ్ ఆందోళన కలిగిస్తోంది. ఆసియా కప్ సమయంలో వైస్ కెప్టెన్‌గా ఎంపికైన గిల్, పొట్టి ఫార్మాట్‌లో మాత్రం తడబడుతున్నాడు. అతని కోసం సంజు శాంసన్‌ను బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్చడం లేదా పక్కన పెట్టడం వంటివి జరిగాయి. దీనికి తోడు లఖ్‌నవూ టీ20కి ముందు గిల్ మెడ గాయంతో ఇబ్బంది పడ్డాడు. దీంతో అతను ఫిట్ నెస్ సాధిస్తాడా లేద సెలెక్టర్లు కఠిన నిరయం తీసుకుంటారా అనేది చూడాలి. న్యూజిలాండ్ సిరీస్‌ను టీమ్‌ఇండియా వరల్డ్ కప్ సన్నాహకాల్లో చివరి అంకంలో భాగంగా చూస్తోంది. ఇప్పటికే అందుబా టులో ఉన్న ఆటగాళ్ల ఫామ్‌ను బట్టి పటిష్టమైన జట్టును తయారు చేయాలని మేనేజ్‌మెంట్ భావిస్తోంది. ఈ ఎంపికలో సీనియర్లకు విశ్రాంతి ఇస్తారా లేక యువకులకు పెద్దపీట వేస్తారా అనేది ఆసక్తికరంగా మారింది. ఏది ఏమైనా రేపు సాయంత్రానికల్లా వరల్డ్ కప్ భారత జట్టుపై ఒక క్లారిటీ వచ్చేస్తుంది.






# యువరాజ్ సింగ్, ఉతప్ప ఆస్తులు ఈడీ అటాచ్

**● బెట్టింగ్ యాప్ ప్రమోషన్ కేసులో కీలక పరిణామం**

ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ ప్రమోషన్ కేసులో కీలక పరిణామం జరిగింది. భారత మాజీ క్రికెటర్లు యువరాజ్ సింగ్, రాబిన్ ఉతప్ప ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అటాచ్ చేసింది. ఇందులో యువరాజ్ సింగ్ రూ. 2.5 కోట్లు, ఉతప్ప రూ. 8.26 లక్షల విలువైన ఆస్తులు ఉన్నాయి. ఈ ఇద్దరు ఆటగాళ్లతోపాటు ప్రముఖ సినీ సెలబ్రిటీల ఆస్తులను సైతం ఈడీ అటాచ్ చేసింది. మొత్తం రూ. 7.93 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది. ఈ లిస్ట్‌లో యువీ, ఉతప్పతోపాటు సినీ నటులు ఊర్వశీ రౌతెలా, సోనూ సూద్, మిమి చక్రవర్తి, అంకుశ్ హజారా, నేహా శెట్టి ఉన్నారు. వీళ్లంతా గతంలో '1%ఇదీవ్%' అనే ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించారు. ఈ అక్రమ బెట్టింగ్ యాప్ కేసు వ్యవహారంలో ఇప్పటికే వీళ్లకు నోటీసులు ఇచ్చిన దర్యాప్తు సంస్థ విచారించింది. అలాగే అనేక మందిని ఈ యాప్ లూటీ చేసినట్లు దర్యాప్తు సంస్థ విచారణలో తేలింది. ఇదే కేసులో ఇప్పటికే మాజీ క్రికెటర్లు సురేశ్ రైనా, శిఖర్ ధావన్ ఆస్తులను కూడా ఈడీ అటాచ్ చేసింది. మొత్తం రూ. 11.14 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది. ఈ సెలబ్రిటీలు అందరూ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ 1%ఇ% తో ఎండార్స్‌మెంట్ అగ్రిమెంట్లు చేసుకున్నారని, సోషల్ మీడియాలో యాప్‌ను ప్రమోషన్ చేశారని దర్యాప్తులో స్పష్టమైంది.కాగా, 2011 వన్డే వరల్డ్‌కప్‌లో టీమ్‌ఇండియా ఛాంపియన్‌గా నిలవడంలో యువరాజ్ సింగ్ కీలక పాత్ర పోషించారు. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన యువీ ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నిలిచాడు.

# కీలక పోరు కోసం టీమిండియాలో మార్పులు

## తుది జట్టులోకి సంజూ శాంసన్



అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా భారత్, దక్షిణాఫ్రికా మధ్య జరుగుతున్న ఐదో టీ20 సమరంలో టాస్ ముగిసింది. ఈ నిరయాత్మక పోరులో టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా కెప్టెన్ ఎయిడెన్ మార్క్రమ్ ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. దీంతో సూర్యకుమార్ యాదవ్ నేత ృత్వంలోని టీమ్ ఇండియా తొలుత బ్యాటింగ్ చేయనుంది. ఐదు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో భారత్ ఇప్పటికే 2-1 ఆధిక్య ంలో ఉండగా, ఈ మ్యాచ్ గెలిచి సరికొత్త చరిత్ర స ృష్టించాలని పట్టుదలగా ఉంది. ఎందుకంటే ఇప్ప టివరకు దక్షిణాఫ్రికాపై సొంత గడ్డపై భారత్ ఒక్క టీ20 సిరీస్ కూడా గెలవలేదు. ఈరోజు గెలిస్తే ఆ లోటు తీరిపోతుంది. ఈ కీలక పోరు కోసం టీమిండియా ప్లేయింగ్ ఎలెవన్‌లో మూడు ప్రధాన మార్పులు చేసింది. వ్యక్తిగత కారణాలతో గత మ్యాచ్‌కు దూరమైన స్పీడ్ స్టార్ జస్‌ప్రీత్ బుమ్రా తిరిగి జట్టులోకి రాగా, గాయపడిన శుభ్‌మన్ గిల్ స్థానంలో సంజూ శాంసన్ తుది జట్టులోకి వచ్చాడు. అలాగే కుల్దీప్ యాదవ్ స్థానంలో వాషింగ్టన్ సుందర్ కు చోటు దక్కింది. నెట్స్‌లో ప్రాక్టీస్ చేస్తుండగా కాలి బొటనవేలికి గాయం కావడంతో గిల్ ఈ మ్యాచ్‌కు దూరమయ్యాడు. మరోవైపు దక్షిణాఫ్రికా జట్టు తన పేసర్ అన్రిచ్ నోకియాను పక్కన పెట్టి, స్పిన్నర్ జార్జ్ లిండేను బరిలోకి దింపింది. ఈ మ్యాచ్‌లో అందరి కళ్లు యంగ్ సెన్సేషన్ అభిషేక్ శర్మపైనే ఉన్నాయి. విరాట్ కోహ్లీ పేరిట ఉన్న ఒక భారీ రికార్డును బద్దలు కొట్టేందుకు అతను కేవలం 47 పరుగుల దూరంలో ఉన్నాడు. ఒక క్యాలెండర్ ఇయర్ (ఏడాది)లో అత్యధిక టీ20 పరుగులు చేసిన భారత బ్యాటర్‌గా కోహ్లీ (2016లో 1614 పరుగులు) రికార్డును అభిషేక్ అధిగమించే అవకాశం ఉంది. అదే సమయంలో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఫామ్ టీమిండియాను కాస్త కలవరపెడుతోంది. ఈ ఏడాది ఆడిన 18 ఇన్నింగ్స్‌ల్లో సూర్య ఒక్క హాఫ్ సెంచరీ కూడా చేయలేకపోవడంతో, ఈరోజు భారీ ఇన్నింగ్స్ ఆడాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. దక్షిణాఫ్రికా జట్టుకు కూడా ఈ మ్యాచ్ చావోరే వో లాంటిది. సిరీస్ కోల్పోకుండా ఉండాలంటే వారు ఈ మ్యాచ్‌లో తప్పక గెలవాలి. 2023 జనవరి నుంచి ఆడిన 13 ద్వైపాక్షిక సిరీస్‌ల్లో దక్షిణాఫ్రికా కేవలం ఒక్కటి మాత్రమే గెలిచింది. ఈ గణాంకాలు చూస్తుంటే ఆ జట్టు ఎంతటి ఒత్తిడి లో ఉందో అర్థమవుతోంది. అయితే, అహ్మదాబాద్ పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలిస్తుంది కాబట్టి భారీ స్కోరు నమోదయ్యే అవకాశం ఉంది. రాత్రి వేళ మంచు కురిసే ఛాన్స్ ఉన్నందున, ఛేజింగ్ చేసే జట్టుకు ప్రయోజనం ఉంటుందని భావించి దక్షిణాఫ్రికా ఫీల్డింగ్ ఎంచుకుంది. మరి భారత బ్యాటర్లు దక్షిణాఫ్రికా బౌలర్లను ఎలా ఎదుర్కొంటారో చూడాలి. ఇరు జట్లు స్క్వాడ్స్ ఇవే టీమిండియా : అభిషేక్ శర్మ, సంజు శాంసన్, తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, జితేష్ శర్మ (వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్ దక్షిణాఫ్రికా స్క్వాడ్ : క్వింటన్ డికాక్ (వికెట్ కీపర్), రీజా హెండ్రిక్స్, ఐడెన్ మార్క్రం (కెప్టెన్), డెవాల్డ్ బ్రెవిస్, డేవిడ్ మిల్లర్, డోనోవన్ ఫెరీరా, జార్జ్ లిండే, మార్కో జెన్సన్, కార్బిన్ బాష్, లుంగీ ఎన్గిడి, ఓట్నీల్ బార్ట్‌మాన్




# ఫైనల్‌కు దూసుకెళ్లిన భారత్

**- తుదిపోరులో తలపడనున్న భారత్, పాకిస్థాన్**

అండర్ 19 ఆసియా కప్ 2025 వన్డే టోర్నీలో భారత్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. శ్రీలంకతో శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో సమష్టిగా రాణించిన భారత్ 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. వర్షం అంతరాయం కలిగించిన ఈ మ్యాచ్‌ను 20 ఓవర్లకు కుదించగా. భారత కుర్రాళ్లు ఆరోన్ జార్జ్(49 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 58 నాటౌట్), విహాన్ మల్హోత్రా(45 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 61 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీలతో భారత విజయంలో కీలక పాత్ర పోషించారు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిరీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 138 పరుగులు చేసింది. కెప్టెన్ విమత్ దిన్సారా(29 బంతుల్లో 4 ఫోర్లతో 32), చమికా హీనాటిగలా(38 బంతుల్లో 3 ఫోర్లతో 42) టాప్ స్కోరర్లుగా నిలిచారు. భారత బౌలర్లలో హెనిల్ పటేల్, కాన్షిక్ చౌహన్ రెండేసి వికెట్లు తీయగా.. కిషన్ సింగ్, దీపేష్ దేవంద్రన్, ఖిలాన్ పటేల్ తలో వికెట్ తీసారు. అనంతరం భారత అండర్ 19 టీమ్ 18 ఓవర్లలో 2 వికెట్లకు 139 పరుగులు చేసి మరో 12 బంతులు మిగిలి ఉండగానే విజయాన్ని కైవసం చేసుకుంది. కెప్టెన్ ఆయుష్ మాత్రే(7)తో పాటు వైభవ్ సూర్యవంశీ(9) విఫలమైనా.. ఆరోన్ జార్జ్(49 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 58 నాటౌట్), విహాన్ మల్హోత్రా(45 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 61 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీలతో రాణించారు.శ్రీలంక బౌలర్లలో రసిత్ నిమ్సారా(2/31) ఒక్కడే రెండు వికెట్లు తీసాడు. ఐపీఎల్ 2026 మినీ వేలంలో విహాన్ మల్హోత్రాను ఆర్‌సీబీ రూ. 30 లక్షలకు కొనుగోలు చేసిన విషయం తెలిసిందే.మరో సెమీఫైనల్లో బంగ్లాదేశ్‌పై పాకిస్థాన్ అండర్ 19 టీమ్ 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. 27 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 121 పరుగులకు ఆలౌటైంది.

# ఇషాన్ కిషన్ సిక్సర్లతో వీర విహారం!

సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ 2025 సీజన్‌లో జారండ్ ఛాంపియన్‌గా నిలిచింది. హర్యానాతో గురువారం జరిగిన ఫైనల్లో ఇషాన్ కిషన్ సారథ్యంలోని జారండ్.. 69 పరుగుల తేడాతో గెలుపొందింది. ఇషాన్ కిషన్(49 బంతుల్లో 6 ఫోర్లు, 10 సిక్స్‌లతో 101) విధ్వంసకర శతకంతో జారండ్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. జారండ్‌కు ఇదే తొలి సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ టైటిల్.ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన జారండ్ నిరీత 20 ఓవర్లలో 3 వికెట్లకు 262 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఇషాన్ కిషన్ భారీ శతకానికి తోడుగా కుమార్ కుశాగ్ర(38 బంతుల్లో 8 ఫోర్లు, 5 సిక్స్‌లతో 81) హాఫ్ సెంచరీతో రాణించాడు. హర్యానా బౌలర్లలో అన్షుల్ కంబోజ్, సుమిత్ కుమార్, సుమంత్ జాఖర్ తలో వికెట్ తీసారు. అనంతరం హర్యానా 18.3 ఓవర్లలో 193 పరుగులకు ఆలౌటైంది. యశ్వర్ధన్ దలాల్(22 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్స్‌లతో 53) హాఫ్ సెంచరీతో రాణించగా.. నిశాంత్ సింధు(31), సమంత్ జఖర్(38) రాణించినా ఫలితం లేకపోయింది. జారండ్ బౌలర్లలో సుశాంత్ మిశ్రా, బాల్ క ృష మూడేసి వికెట్లు తీయగా.. వికాస్ సింగ్, అంకుల్ రాయల్ రెండేసి వికెట్లు పడగొట్టారు.ఈ మ్యాచ్‌కు ఇషాన్ కిషన్ ఇన్నింగ్స్ హైలైట్‌గా నిలిచింది. సెంచరీ అనంతరం తగ్గేదేలే అంటూ అతను చేసుకున్న సంబరాలు నెటిజన్లను ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా సన్‌రైజర్స్ హైదరాబాద్ అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాటేరమ్మ చిన్నకొడుకు చెలరేగడాని, కావ్య పాపను పట్టలేమని ఫ్యాన్స్ కామెంట్ చేస్తున్నారు. సరిగ్గా టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీకి ముందే ఇషాన్ కిషన్ సెంచరీతో చెలరేగడం చర్చనీయాంశమైంది. భారత టీ20 జట్టులో శుభ్‌మన్ గిల్ తడబడుతుండటంతో ఇషాన్ కిషన్‌కు సెలెక్టర్లు అవకాశం ఇస్తారా అనే చర్చ తెరపైకి వచ్చింది. వన్డేల్లో డబుల్ సెంచరీ బాదిన అత్యంత పిన్నవయస్కుడిగా నిలిచిన ఇషాన్ కిషన్.. ఆ తర్వాత పేలవ ఫామ్‌తో భారత జట్టుకు దూరమయ్యాడు. ఐపీఎల్ ప్రదర్శనతో 22 ఏళ్ల వయసులోనే భారత జట్టులో చోటు దక్కించుకొని మూడు ఫార్మాట్‌లు ఆడిన ఇషాన్ కిషన్.. ఆ ఫామ్‌ను కొనసాగించలేకపోయాడు.మానసిక స్థితి సరిగా లేదని జట్టు నుంచి తప్పుకోవడం అతని కెరీర్‌పై ప్రభావం చూపించింది. ఆ తర్వాత దేశవాళీ క్రికెట్ ఆడాలనే బీసీసీఐ ఆదేశాలను బేఖాతరు చేయడంతో సెంట్రల్ కాంట్రాక్ట్‌ను కోల్పోయాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లోనూ తీవ్రంగా నిరాశపర్చాడు. సెంచరీతో మొదలుపెట్టిన ఇషాన్.. ఆ జోరును కొనసాగించలేకపోయాడు.దేశవాళీ క్రికెట్‌లో తిరిగి ఫామ్ అందుకున్న ఇషాన్.. రంజీ క్రికెట్‌లో మెరుగైన ప్రదర్శన చేశాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో 2 సెంచరీలు, 2 హాఫ్ సెంచరీల సాయంతో 517 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు.



## 'అఖండ 2' సక్సెస్.. వారణాసిలో బాలయ్య, బోయపాటి ప్రత్యేక పూజలు



నందమూరి బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వచ్చిన 'అఖండ 2' చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని నమోదు చేసింది. ఈ సినిమా విజయోత్సాహంలో భాగంగా బాలకృష్ణ, బోయపాటి శ్రీను వారణాసిలో పర్యటించి కాశీ విశ్వనాథుని దర్శించుకున్నారు. సినిమా సక్సెస్ అయిన సందర్భంగా చిత్ర బృందం వారణాసిలో ప్రత్యేక పూజలు నిర్వహించింది. ఈ పర్యటనలో బాలకృష్ణ, బోయపాటి ఇద్దరూ సంప్రదాయ పట్టు వస్త్రాలు ధరించి కనిపించారు. దీనికి సంబంధించిన ఒక వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అభిమానులు ఈ వీడియోను విస్తృతంగా షేర్ చేస్తున్నారు.డిసెంబర్ 12న విడుదలైన 'అఖండ 2' చిత్రానికి ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. హిందుత్వం, ఆధ్యాత్మికత నేపథ్యంతో తెరకెక్కిన ఈ చిత్రంలో సంయుక్త మీనన్ కథానాయికగా, ఆది పినిశెట్టి ప్రతినాయకుడిగా నటించారు.

## తెలుగు సినిమాలను మిస్ అవుతున్నా...



టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా వెలిగిన రకుల్ ప్రీత్ సింగ్, తాను మళ్లీ తెలుగు సినిమాల్లో నటించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. మంచి కథ కోసం ఎదురుచూస్తున్నానని, 'బాహుబలి' వంటి గొప్ప చిత్రంలో నటించడం తన కల అని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.హైదరాబాద్‌లోని పంజాగుట్టలో ప్రముఖ మేకప్ ఆర్టిస్ట్ కడాలి చక్రవర్తి (చక్రి) కొత్తగా ఏర్పాటు చేసిన "సెకండ్ స్కిన్ మేకప్ స్టూడియో – అకాడమీ"ని రకుల్ ప్రీత్ సింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ, తెలుగు చిత్ర పరిశ్రమతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు."నాకు తొలి విజయాన్ని అందించింది తెలుగు సినిమానే. ఇక్కడి ప్రేక్షకులు నన్ను ఎంతో ఆదరించారు. ఈ మధ్య కాలంలో తెలుగు సినిమాలు చేయకపోవడంతో అందరినీ చాలా మిస్ అవుతున్నాను. మంచి కథ దొరికితే తప్పకుండా నటిస్తాను. నా అభిమానులంతా నా కోసం ప్రార్థించండి" అని రకుల్ కోరారు. హైదరాబాద్‌లో ఉండి షూటింగ్ చేయాలనే కోరిక బలంగా ఉందని, ప్రస్తుతం కొన్ని కథలు వింటున్నానని ఆమె వెల్లడించారు.'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైన రకుల్, అతి తక్కువ కాలంలోనే ఎన్టీఆర్, మహేశ్ బాబు, రామ్ చరణ్ వంటి అగ్ర హీరోలతో కలిసి నటించి స్టార్‌డమ్ సంపాదించారు. ప్రస్తుతం బాలీవుడ్ చిత్రాలపై దృష్టి సారించిన ఆమె, నిర్మాత జాకీ భగ్నానీని వివాహం చేసుకున్న విషయం తెలిసిందే.

## 'పుష్ప 2' రికార్డు బ్రేక్ చేసిన 'ధురంధర్'...

### ఓటీటీలో ఆల్ టైమ్ రికార్డు!




బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ నటించిన స్పై యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్' థియేటర్లలో రికార్డులు సృష్టిస్తూనే, ఓటీటీ డీల్‌లోనూ కొత్త సంచలనానికి తెరలేపింది. ఈ సినిమా డిజిటల్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ కళ్లు చెదిరే ధరకు సొంతం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం, ఈ డీల్ విలువ ఏకంగా రూ. 285 కోట్లుగా ఉంది. ఇది ఇటీవలే 'పుష్ప 2' సాధించిన రూ. 275 కోట్ల ఓటీటీ డీల్‌ను అధిగమించడం గమనార్హం.'ఉరీ' ఫేమ్ ఆదిత్య ధర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం డిసెంబర్ 5న విడుదలైంది. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా రూ. 700 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించి, రూ. 1000 కోట్ల క్లబ్ వైపు దూసుకెళుతోంది. ఈ నేపథ్యంలోనే ఓటీటీ హక్కులకు భారీ పోటీ ఏర్పడింది. నిబంధనల ప్రకారం, థియేటర్లలో విడుదలైన 8 వారాల తర్వాత, అంటే 2026 జనవరి 30 లేదా ఫిబ్రవరి మొదటి వారంలో 'ధురంధర్' నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అయ్యే అవకాశం ఉంది.అయితే, ఈ సినిమాకు సీక్వెల్ కూడా ఉండటంతో నెట్‌ఫ్లిక్స్ కుదుర్చుకున్న రూ. 285 కోట్ల ఒప్పందం కేవలం మొదటి భాగానికా లేక రెండు భాగాలకు కలిపా అన్న దానిపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ చిత్రంలో ఆర్. మాధవన్, సంజయ్ దత్, అక్షయ్ ఖన్నా, అర్జున్ రాంపాల్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషించారు. ఇక 'ధురంధర్: రివెంజ్' పేరుతో రానున్న రెండో భాగం 2026 మార్చి 19న విడుదల కానుంది.

## ట్రంప్ ఇచ్చిన క్రిస్మస్ విందుకు హాజరైన బాలీవుడ్ నటి మల్లికా షెరావత్



ప్రముఖ బాలీవుడ్ నటి మల్లికా షెరావత్‌కు అరుదైన గౌరవం దక్కింది. అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్‌లో జరిగిన క్రిస్మస్ విందుకు ఆమెకు ప్రత్యేక ఆహ్వానం అందింది. నిన్న జరిగిన ఈ వేడుకకు హాజరైన మల్లిక, తన ఆనందాన్ని సోషల్ మీడియా ద్వారా పంచుకున్నారు. ఇవాళ ఇన్‌స్టాగ్రామ్‌లో అక్కడి ఫొటోలను, వీడియోలను షేర్ చేశారు.ఈ వేడుకలో పాల్గొనడం "మాటల్లో చెప్పలేని అద్భుతమైన అనుభూతి" అని మల్లికా పేర్కొన్నారు. తనకు ఈ గౌరవం దక్కినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అందంగా అలంకరించిన క్రిస్మస్ చెట్లు, విద్యుత్ దీపాల మధ్య దిగిన ఫొటోలను ఆమె పోస్ట్ చేశారు. ఈ సందరరేగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న వీడియోను కూడా ఆమె పంచుకున్నారు. ఆ వీడియోలో ప్రేక్షకుల్లో మల్లిక కూడా కనిపించారు.మల్లికా షెరావత్‌కు వైట్‌హౌస్ నుంచి ఆహ్వానం రావడం ఇది రెండోసారి. గతంలో 2011లో బరాక్ ఒబామా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు వైట్‌హౌస్ కరస్పాండెంట్స్ డిన్నర్‌కు ఆమె హాజరయ్యారు. 2008 అమెరికా ఎన్నికల నేపథ్యంలో తెరకెక్కిన 'పాలిటిక్స్ ఆఫ్ లవ్' చిత్రంలో నటించినందుకు అప్పట్లో ఆమెను ఆహ్వానించారు.కెరీర్ విషయానికొస్తే, 'మర్డర్' సినిమాతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన మల్లిక.. 'హిస్స్', 'పాలిటిక్స్ ఆఫ్ లవ్' వంటి అంతర్జాతీయ చిత్రాల్లో కూడా నటించారు. ఇటీవల ఆమె రాజ్‌కుమార్ రావ్, తృప్తి డిమ్రితో కలిసి 'విక్కీ విద్యా కా వో వాలా వీడియో' చిత్రంలో కనిపించారు.

## చూసేవాళ్ల కళ్లలోనే లోపం

### విమర్శలను కొట్టిపారేసిన నటుడు



ప్రముఖ నటుడు ఆదిత్య ధర్ దర్శకత్వంలో వచ్చిన 'ధురంధర్' సినిమా ట్రైలర్ లాంచ్‌లో జరిగిన ఓ సంఘటనపై సీనియర్ నటుడు రాకేశ్ బేడీ తాజాగా స్పందించారు. ఈ సినిమాలో ఆయన 71 ఏళ్ల రాజకీయ నాయకుడి పాత్ర పోషించగా, 20 ఏళ్ల సారా అర్జున్ ఆయన కూతురిగా నటించింది. ట్రైలర్ విడుదల కార్యక్రమంలో రాకేశ్, సారాని ఆప్యాయంగా పలకరించిన వీడియో వైరల్ అయింది. ఆయన ఆమె భుజంపై ముద్దు పెడుతున్నట్లు కనిపించడంతో సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. దీనిపై రాకేశ్ స్పందిస్తూ 'ఇది చాలా మూర?త్వం' అని కొట్టిపారేశారు."సారా వయసులో నా కన్నా సగానికంటే తక్కువ. సినిమాలో నా కూతురిగా నటించింది. షూటింగ్ సమయంలో కలిసినప్పుడల్లా ఒక తండ్రికి కూతురు ఎలా ఆప్యాయంగా హగ్ ఇస్తుందో, తను కూడా నన్ను అలాగే పలకరించేది. మా మధ్య మంచి తండ్రీకూతుళ్ల బంధం ఉంది. ఆ రోజు వేదికపై కూడా అదే ఆప్యాయతను చూపించాను. కానీ ప్రజలు అందులోని ప్రేమను చూడటం లేదు. చూసేవాళ్ల కళ్లలోనే లోపం ఉంటే మనమేం చేయగలం?" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.సారా తల్లిదండ్రులైన నటుడు రాజ్ అర్జున్, సన్య కూడా ఆ కార్యక్రమానికి హాజరయ్యారని రాకేశ్ గుర్తు చేశారు. "ఆమె తల్లిదండ్రులు అక్కడే ఉండగా, బహిరంగంగా అందరి ముందు నేనెందుకు చెడు ఉద్దేశంతో అలా ప్రవర్తిస్తాను? సోషల్ మీడియాలో చిన్న విషయాన్ని పెద్దది చేసి వివాదం సృష్టించడం అలవాటైపోయింది" అని ఆయన అన్నారు.





## ట్రైలర్ టాక్: బైరాన్‌పల్లి యుద్ధంలో ఫుట్‌బాల్ ఛాంపియన్

టాలీవుడ్ లో ఇప్పుడు పిరియాడిక్ సినిమాల ట్రెండ్ నడుస్తోంది. ఆ కోవలోకే వస్తోంది వైజయంతీ మూవీస్ సమర్పణలో స్వప్న సినిమా నిర్మిస్తున్న 'ఛాంపియన్'. ఇప్పటికే టీజర్ తో మంచి బజ్ క్రియేట్ చేసిన ఈ సినిమా ట్రైలర్ ను మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ చేతుల మీదుగా గ్రాండ్ గా రిలీజ్ చేశారు. ట్రైలర్ చూస్తుంటేనే ఇదొక ఎపిక్ డ్రామా అని అర్థమైపోతోంది. రోషన్ కెరీర్ లోనే ఇది బిగ్గెస్ట్ బడ్జెట్ సినిమాగా కనిపిస్తోంది.కథ విషయానికి వస్తే 1948 నాటి హైదరాబాద్ బ్యాక్ డ్రాప్ లో సినిమాను సెట్ చేశారు. స్వాతంత్ర్యం వచ్చినా హైదరాబాద్ సంస్థానంలో ఉన్న ఉద్రిక్త పరిస్థితులు, రజాకార్ల ఆగడాలను కళ్ళకు కట్టినట్లు చూపించారు. ఇందులో హీరో రోషన్ ఒక ఫుట్‌బాల్ ప్లేయర్ గా కనిపిస్తున్నాడు. లండన్ వెళ్లి వరల్డ్ ఛాంపియన్ అవ్వాలనేది అతని కల. కానీ విధి అతన్ని ఆట మైదానం నుంచి యుద్ధభూమికి ఎలా లాక్కొచ్చింది అనేది చాలా ఆసక్తికరంగా చూపించారు.విజువల్స్ పరంగా సినిమా స్ట్రాంగ్ గా ఉన్నట్లు అనిపిస్తోంది. బైరాన్‌పల్లి ఇన్సిడెంట్, ఆనాటి పల్లెటూరి వాతావరణం, రజాకార్ల దాడులు.. ప్రతీ ఫ్రేమ్ లో మేకర్స్ పెట్టిన ఖర్చు కనిపిస్తోంది. చరణ్ అన్నట్లుగానే ఇది 'లగాన్' సినిమాను గుర్తు చేస్తూనే, దానికి ఫుల్ యాక్షన్ జోడించినట్లుగా ఉంది. ముఖ్యంగా యుద్ధ సన్నివేశాల్లో వచ్చే బ్లాస్టింగ్స్, గన్ ఫైట్స్ గూస్ బంప్స్ తెప్పిస్తున్నాయి.హీరోగా రోషన్ మేకోవర్ కూడా కొత్తగా ఉంది. ఫస్ట్ హాఫ్ లో ఒక స్టైలిష్ ఫుట్‌బాల్ ప్లేయర్ గా, సెకండ్ హాఫ్ లో తుపాకీ పట్టిన రెబల్ గా రెండు వేరియేషన్స్ లో ఇరగదీశాడు. "ఈ ఊరుని విడవడం.. నా ప్రాణం విడిచినప్పుడే సుందరయ్య" వంటి డైలాగ్స్ సినిమాలోని ఎమోషనల్ డెప్త్ ను చూపిస్తున్నాయి.

## రేసులోనే పెద్ది..

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ పెద్ది సినిమా 2026 మార్చి 27న రిలీజ్ లాక్ చేశారు. బుచ్చి బాబు డైరెక్షన్ లో తెరకెక్కుతున్న ఈ సినిమాను మైత్రి మూవీ మేకర్స్, వృద్ధి సినిమాస్ కలిసి నిర్మిస్తున్నారు. ఏ.ఆర్ రెహమాన్ మ్యూజిక్ అందిస్తున్న ఈ సినిమాలో చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తుంది. ఆల్రెడీ సినిమా నుంచి రిలీజైన చికిరి సాంగ్ సెన్సేషనల్ హిట్ కాగా ఫస్ట్ షాట్ గా వచ్చిన టీజర్ పెద్ది పై హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. ఐతే పెద్ది సినిమా రిలీజ్ విషయంలో ఇంకా డౌట్ కొనసాగుతూనే ఉంది. ది ప్యారడైజ్, పెద్ది రెండు సినిమాలు.. చరణ్ పెద్ది సినిమాను మార్చి 27 రిలీజ్ ఫిక్స్ చేశారు. మార్చి 26న నాని ది ప్యారడైజ్ సినిమా వస్తుంది. శ్రీకాంత్ ఓదెల డైరెక్షన్ లో దసరా తర్వాత వస్తున్న ది ప్యారడైజ్ మీద భారీ హైప్ ఏర్పడింది. ది ప్యారడైజ్, పెద్ది రెండు సినిమాలు వెంట వెంటనే రిలీజ్ అవుతున్నాయి. రెండు సినిమాలు రెండు డిఫరెంట్ కంటెంట్ తో వస్తున్నాయి. రేసులో ఏ సినిమా కూడా వెనక్కి తగ్గే ప్రసక్తే లేదనిపిస్తుంది. ఐతే రీసెంట్ గా పెద్ది సినిమానే మార్చి 27 నుంచి సమ్మర్ కి షిఫ్ట్ అవుతుందని టాక్ వచ్చింది. కానీ ఆ వార్తలకు మరోసారి హీరో ద్వారా చెక్ పడింది. లేటెస్ట్ గా ఛాంపియన్ సినిమా ఈవెంట్ కి వచ్చిన చరణ్ పెద్ది సినిమా మార్చి 27న వస్తుందని మరోసారి అనౌన్స్ చేశాడు. సో పెద్ది అయితే అనుకున్న డేట్ కే వచ్చేలా దాదాపు ఫిక్స్ అయినట్టే. ఇక నాని కూడా తన ప్రమోషన్స్ లో మార్చి 26 రిలీజ్ అని చెబుతున్నాడు. పవన్ కళ్యాణ్ ఉస్తాద్ భగత్ సింగ్.. పెద్ది డేట్ న పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఉస్తాద్ భగత్ సింగ్ రిలీజ్ అనుకున్నారన్న టాక్ వచ్చింది. కానీ మళ్లీ ఆ ప్రయత్నాన్ని వెనక్కి తీసుకున్నారు. పవన్ కళ్యాణ్ ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాను సమ్మర్ కి షిఫ్ట్ చేసి పెద్దిని అనుకున్న డేట్ కే తీసుకు రావాలని ప్లాన్ చేశారు మైత్రి మూవీ మేకర్స్. సో చరణ్ అనౌన్స్ మెంట్ తో మరోసారి పెద్ది అనుకున్న డేట్ కి రావడం పక్కా అని తెలుస్తుంది.




Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,

Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com